శ్రీ

చింతామణి.

ఇది మాసమున కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౫] రాజమహేంద్రవరము. [సంచిక. ౭.
మన్మథ సంవత్సర ఆశ్వయుజమాసము.

అహల్యాబాయి.

హోల్కారు సంస్థానమును స్థాపించిన మల్హారిరావు ౧౭౬౪ వ సంవత్సరము వఱకును రాజ్యముచేసి యాసంవత్సరమునందు మృతినొందెను. ఈ మల్హారిరావునకు ఖండీరావను నతఁడేకపుత్రుఁడయియుండి యహల్యాబాయి యను నామెను వివాహమాడి యామెవలన మాలీరావను నొక కుమారుని ముక్తాబాయి యను నొక కొమారితను గని తండ్రి జీవితకాలములోనే ౧౭౫౪ వ సంవత్సరమున భిల్లులచేత చంపఁబడెను. అందుచేత మల్హారిరావుయొక్క మరణానంతరమున మనుమఁడైన మాలిరావు సింహాసన మెక్కెనుగాని రాజ్యమునకువచ్చిన తొమ్మిదిమాసములలోనే యతఁడు లోకాంతరగతుఁడయ్యెను. అంతవఱకును వైధవ్యదుఃఖమునను భవించుచు నేకభుక్తయయి బ్రహ్మచర్యవ్రతము నడుపుచుండిన యహల్యాబాయి యప్పుడు తానే రాజ్యభారమును వహించుటకు నిశ్చయించుకొనెను. అహల్యాబాయి గుణవంతురాలయినను సౌందర్యవంతురాలు కాదు; ఆమె నల్లరూపున సన్నఁగానుండెను. ఆమెకు చదువు వచ్చును; పురాణములు స్వయముగా చదువుకొనుచుండును. అందుచే నామె పూర్వాచారములయందు విశ్వాసముకలదయి మెడయందొక్క పట్టెడను దక్క నితరాభరణములు వేనిని ధరింపక సాధారణమయిన తెల్లబట్టను కట్టుకొని యొంటిపూట భోజనము చేయుచు పూర్వపద్ధతిని దానములను ధర్మములను జేయుచుండును.

ఇట్టి యీమె స్వయముగా రాజ్యభారమును వహింప నిశ్చయించుకొన్నప్పుడు స్త్రీ రాజ్యపరిపాలనము చేయుట కిష్టము లేనివారయి పుత్రస్వీకారము చేసికోవలసినదని ప్రధానమంత్రియైన గంగాధర జస్వంతరావు మొదలైనవారందఱు నామెకు మొట్టమొదట హితబోధచేసిచూచిరి. ఈ గంగాధర జస్వంతరావు మంత్రిమాత్రమే కాక యాచార్యుఁడును, రాఘోబాతో [illegible] యత్యంతమిత్రుఁడుగాఁ

గలదు అయినను కడుపునఁబుట్టిన కూఁతురుండఁగా నెవ్వనినో పెంచుకొని రాజ్యము నన్యాక్రాంతము చేయుట కిష్టము లేనిదయి యహల్యాబాయి యాతని హితబోధను నిరక యుపేక్షించి తానే దేశపరిపాలనము చేయసాగెను అంతేకాక ధనాశాపరులయిన బంధుబృందముతోను గంగాధరాది మంత్రివర్గముతోను ఆలోచింపక యామె స్వతంత్రు రాలయి ప్రజాసౌఖ్యకరముగా రాజ్యతంత్రము నిర్వహింపఁజొచ్చెను. అందుచేత వారు విఫలమనోరథులయి, బాలుఁడయిన స్వీకృతపుత్రుఁ డెవ్వఁడైన రాజ్యమునకు వచ్చెడు పక్షమున నధికారమంతయు తమచేతులలో నుంచుకొని ధనాకర్షణము చేయవచ్చు నన్న దురాశచేత నందఱును జేరి కుతంత్రము పన్ని యామెను బెదరించి తమ యభీష్ట మును సాధింపవచ్చునన్న నమ్మకముతో “న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి” యన్న వాక్యమును స్మరణకుఁదెచ్చుచు సాధ్యమైనంత శీఘ్రముగా పుత్రస్వీకారము చేసికొని రాజ్యము మంత్రుల యధీనము చేయవలసినదని యామెకొక లేఖను వ్రాసిపంపిరి.

ఉత్తరము చూచినంతమాత్రముచేత బెదరి వారికి లోఁబడుట కామె వారను కొన్నట్లు దుర్బలాంగన గాక మనోబలమును బుద్ధిబలమునుగల ప్రౌఢయయి సామర్థ్య ముతో తన యధికారమును జూప నిశ్చయించుకొన్న రాణియయ్యెను. ఈకుతంత్రములో గంగాధర జస్వంతరావును రాజబంధువులును మాత్రమే కాక రాజకీయోద్యోగులలో ననేకులు కూడఁ జేరియుండిరి. గంగాధర జస్వంతు లంచమిచ్చి పునహాపేష్వాయగు మాధవరావు పినతండ్రియగు రఘునాథరావును దన పక్షమునఁ జేర్చుకొని యాతని మూలమున నహల్యాబాయిని నిర్బంధపఱచుటకుఁ బ్రయత్నము చేసెను. అహల్యా బాయిమాత్ర మేమాయోపాయములకును లోనుగాక కడవఱకును దృఢచిత్తురాలయి నిలిచి మొదటినుండియు ప్రతిపక్షుల కుతంత్రములను జాగరూకతతో చారముఖమున వీక్షించుచు తగిన ప్రతిక్రియ నాలోచించుచుండెను. ఇట్లు సర్వమును సన్నద్ధమయిన తరువాత నామె రాజద్రోహుల యొద్దకడను వారు సమావేశమగు తావులను ముందు గానే సైనికులను బెట్టి, బాణములతో నిండియున్న యమ్ములపొదులను ధనుస్సులను తానెక్కిన యేనుఁగుమీఁదఁ బెట్టించి తానే సేనాముఖమున బయలువెడలి, రాజ ద్రోహులపేర “మీ బెదరింపులకు నేను భయపడి రాజ్యమును విడుతునని యెన్నఁడును తలఁపఁబోకుఁడు. నేను మహారాష్ట్ర స్త్రీనన్నమాట మఱచిపోక, మిమ్మేలిన రాణికి కోపము తెప్పించినప్పుడు మీయందఱిగతియు నేమగునో స్మరణకుఁ దెచ్చుకొనుఁడు. మీరు రాజద్రోహము తలఁచినట్లు నాకు నిశ్చయముగా తెలియవచ్చినందున, మిమ్మందఱిని బట్టి చెఱసాలయందుఁ బెట్ట నియమించినాను” అని యుత్తరము వ్రాసిపంపెను. వారా యుత్తరమును జదువుకొని ముగించునప్పటికే యాయుధహస్తులైన రాజకీ-

లోపల ప్రవేశించి వారినందఱిని బట్టుకొనిరి. అంతట గంగాధర జస్వంతు మొదలయిన వారు విధేయులయి క్షమార్పణముచేసి శరణుచొచ్చినందున, రాష్ట్రమునకు వారు పూర్వముచేసిన యుపకారమునుదలఁచి యహల్యాబాయి వారినందఱిని క్షమించి విడిచిపెట్టెను.

హీనవంశమునందుఁ బుట్టినవాఁడయ్యును ప్రభుభక్తియు సామర్థ్యమును గలవాఁడయిన తుక్కాజీ హుల్కారు నామె తన సేనల కధ్యక్షునిఁగాఁ జేసికొనెను; వెనుకటినుండియు సంస్థానమునందుండి ప్రజలనుబాధించి లంచములుపుచ్చుకొన మరఁగిన దుష్టోద్యోగుల నందఱిని క్రమక్రమముగా కొలువునుండి తొలఁగించి వారిస్థానము సమర్థులును న్యాయపరులునయిన వారిని నియమించెను. హుల్కారు రాజ్యమున వచ్చినవారిలో నింతచక్కఁగా ధర్మపరిపాలనము చేసిన వారు మఱియెవ్వరును లేరు.

ఆశాభంగమునొంది రాణియెడల విరక్తులయియున్న రాజకీయోద్యోగి తోడ్పాటు కలుగుననియు రాజ్యభారమును పూనియున్న రాణి స్త్రీజనస్వాభావమయిన భీరుత్వముకలదయి తన్నెదిరింప సమర్థురాలు కాకపోవుననియు నమ్మి యుదయపుర మహారాజు తన రాజపుత్రసైన్యముతో నామె రాష్ట్రముమీఁద దండెత్తివచ్చి నింబపురదుర్గము నాక్రమించుకొని తద్దుర్గాధ్యక్షుఁడయిన శివనానాను తఱిమివేసె ఈవార్త చెవినిబడఁగానే యహల్యాబాయి సేనాధ్యక్షులగు తుక్కాజీని శ్రీభాం అయిదువేల సేనలతో ముందుగాఁబంపి, వారివెనుకఁ దానును బలిష్ఠమైన సేన యుద్ధయాత్ర వెడలెను. ఆ సేనానాయకులు శీఘ్రప్రయాణములుచేసి నింబపురము మరల స్వాధీనముచేసికొని రాజపుత్రుల నక్కడనుండి పాఱఁదోలిరి. అహల్యాబాం గొప్పసేనతో వచ్చుచున్నదని విని రాజపుత్రు ల[illegible] దేశమునువిడిచి తొలఁ[illegible] పోయిరి.

ఇట్లు శత్రువులను జయించినతరువాత తన ప్రజలకుఁ దఱచుగాఁ గలుగుచున్న దోపుడుకాండ్రవలని యుపద్రవమునుకూడ తొలఁగించి దేశమును నిష్కంటకముచేయవలెనని యామెనిశ్చయించుకొనెను. హుల్కారురాజ్యమునం దేఁబదివేలకంటె నెక్కువగానున్న భిల్లులు మొదలయినవారు పెక్కుతరములనుండి దొంగతనములచేత జీవనముచేయుచుండిరి. ఇట్టివారిబాధనువారించి దేశక్షేమముకలుగఁజేయుటకు కృతనిశ్చయయి యామె యొక్కనాఁడు తన రాష్ట్రములో తస్కరబాధ లేకుండఁజే[illegible] వీరపురుషునకుఁ దన కొమారితనిచ్చి వివాహముచేసెదనని సభలో బహిరంగముగా బలికెను. జస్వంతరావను నతఁడపుడే తానాదుష్కరకార్యమును నిర్వహించెదనని దీ[illegible] సాధించెను. ఆమె జీవితకాలములో నాదేశమందెక్కడను వ

బందిపోటు దొంగతనము జరగలేదు. రాణియు తానుచేసిన వాగ్దానమును చెల్లించి తన కూఁతురయిన ముక్తాబాయి నాతనికిచ్చి వివాహముచేసెను కాని యతఁడు చిరకాలము వివాహసౌఖ్యము ననుభవింపక యామెవలన నొక్కపుత్రునిమాత్రము గని పుట్టినశిశువుపోయిన కొంతకాలమునకు తానును కాలధర్మము నొందెను. అప్పుడు ముక్తాబాయి భర్తతో తాను సహగమనముచేసెదనని చెప్పెను. తన నిమిత్తమయి యాప్రయత్నమును విడిచిపెట్టవలసినదని యామె కొమారితను బతిమాలుకొనెనుగాని ముక్తాబాయి "అమ్మా! నీవు పెద్దదానవయినావు. నీవిఁక చిరకాలము బ్రతుకఁబోవు. •యేక శిశువును భర్తయుఁగూడ పరలోకగతులయిరి, నీకును వారిగతి పట్టినప్పుడు •కు బ్రతుకు దుర్భరమగును. గౌరవముతో దేహమును విడిచెడి భాగ్యము నాకప్పుడు •ంపుము" అని పలికి తనపట్టును మానకపోయెను. అప్పటికామె సమ్మతించి శ్మశాన •టికకు తానుగూడ నడిచెనుగాని, కూఁతురెక్కిన పితికగ్ని సూత్రము తగిలించి •డుచూచి సహింపలేక రోదనముచేయుచు మండుచున్న చితినుండికొమారిత •కుఁ దెచ్చెదనని ముందుకుఁ బరుగెత్తెనుగాని బ్రాహ్మణు లామెనుబట్టుకొని •వి వెనుకకుఁ దీసికొనివచ్చిరి. శాస్త్రములయందెంత విశ్వాసముగలవారికైనను, •కియున్నప్రాణిని చచ్చినపీనుఁగుతోఁ గట్టి కాల్చునప్పుడది క్రూరకృత్యమని •ఁచకుండునా?

రాజ్యవైభవము ననుభవించుచుండినను, అహల్యాబాయి గర్వితురాలును, స్త్రప్రియురాలును, అసూయాపరురాలును, అయియుండక యీశ్వరభక్తియు •పభీతియు కలదయి యెల్లప్పుడును పరులమేలునకయి పాటుపడునదిగానుండెను. •కసారి యొకకవిశ్వరుఁడు స్తోత్రపాఠములుచేయుచు నామెపయి నొక గ్రంథమును •చియించి తెచ్చి యామెకువినిపించెను. ఆమె యా గ్రంథము సాంతముగా విని •గియఁగానే "పాపాత్మురాలనయిన నేనిట్టి స్తోత్రముల కర్హురాలనుకాను" అనిపలికి •రాపుస్తకమునుజించి యేటిలో పాఱవేయునట్లుత్తరువుచేసి, గ్రంథమును రచియించి •చ్చిన బ్రాహ్మణునికేమియు నియ్యక సాగనంపెను. మనుష్యులను మోసపుచ్చి చెఱుచు •వ స్తుతిపాఠకులను మించిన శత్రువులు లోకములో మఱియొకరుండరు.

వాసీయాయను గ్రామమునం దొకసారి సీక్రామదాసను మహాధనికుఁడయిన •ర్తకుఁడొకఁడు సంతానహీనుఁడయి మృతినొందెను. ఆతనిభార్య వంశమునిలుచుట •కు కొడుకును పెంచుకొనవలెనని ప్రయత్నింపఁగా, ఆమె యనంతరమాసొత్తం •కు ప్రభుత్వము వారిని జేరునన్న యుద్దేశముతో నాజనపదాధికారి యావిశ•• స్వీకారము చేసికొనుటకు సెలవియ్యకుండెను. ఈసంగతి •••

బాయి పుత్రుని స్వీకరించుటకావితంతువున కనుజ్ఞ యియ్యవలసినదని యా యధికారి కుత్తరువు పంపెను.

ఇంకొకసారి కారగ్రామమునందు తల్పదాసు బారమదాస అను నిద్దఱుధనికులు సంతతిలేక చనిపోయిరి. వారిభార్యలు తీర్థయాత్రలకుఁబోవుచు తమ భర్తలువిడిచిన ధనమును రాజభాండాగారమునఁ జేర్చుటకయి తెచ్చి యహల్యాబాయికి సమర్పించిరి. ఆమె యా ధనమును గైకొనక "అక్కలారా! మీ ప్రభుభక్తికి మిక్కిలి సంతోషించి న్నాను. మీధన మపేక్షింపవలసిన యక్కఱలేకయే నావద్దఁ గావలసినంత ధనమున్నది. ఇది మీరు మరలఁ గొనిపోయి నీళ్లులేనిచోట చెఱువులు బావులు త్రవ్వించుట, అన్నము దొరకని మార్గమధ్యములయందు సత్రములు వేయించుట మొదలయిన ధర్మకార్యము లకు వినియోగపఱుచుఁడు" అని చెప్పి పంపివేసెను. ఆప్రకారముగా వారాధనమును ధర్మకార్యముల కుపయోగించిరి.

అహల్యాబాయి తన రాజ్యములో చెఱువుగాని, నుయ్యిగాని, అన్నసత్రము గాని ప్రతిష్ఠింపనిగ్రామము లేదు; వేసవికాలములో మార్గమధ్యములయందు చలిపందిరులు పెట్టించి, చలికాలములో బీదలకు బట్టలు పంచి పెట్టించుచుండును, తనరాజ్యములో మాత్రమేకాక దూరదేశములయందు సహిత మామె యనేక దేవాలయములను కట్టిం చెను. కాశీనగరములోనున్న యిప్పటి విశ్వేశ్వరునియాలయ మామెకట్టించినదే ఔరంగజేబు మతోన్మాదముచేత పూర్వపు విశ్వేశ్వరదేవాలయమును పడఁగొట్టించి యక్కడ మసీదునుకట్టింపఁగా నిప్పటియాలయమీమెచే మరలఁగట్టింపఁబడినది. ఈమె గయయందు మిక్కిలి సుందరమయిన విష్ణుపాద దేవాలయమునుగూడఁ గట్టించెను. రాజులమని పేరుపెట్టుకొన్న పురుషులకనేకులకు బుద్ధివచ్చునట్లుగా నిట్లు ముప్పది సంవత్సరములురాజ్యముచేసి, ౧౭౯౫వ సంవత్సరమునం దీమె స్వర్గస్థురాలయ్యెను.

[ఇది సత్యసంవర్ధనినుండి గైకొనఁబడినది.]

సరస్వతీ నారద విలాపము.

రంగము — దండకారణ్యము.

[వీణలుదాల్చి దుఃఖించుచు సరస్వతీనారదులు వేరువేరుగా ప్రవేశించుచున్నారు]

సర — (నిట్టూర్పువిడిచి తనలో)

క. ఈపాపుల కతమున నా । రూపెల్లను మాఱిపోయెఁ; గ్రూరాత్ములకుఁ
జేపడితి; మోసపోయితి, । నేపగిదిం బ్రతుకుఁగందు నికనేనకటా?

క. దాయ లలంకారమిషఁ । గాయం బాపాదమస్తకంబును బొడువఁ
గాయపడి మాసుకొంగని । కాయము నొచ్చెడుచు దేలుకత్రిదినభంగిఁ
(అని పిలపించుచున్నది.)

నార— (తనలో)

క. కటకట! సంగీతంబున । కెటువంటి యవస్థపట్టె నీదేశములో!
పటుతరమోదం బెవరికి । ఘటియింపదు నేఁడు నాదుగానంబుర్విఁ.

క. కటువులె యీ హరికీర్తన । లటమటమున విటులకొక్క యరకాసునకుఁ
దటుకున మానమె యమ్మెదు । కుటిలాలక లఱచు బూతుకూఁతలకంటెఁ?

(ఆలకించి)

గీ. వినఁబడెడు స్త్రీవిలాప మీవిపినమందు!
అహహ! యెవ్వరిదొక్కొయీ యార్తరవము
శ్రావ్యతరమయ్యెడును గానరసముకంటె!
ఎవ్వరయియుందు రొంటి నిక్లేడ్చువారు?

(ముందువంకఁజూచి)





ఉ. అక్కట! యాము షడ్జననియైన సరస్వతియట్లయున్నదే!
తక్కరుతైన నిమ్మధురతాగుణముండునె రోదనధ్వనిఁ?

చక్కనిపాటకున్ సొగసి సర్పముచే మెడచుట్టియాడెడున్.
గ్రక్కునఁబోయి సేనడిగి కన్గొనువాఁడ విచారహేతువున్.

(చేరువకుఁబోయి)

క. ఓ తల్లీ! యిదేమొక్కొద । నీతనయుఁడ నారదుండ; నిక్కము చెప్పుమా
చేతోవ్యథతో నీకిటు । నాతల్లి! యరణ్యరోదనం బేమిటికిన్?

సర— (తలయెత్తిచూచి)

క. తనయా! నావలెనే యీ । వనమున కీవిప్పుడేల వచ్చితివయ్యా?
నిను నిటఁ గనినంతనె నా । మనసునఁగల కలఁక కొంత మానెంజుమ్మీ.

క. నారోదనమునకుం గల । కారణ మడిగితివి గానఁ గలతెఱఁగెల్లన్
గూరిమిపుత్రుఁడ వౌటను । గారవమునఁ దెల్పెదాన ఘనమతి వినుమా.

మ. రమణీయోక్తులచేత నర్థగుణసారస్యంబు గల్పించుచుం
దమి న్యాయంగచయంబునన్ సహజసౌందర్యంబు పెంపొందఁ గొం
చె మలంకారములుంచి తొల్లిటికవుల్ చేస్తాచమత్కార భా
గ్యము హెచ్చించుచు దీర్ఘకాలము ననుంగాపాడి రక్షక్రియన్.

చ. అటు సుఖియింపుచుండఁగ మదాస్యమునందు నిరర్థకంబులై
పటపటలాడుశబ్దముల బల్మిని బెట్టి, రసంబునెట్టి, య
క్కటికము లే కలంకరణకైతవముంగొని మేనుకుట్టి, యి
ప్పటికిను లాత్రిపెట్టెదరు ప్రాణముతీసి ననుం గలంచుచున్.

క. తెలియదు సుమ్మిప్పుడు నా । పలుకులయర్థంబునాకె భావము లేమిన్;
వెలభూషలుగాకివి సం । కెలలయి కడునాదుమేనికి న్వాతనించున్.

నార— క. ఓహో! యెటుచెఱిచిరి నీ । దేహము చెలువెల్ల జడులు తెక్కలినగలన్!
దేహరుచి గవ్వపేరుల । బాహుల పూసల సుకారిభామలుపోలెన్.

క. సుందర బహుగసప్రుష్టి న । మందానందంబు బుధుల మదికిడదేనిన్,
ఛందోబద్ధంబగుపద । బృందాటోపంబు తాఁ గవిత్వంబగునే?

క. రసము లెకావే ప్రాణము । లసమాన కవిత్వకాంత కవసీస్థలిలో?
రసహీనమైన కవితకుఁ । బొసఁగించునలంకృతి శవమునకిడు తొడవా.

క. విను ఛందోబద్ధంబను । ఘనకారణమననె బ్రతుకుఁ గననగునేనిన్,
తనువది వదలివెసం జ । క్కని మృతినొందుటయె లెస్స కవితాసతికిన్.

క. కవితాసతి జీవకళన్ । శ్రవణోత్సవభాషణంబు సలిపెడునట్లుం
డవలెంగాక యొకప్పుడు । శవమువలె న్నిద్రితవలెఁ జనదుండంగన్.

సర— క. అవునది నిజమేనైనను । భువిలోఁ బ్రాణంబులేని బొందియె యిపుడీ
నవమేధావులచేతన్ । వివిధంబుగఁ బొగడఁబడెడు! విధి నేమందున్?
సీ. దయమాలి తుదముట్టఁ దలకట్టు నిగిడించి ధీరుఁడై నన్ను బాధించునాఁడు
పాదంబులో పలఁ బాదంబులిమిడించి వీరుఁడై నన్ను నొప్పించునాఁడు
ప్రాసంబుపైఁ బెక్కు ప్రాణంబులడరించి పోటుబంటైనన్నుఁ బొడుచునాఁడు
బెండు పల్కులు గూర్చి నిండించి నగలంచు దిట్టయై చెవులు వేధించునాఁడు
ఖడ్గ చక్రాదిరూపముల్ గానిపించి
వర్ణములు మార్చి ననుఁ జిక్కుపఱుచునాఁడు
కుమతు లాడఁ దెల్ల నిటిచి ప్రాణములు తీయ,
నాఁడలి పసలేక శుష్కించియున్నదాన.
శా. ప్రాణంబుల్ కడఁబట్టియుంటఁ దెలియన్ రావెందు మద్వాక్యముల్
త్రాణల్వాయుట మాఱి యెవ్వరికిఁ బోల్పనారిదు మద్రూపమున్
ప్రాణాపాయము కల్గకుండ నెటకైనన్ నన్నుఁ గొంపోయి సం
త్రాణంబీవొనరింపు మింతటను బుత్రా! మాతృరక్షార్థినై.
గీ. అన్న! నీ మోమునను దోఁచె విన్నఁదనము । కారణం బేమి నీ దుఃఖంబునకును?
పడుచుఁదనమున రాదుగా వార్ధకంబు । నాకుఁ బోలెను నీకును? నాకుమార!
నార— క. అమ్మా! యేమని చెప్పుదు? । నిమ్మహిని నా మోము చూడ రిపు డెవ్వారున్.
నమ్ముము వేశ్యల మాటలె । కమ్మలు సుమ్మా రసికుల కర్ణంబులకున్.
క. భగవన్నామామృతమే । వెగటయ్యెను భక్తిపరుల వీనుల కెల్లన్.
జగమున నిపుడొక పడుపు । న్మగువ పదంబె యమృతోపమానంబయ్యెన్.
గీ. ఇట్టి సురవస్తుఁ జూచి యెందేనిఁ బోవఁ
దలఁచి వచ్చితి హృదయ ఖేదంబుతోడ.
జనని! సంగీత సాహితుల్ కనులు నీకు,।
భరతఖండంబునను రెంటిఁ బొరలు గన్నా.
గీ. పాటయెల్లను వెలయాండ్ర పాలు చేసి,
జనని! తలమున్క దుఃఖాబ్ధి మునిఁగియున్నఁ,
దల్లి వాంఛ దీర్చుట పుత్రధర్మమగుట
వీపునను మోచి కొనిపోదు వేగరమ్ము.

(ఇద్దఱు నిష్క్రమించుచున్నారు.)

భాగవత కవిత్వమునుఁ జూడ పోతన ఆ గ్రంథమందలి గద్యయందు వ్రాసిన 'సహజపాండిత్య' యని వ్రాసిన బిరుదునకుఁ దగినవాఁడనుట కెంతమాత్రమును సందియము తోఁచదు. కతఁడు హరిభక్తి మగ్నమానసుఁడై వ్రాసిన భాగవత కవిత్వమును జూడఁగా నాంగ్లేయభాషయందలి 'మిల్టన్' (Milton) యొక్క కవిత్వమును మించియుండునని నా తాత్పర్యము.

ఆంధ్రకవిత్వమున వాడఁబడు వృత్తములలో సాధారణముగా నన్నియు సంస్కృత ఛందస్సునుండియే యవలంబింపఁబడినవి. ఇందుఁ జంపకమాల, యుత్పలమాల మొదలగు కొన్ని వృత్తములుమాత్రము క్రొత్తగాఁ గూర్పఁబడి యాంధ్రకవిత్వమున వాడఁబడుచున్నవి. జాత్యుపజాతులలోని పద్యములు తెనుఁగునకు సరిపడు రీతిగాఁ గ్రొత్తగా నమర్పఁబడి వాడఁబడుచున్నవి. తెలుఁగుపద్యములలో ప్రాస మొక్కటి విశేషమగపడుచున్నదిగాని సంస్కృత ఛందస్సున నట్టి నిబంధన మగుపించదు. సంస్కృత వృత్తములయందలి యతివిషయమయి తెలుఁగున నెక్కువ నిర్బంధముకలదు. తెలుగెంత మధురమగుభాషయయినను సంస్కృతమువలె సరసమగు భాషకాదు. సంస్కృతకవిత్వమున నాంధ్రకవిత్వముననున్న నిబంధములన్నియు లేకపోయినను నది స్వభావ మాధుర్యముగల భాషయగుటచే మిక్కిలి మృదువుగానున్నది. ఆంధ్రకవిత్వమందలి రసమును మాధుర్యమును, మృదుత్వమును నెక్కువగానుండవలసిన స్వభావసారము లేని భాషయని కొన్ని యెక్కువ నిబంధనల నించేర్పఱచిరని నేనూహించెదను. సంస్కృత వృత్తములయందిమడ్పఁగల భావమునంతయుఁ దెలుగువృత్తములలో నాభాషతో నిమడ్చుట కష్టసాధ్యమగుటఁబట్టియే సంస్కృత వృత్తములకువలెఁ దెలుగునఁగూడ నాలుగేపాదము లుండవలయునని నిబంధము లేదు.

తరువాత నాంధ్రకవితాపితామహుఁడగు అల్లసాని పెద్దనామాత్యుని కాలము మొదలుకొని కాకునూరి అప్పకవి కాలమువఱకును నాంధ్రభాషయొక్క ద్వితీయ కాలముగా నెంచి, యీకాలమునకు నాంధ్రకావ్యముల (ప్రబంధముల) కాలమని పేరుఁ బెట్టుచున్నాఁడను. ఈ యాంధ్రకావ్యములకాలము క్రీస్తుశకము ౧౫ వ శతాబ్ద మధ్యము మొదలుకొని ౧౭ వ శతాబ్ద మధ్యమువఱకును దాదాపుగా రెండువందల సంవత్సరముల పరిమితిఁగలది. ఇందు నాంధ్రకవిత్వము నూతనమార్గముల నవలంబించి శృంగారరస భూయిష్ఠమగు ప్రబంధములయందుఁ బ్రకాశించినది. ఇంతకుఁబూర్వము మహాకావ్యముల కాలమునందు సంస్కృతమూలగ్రంథములను భాషాంతరీకరించుటయే గాని శృంగారరస ప్రాధాన్యముగా నూతనకావ్యముల రచియించుటలేదు. రెండవదియగు నీ యాంధ్రకావ్యముల కాలమునందు, మొట్టమొదట నల్లసాని పెద్దన మనుచరిత్రమును రచించెను. ఆనెగొందియను నామాంతరముగల విజయనగరమును రాజ

భానిగాఁ జేసికొని కర్ణాటక దేశమునుఁ బాలించిన కృష్ణదేవరాయలును, తంజావూరు నందు రాజ్యముచేసిన యచ్యుతేంద్ర రఘునాథమణియు మొదలగు నాంధ్రభాషాభిమాను లీకాలమున నాంధ్రకవిత్వమును మిక్కిలి గౌరవించి ప్రోత్సాహపఱచిరి. వర్ణనాంశములతోడను శబ్దార్థాలంకారములతోడను నిండియుండి శృంగార రస నిమగ్నములగు కావ్యముల రచనయే యీకాలమున విస్తారముగాఁ గనుపించుచున్నది. ఈకాలమున వివిధాంశములనుగురించి గ్రంథములు కొన్ని రచియింపఁబడినను నిందు రచియింపఁబడిన గ్రంథములలోఁ బ్రబంధములే ముఖ్యమైనవగుటచే నీకాలమున కాంధ్రకావ్యములకాలమని పేరిడితిని. ఆంధ్రకవిత్వ మిప్పు డున్నతపదవినందినది అన్యదేశ్యపదము లనేక మీకాలమున నాంధ్రమునఁ జేరి గ్రంథములఁ బ్రయోగింపఁబడినవి. హిందూస్థానీపదములును స్వల్పముగా కర్ణాటకపదములును సాధారణముగా మనుచరిత్రము, వసుచరిత్రము, ఆముక్తమాల్యద మొదలగు గ్రంథములయం దగుపించుచున్నవి. ఈకాలపు కవిత్వమునఁ గల్పనాప్రౌఢిమ విస్తారముగాఁ గానుపించుచున్నది. అల్లసాని పెద్దనామాత్యునిచే రచియింపఁబడిన మనుచరిత్రమును, రామరాజభూషణునిచేఁ జేయఁబడిన వసుచరిత్రమును, హరిశ్చంద్ర నలోపాఖ్యానమునుఁ, గృష్ణదేవరాయ విరచితమగు ఆముక్తమాల్యదయు, భట్టుమూర్తిచే వ్రాయఁబడిన కావ్యాలంకార సంగ్రహమును, నంది తిమ్మనచే విరచింపఁబడిన పారిజాతాపహరణమును, పింగళి సూరనార్య ప్రణీతమగు రాఘవపాండవీయాది గ్రంథములును, మొదలగు ననేక గ్రంథము లీకాలమున వెలువడినవి. రాఘవపాండవీయము, హరిశ్చంద్ర నలోపాఖ్యానము మొదలగు కొన్ని ద్వ్యర్థికావ్యములును, నొకత్ర్యర్థికావ్యమును, కొన్ని ద్విపద కావ్యములును, కొన్ని నిఘంటువులును, లక్షణగ్రంథములును, మఱికొన్ని చారిత్రములును, కథలును, ఇతిహాసములును, పురాణములును, నదీక్షేత్రమాహాత్మ్యములునుఁ గూడ నీకాలముననే రచియింపఁబడినవి. కవిత్వప్రౌఢత్వముననను, శబ్దార్థాలంకారములయందును, వర్ణనా చమత్కృతులయందును, కల్పనాసామర్థ్యముననను మనుచరిత్రమును, వసుచరిత్రమును, ఆముక్తమాల్యదయుఁ బ్రధానకావ్యములు. ఈకాలమున రచియింపఁబడినగ్రంథములలోనపూర్వకల్పనాచమత్కృతిఁగలిగి యుపమ, యుత్ప్రేక్ష, స్వభావోక్త్యలంకారములు ప్రధానాలంకారములయి యాముక్తమాల్యద శోభిల్లుచున్నది. సులభముగా నర్థద్వయమునిచ్చు మిక్కిలి మృదుమధురములగు పద్యములచే రాఘవ పాండవీయ మలరుచున్నది.

ఇప్పుడు రచియింపఁబడిన గ్రంథములలోని మూలకథలు సాధారణముగా నేదో యొక మహాకావ్యమునుండి సంగ్రహింపఁబడినవి. కేవలస్వకపోల కల్పితమగు కథాచమత్కృతిఁగల గ్రంథమీకాలమున కళాపూర్ణోదయ మొక్కటియే గానుపించు

చున్నది. ఇందలి కథాకల్పనాచాతుర్యమును, వర్ణనాసామర్థ్యమును, కవిత్వప్రౌఢిమయు నెంతయు హృదయరంజకములుగా నున్నవి. ఈకాల మాంధ్రభాష కత్యుచ్చకాలమని చెప్పఁగవలయును. కళాపూర్ణోదయమును సంస్కృతమందలి కాదంబరియను వచన కావ్యముతోఁ బోల్పవచ్చును. కొన్ని శతకములుగూడ నీకాలమున రచియింపఁబడినవి.

మహాకావ్యములకాలమునందుకంటె నీకాలమున నాగరికత హెచ్చినది. దండయాత్ర లనేకములు చేయఁబడినవి. మహమ్మదీయులకును హిందువులకును కలహములు వృద్ధియయ్యెను. ఈకాలమున నాంధ్రభాష కర్ణాటకదేశమునందును, ద్రావిడదేశమునందునుఁ, గొంతవఱకు నైజామురాష్ట్రమునందును, నాగపూరు దేశమునందును వ్యాప్తమయినది. నిజాంరాజ్యమందలి గద్వాల్ మొదలగు పట్టణములలో నివసించి యుండిన గొప్ప కవులు కొందఱాంధ్రకావ్యముల రచించిరి. ఈకాలమున వ్రాయఁబడిన గ్రంథము లన్నిటిలోను 'చేమకూర వేంకటపతి' చేఁ జేయఁబడిన 'విజయవిలాసము'నం దెక్కువ తెనుగుపదము లుపయోగపఱుపఁబడినవి. ఇతని కవిత్వమున సుమారు, నూటికెనుబది తెలుగుపదములున్నవి. అప్పకవి యాంధ్రలక్షణగ్రంథమును నొకదాని రచించి ఆంధ్రశబ్దచింతామణియందలి మూలసూత్రములఁ దెనిగించెను.

ఇంక మూడవదియగు నాధునిక కవిత్వకాలమునుఁ గూర్చి యోచింతము. కాకునూరి అప్పకవికాలము మొదలుకొని చిన్నయసూరివఱకునున్న కాల మాధునిక కవిత్వకాలమని వ్యవహరించుచున్నాఁడను. ఇది క్రీస్తుశకము ౧౭ వ శతాబ్ద మధ్యమమునుండి ౧౯ వ శతాబ్ద మధ్యమమువఱకు సుమారు రెండువందల సంవత్సరముల పరిమితిగలకాలము. ఇందనేకవిధములగు గ్రంథములు రచియింపఁబడినవి. అచ్చతెలుగున గ్రంథరచనచేయుట కీకాలముననే యారంభింపఁబడినది. ఇంతకుఁ బూర్వము సంస్కృతాంధ్ర కావ్యములే గాని శుద్ధాంధ్రకావ్యరచన మెవ్వరును చేయలేదు. మొట్టమొదట రచియింపఁబడిన శుద్ధాంధ్రకావ్యము యయాతిచరిత్రము. మఱియు నీకాలమున నచ్చతెనుగు రామాయణము, నీలాసుందరీ పరిణయము, మొదలగు కొన్ని శుద్ధాంధ్ర కావ్యములు రచియింపఁబడినవి. ఈకాలమున సంస్కృతాంధ్ర మిశ్రకావ్యములు కొన్నియు, ద్విపదకావ్యములు మఱికొన్నియు, లక్షణగ్రంథములు కొన్నియు, నిరోష్ఠ్య కావ్యములు కొన్నియు, ద్వ్యర్థికావ్యములు కొన్నియు రచియింపఁబడినవి. ఇప్పటి కాలపు కవిత్వమున నియమవిధానము లెక్కువయి కల్పనాప్రౌఢిమయు, వర్ణనాచాతుర్యమునుఁ గొంతవఱకు తగ్గనారంభించినది. ఈకాలమున నాంధ్రకవిత్వమున కాదరణ తగ్గనారంభమయి కొంతకాలమయినతరువాత నాంధ్రకవితావనిత సుఖనిద్రఁ జెందినది. ఆంధ్రకవితా యోషామణి సుషుప్త్యవస్థ నలరుచున్నదిగాని కేవలము మృతినొంద లేదని సూచించుట కప్పుడప్పుడు కొన్నిగ్రంథములు రచియింపఁబడుచు వచ్చినను

బాలభాగము కవిత్వమునఁ బటుత్వము దప్పెనది. ఆంధ్రకవిత్వమున నియమములు హెచ్చిన కాలఁదిని ప్రౌఢిమ తగ్గనారంభమయినది. సంస్కృతమున నింతకుఁ బూర్వము శాకల్య మల్లన నిరోష్ఠ్యరామాయణమును రచియించియుండినను, నాంధ్రమున నిరోష్ఠ్య కావ్యరచన కారంభించినవారిలో మరంగంటి సింగరాచార్యులును, గ్రొత్తలంక మృత్యుంజయుఁడును మాత్రమే యగపడుచున్నారు. ఈకాలమున నంతకుఁ బూర్వము ప్రయోగశరణ్యములయియుండిన సన్యదేశ్యపదములను మాత్రమే విశేషముగా గ్రంథములయందు వాడఁబడినవిగాని క్రొత్తగా నీకాలముననే యాంధ్రమున నట్టి నూతన పదములను కవిత్వమునఁ జేర్చికొనలేదు. ఈకాలమున రాఘవపాండవయాదవీయము ననునొక త్ర్యర్థికావ్యముగూడ రచియింపఁబడినది. మఱియు భర్తృహరి సుభాషిత రత్నావళి యీకాలముననే యాంధ్రీకరింపఁబడినది.

ఆంధ్రమున వచనకావ్యముల రచియించుటకు పరవస్తు చిన్నయసూరియే ప్రప్రథమమునఁ బూనికొనియెను. చిన్నయసూరికిఁ బూర్వమాంధ్రమున వచనకావ్యములు రచియింపఁబడియుండలేదు. ఇతఁడు బాలవ్యాకరణమను పేరట నొక యాంధ్రవ్యాకరణమునుగూడ వ్రాసెను. అప్పకవి భాషాంతరీకరించిన ఆంధ్రశబ్దచింతామణి యందలి సూత్రములు దక్క నింతకుఁ బూర్వమున నాంధ్రమున సంపూర్ణవ్యాకరణము రచియింపఁబడియుండలేదు. తరువాత వేంకటకృష్ణశాస్త్రులాంధ్రమున సులభశైలిని పంచతంత్రమును వ్రాసెను.

ఇంచుమించుగా నిప్పటి కరువదిసంవత్సరములకుఁ బూర్వమే కావలి రామస్వామిగారిచేతను, బ్రౌనుదొరచేతను నొకవిధముగా నాంధ్రకవి జీవితములు రచియింపఁబడినవి. ఆంగ్లేయ నిఘంటువుల సరణిని ప్రథమమున నాంధ్ర నిఘంటు వొకటి మామిడి వెంకయ్యచే రచియింపఁబడినది. ఈకాలమున నాంధ్రకవిత్వమంతగాఁ గానుపించదు. రమారమి ౧౭౦౬ వ సంవత్సర ప్రాంతముననే సంస్కృతాంధ్రగ్రంథములు కొన్ని ముద్రాపణారంభమైనను ౧౮౦౦ వ సంవత్సరమువఱకు నంతగా గ్రంథములు ముద్రింపఁబడుటకానము. ౧౮౧౨ వ సంవత్సరమునఁ గొన్ని సంస్కృతశ్లోకములును, తెలుగుపద్యములును ముద్రితమయినవి. తరువాత ఛార్లెస్ బ్రౌనుదొరవారు తెలుగుగ్రంథములలో ముఖ్యమగువానిఁ గొన్నిటి ముద్రింపించియు, ననేకగ్రంథములను విశేష వ్యయప్రయాసములకులోనై పోగుఁజేసి యవి ఖిలముగాకుండ కాపాడియు నిట్లనేకవిధముల నాంధ్రభాషకు మహోపకారమునుఁ జేసెను. ఇట్లు బ్రౌనుదొరచేఁ బ్రబోధితయయి కొంతకాలము సుఖనిద్రఁ జెందియుండిన ఆంధ్రభాషాయోషామణి మాంద్యమువదలి ముప్పిరిగొన్న చాకచక్యముతో నీయాంగ్లేయుల సత్పాలనమున నాటినాటికి ననేకవిధముల నుత్సాహపఱుపఁబడుచుఁ దన పూర్వపు

జ్యౌన్నత్యదశనుఁ దిరుగఁబొందు ప్రయత్నమున కారంభించినది. ఈకాలమున నాంగ్లేయప్రభుత్వముననున్న మనదేశము పశ్చిమఖండనివాసుల నాగరికత నవలంబించి యొకకాలమున నిచటనే జననమొంది తనసామ్మైయ్యై వృద్ధిమాత్రమచటఁ బొందిన ప్రకృతిశాస్త్రములును, శిల్పశాస్త్రములును చారిత్రాద్యనేకములును నించుకయినఁ దనవేయను నానవాలుఁ దెలియనిస్థితియందు మరల స్వస్థానమునుఁ జేర్పఁబడినవి. ఆంధ్రమునఁ దగినన్నివచనకావ్యములు లేవను లోపము మన పండితుల మనసులనిప్పటికి దృఢముగా నాటి వారు వచనకావ్యరచనకుఁ దొడఁగిరి. నీతిచంద్రికయను పేరఁ బంచతంత్రమాంధ్రమునఁ గొంతవఱకుమాత్రమే చిన్నయసూరిచే రచియింపఁబడియుండుటచే దానిని సంపూర్తిఁ జేయు మహోద్యోగమునకు నాంధ్రమున నసమానపండితులగు బ్రహ్మశ్రీ కొక్కొండ వేంకటరత్నము పంతులువారును దరువాత రాయబహద్దర్ కందుకూరి వీరేశలింగము పంతులుగారునుఁ బూనుకొని తమ ప్రయత్నములనుఁ జక్కఁగా నిర్వర్తించిరి. అప్పడప్పుడు కొన్ని కావ్యములు ప్రాచీనసరణిని రచియింపఁబడుచుండినను సాధారణముగాఁ జిన్నయసూరి తరువాత నాంధ్రమున వచనకావ్యములు, నితరభాషల నుండి భాషాంతరీకరింపఁబడిన నాటకములునుఁ, బ్రకృతిశాస్త్రములు మొదలగు ననేక గ్రంథములును, ముఖ్యముగా రచియింపఁబడుచుండినవి. ఆంధ్రమున శ్రవ్యప్రబంధములేగాని దృశ్యప్రబంధములు లేకపోవుటకు వగచుచు నిప్పటి పండితులును, గవులును సంస్కృతనాటకముల నిప్పుడసంఖ్యాకములుగా నాంధ్రీకరించుచున్నారు. ప్రథమమున నాటకముల నాంధ్రీకరించుటకు బ్రహ్మశ్రీ కొక్కొండ వేంకటరత్నము పంతులువారు పూనుకొని నరకాసురవిజయ వ్యాయోగము నాంధ్రీకరించిరి. ఇప్పుడాంధ్రముననున్న నాటకములలో నొకటిరెండు క్రొత్తగాఁగూడ రచియింపఁబడియున్నవి. దేశభాషల నభివృద్ధిపఱచి ప్రోత్సాహపఱపవలయునను నాంగ్లేయ సత్పాలకుల తలంపుచే నంతకుఁ బూర్వ మాదరణ మించుకయు లేక నిరుత్సాహులయి కేవల జడతుల్యులుగానున్న పండితు లనేకులిప్పుడు వివిధాంశములఁగూర్చి గ్రంథములఁ జేయ మొదలుపెట్టిరి. పూర్వమునవలె నెచ్చట రచియింపఁబడిన గ్రంథము లచ్చటనే స్థాణువులవలెఁ బడియుండక గ్రంథముద్రాపణ మతిసులభసాధ్యమగుటచే నిప్పుడు గ్రంథము లన్నియెడల వ్యాపించుచున్నవి. ఆంధ్రమునఁ గొంతవఱకుఁ బరిశ్రమముండినవారికే గాని స్వల్పముగా విద్యాగంధ మెఱిఁగిన జనసామాన్యులగు నితరుల కుపయోగపడు గ్రంథములు లేవను లోపమును దీర్ప నుద్దేశించి సులభశైలి ననేకగ్రంథములు వచనరూపముననుఁ బ్రహసనరూపముననను రచియింపఁబడుచున్నవి. ప్రకృతిశాస్త్రముల నాంధ్రమున వ్రాయు ఘనకార్యమునకుఁగూడ నిప్పుడు కొందఱు పూనుకొనుచున్నారు. ఇట్టి యమూల్యగ్రంథరచనకుఁ బ్రథమమున రాయబహద్దర్ కందుకూరి వీరేశలింగము

పంతులువారు వ్రాసికొని శారీరశాస్త్రమును (Physiology) ఆంధ్రమున వ్రాసిరి. వీరిమార్గము నవలంబించి మనవారిలోఁ బ్రజ్ఞావంతులగువారు సత్వరముగా నట్టి గ్రంథముల ననేకము రచియింపఁబూనుకొనెదరని నేను దృఢముగా నమ్ముచున్నాను. చమత్కార వచనకావ్యములు (Novels) గూడ నిప్పుడు కొన్ని రచియింపఁబడుచున్నవి ౧౮౩౫వ సంవత్సర ప్రాంతమున నొకటి రెండు వార్తాపత్రికలు వెలువడినవి. అప్పటినుండియుఁ గాలక్రమమున వార్తాపత్రికల సంఖ్య వృద్ధిఁ జెందుచునేయున్నది. వెనుకఁ బ్రకటింపఁబడుచుండిన వార్తాపత్రికలన్నియు నించుమించుగా కేవలనామమాత్రములయినవి. వార్తాపత్రికలసంఖ్య ప్రస్తుతము మెండుగానున్నను నందుపయోగకరములయి చక్కగాఁ బ్రకటింపఁబడుచున్నవి లెక్కకు నాలుగైదుమాత్రమే కనపించుచున్నవి. అముద్రితగ్రంథములఁ బ్రకటించు నుద్దేశముతోడను, నిప్పుడు వివిధ విషయములఁగూర్చి తెలుగున సుబోధకమగునట్లుగా వ్రాయఁబడు గ్రంథములను నాటకములను బ్రకటించి భాషావిషయమునుగూర్చియే వ్రాయఁబడుచుండు మాసపత్రికలుఁగూడ నిప్పుడు రెండుమూడున్నవి. ఇప్పుడు రచియింపఁబడి ప్రకటింపఁబడుచుండిన గ్రంథములయందలి కుయుక్తివాదములఁ బూర్వపక్షముఁజేయుచు దుష్టప్రయోగములను ఖండించుచుండెడి గుణాగుణప్రదర్శకములగు లేఖలు(Criticisms) వార్తాపత్రికల మూలమునను, అక్కడక్కడఁ బ్రత్యేక గ్రంథరూపముననుగూడఁ గొన్ని ప్రకటింపఁబడుచున్నవి. రసికుల కమితవినోదకరములుగను, పామరులకుఁ బఠనీయగ్రంథములుగను నుపయోగించు హాస్యాస్పదములగు ననేక గ్రంథములఁ గొన్నిటి ననుభవజ్ఞాన రహితులగు నూతన ధూర్తకవులు రచియించుచున్నారు. పాపము చిరకాలమునాటిదగుటచేఁ గాఁబోలును మన భాషాయువతికి వార్ధక్యదశ సంప్రాప్తమయి యిట్టి విరసులచేతులఁబడి మతిఁదప్పి, యపభ్రంశములఁ బ్రేలుచు, తన యవస్థకుఁదగినట్లు కోపనయయి తనయప్రస్తుతాభాస వాక్యముల గణియింపనేరఁజాలని యదృష్టహీనులపై నత్యాగ్రహమును జూపుచు నొకొక్కపట్టునఁ గానుపించుచున్నది. ప్రస్తుతమాంధ్రభాషావనిత తన వివిధావస్థలయం దన్నిటియందు నలరుచు నొకొక్కయెడ నొకొక్క యవస్థను బ్రకటింపుచున్నయది.

మన భాషయం దిదివఱకే యనేకములయిన మంచిగ్రంథములున్నవి వెనుకటి ఫక్కినే కావ్యగ్రంథముల రచియించి పూర్వకవులమించఁ బ్రయత్నించుటకుఁగాని సరిరాఁజూచుటకుఁగాని నెక్కడనో ఒక్కరిద్దరికిమాత్రమే సాధ్యమగునుగాని యెల్లరకును సులభముకాదు. ఆశావిఘ్నమునొంది హాస్యాస్పదమగునట్లుగా నట్టి గ్రంథములఁజేయఁ బూనుకొనుటకంటెఁ బ్రకృతిశాస్త్రవిషయములఁగూర్చి వచనరూపమున సుబోధకమగునట్లుగా గ్రంథముల రచియించి దేశోపకార పారీణులగుట

మంచిది. సమర్థులగువారట్టి కావ్యరచనకుఁ బూనుకొనుట శ్లాఘ్యము కాదని నా తాత్పర్య మెంతమాత్రమును కాదు. ఇప్పుడు క్రొత్తగా నట్టి కావ్యముల రచియించుట వలన మనభాషకుండిన లోపమును దీర్చు టెంతమాత్రము నుగాదు ఇప్పటి కాలస్థితినిఁ బట్టి జనులు ప్రకృతిశాస్త్రములను శిల్పిశాస్త్రములను నేర్చుకొనవలసిన యావశ్యక మెక్కువ గానగపడుచున్నది. అట్టి గ్రంథములు గాని, చారిత్రాదులు గాని మనభాషయం దంతగాఁ గానరావు. కావున నేఁ జెప్పినదానిని మఱియొకవిధముగా భావింపక నన్ను మన్నించి యిప్పటి గ్రంథకర్తలు సత్ప్రయత్నమున కారంభింతురని ప్రార్థించుచున్నాను. వృద్ధాచారముగా గణించి రోకటిపాటవలె పాడిన దే పాడుచు, వెనుకటి వారు నడచిన మార్గముననే నడచుచు, నిదివఱకే లెక్కకుమీఱి సమృద్ధిగా నున్న ఆంధ్రకావ్యములనే మరల నారీతినే రచియించుచుండుట భాష కెంతమాత్రమును వృద్ధి కా నేరదు. ఆంధ్రకవిత్వమున నెక్కడఁ జూచినను కల్పనావిశేషమే గనఁబడుచున్నది గాని, స్వభావగుణవర్ణనము గాని, కథావైచిత్ర్యము గాని, నైసర్గికపదార్థతత్త్వవర్ణనము గాని, అంతగాఁ గనుపించదు. ఆంగ్లేయకవిత్వ నైపుణ్యములకు రుచిమఱిగిన యిప్పటి వారి చెవులకు మన పూర్వగ్రంథములయందలి కవిత్వ చమత్కృతులంతగా రుచింపవు.

కవిత్వ మెప్పుడును మాధుర్యమునను, మృదుత్వమునను నొప్పియుండుటయే కాక వినినమాత్రమున హృదయాహ్లాదము నొసఁగుచు, సుబోధకమయి, కథాచమత్కృతియు, స్వాభావికవర్ణనా విశేషమునుఁ గలదిగా నుండవలయును. కుంభకర్ణుని నాసికారంధ్రములగుండ నేనుగులు లోపలికిఁ బోగల్గినవనియు, నగస్త్యుఁడు సప్తసముద్రములలోని జలమునంతయు నొక్కపుక్కిటఁ ద్రాగఁగలిగెననియు, కోలాహలపర్వతమునకును శుక్తిమతీ కానదికిని ననన్యలావణ్యరూపవతియగు నొక్కకన్యక జన్మించెననియుఁ, జెప్పు నంశములనమ్ము కాలమిప్పటికి చాలదూరము వెనుకనున్నది, మఱియు నట్టి విచిత్రాంశములచేతనే సంతోషించి తృప్తిఁబొందువారిప్పుడున్నారని నేనూహింపఁజాలను. స్వభావ విరుద్ధములగు నిట్టి వినోదవాక్యములవల్లనే యిప్పటిజనుల రంజింపఁజేయఁ దలపెట్టుట కంటె నసాధ్యకృత్యము వేఱొండు నాకగుపించదు. తమ గ్రంథములయందలి పద్యములు ఛందోవిరుద్ధములు కావుగనుకను, యతిప్రాస లించుమించుగాఁ గ్రమముగ నున్నవి కావునను, లక్షణదోషములంతగా లేవుగనుకను, మాకవిత్వము నిర్దుష్టమనియు, మేము కవీశ్వరులమేయనియు మమ్ము గౌరవింపవలయునన్నచో నట్లు మన్నించువారిప్పుడున్నారని నేనూహింపఁజాలను. గుణగ్రహణపారీణులగువారును, గవిత్వమెట్లుండవలయునో తెలిసినవారును, నట్లు మోసపోఁజాలరు. కాఁబట్టి గుణాగుణ విచక్షక నిపుణులును, నూతనవిషయ ప్రియులునునగు మనవారి నలరింపఁగోరువారు కథాచమత్కారమును, స్వభావవర్ణనలును నుండునట్లుగా గ్రంథముల రచియించుట

కును, ప్రకృతిశాస్త్రోపయోగకరములగు విషయములనుగూర్చి నవీనాభిప్రాయములఁ దెలుపు పుస్తకముల వ్రాయుటను ఆరంభింపుఁడు.

మహమ్మదీయ ప్రభుత్వకాలమున హిందూస్థానీపదము లాంధ్రమునఁ జేరినట్లుగా నిప్పుడు ఆంగ్లేయపదము లనేకము మనభాషలయందుఁ జేరుచున్నవి. పూర్వకాలములయం దనేక అన్యదేశ్యపదములు మాత్రమే మనభాషయందుఁ జేరుచువచ్చినవి గాని యిప్పటివలెఁ జమత్కార వచనప్రబంధముల వ్రాయుటగాని, నాటకముల రచియించుటగాని, ప్రకృతిశాస్త్రములను సులభశైలిని వ్రాయుటగాని, మనవారెన్నఁడు నెఱుఁగరు. ఆంగ్లేయ సంపర్కముచేత నిప్పుడాంధ్రకవిత్వము నూతనమార్గములఁ ద్రొక్కుచున్నది. తెలుఁగుఁ జదువవలయుననియుఁ, దెలుగునఁ బాండిత్యము సంపాదించి కవిత్వము చెప్పవలయుననియు గ్రంథముల రచియింపవలయుననియు నిప్పటివారికి కోర్కెలు పుట్టుచున్నవి. ఆంధ్రభాషయం దిప్పటిజనుల కభిలాష యెక్కువయి గ్రంథముల రచియించుచుండినను దగినరీతిని గ్రంథములు రచియించు నేర్పుమాత్ర మొకరిద్దరికే గాని యితరులయం దంతగాఁ గనుపించదు.

ఈ రీతిని నాంధ్రభాషావధూటి యవ్యక్త మృదుమధుర స్వరముతో మాటలాడ నారంభించి తనబాల్యము నెట్టెపోఁగడపి కాలక్రమమునఁ బెరిగి, యౌవనావస్థ నొంది నన్నయభట్టు, తిక్కనాది యాదికవులచే నాదరింపఁబడి మాటలాడ నేర్పఁబడి, ధీరయయి తననవోఢతఁ బాసి సహజరూప సంపదలచేఁ బలుదెఱంగుల నలరుచు, జనుల డెందములకు కానందమొసఁగుచు మధురవాక్యములచే వినువారి వీనులకుఁ బండువఁ జేయుచు, మధ్యావస్థనుదాటి ప్రౌఢయై శృంగారరస నిమగ్నయై తన శృంగారచేష్టలచేతను, వినోదవాక్యములచేతను, సరస సంభాషణలచేతను రసికాగ్రగణ్యుల యుల్లములకు సంతోషమొసగుచు వారి నానందపరవశులనుఁగాఁ జేయుచు, బడలి కొంచెము నిమీలితనయనయై యల్లనల్లన శరీరపారవశ్యమునొంది యలసిసొలసి యుండినతన యింద్రియములను జడత్వమునముంచి సుఖనిద్రఁ జెంది మరల ముప్పిరిఁగొన్న చాకచక్యమున లేచి యనేకావస్థల నిప్పుడు భాసిల్లుచున్నది. మహాజనులారా! ఆంధ్రభాషాభివృద్ధివిషయమై నేఁ జెప్పవలసినదానినిఁ జెప్పియున్నాను. నేనిదివఱలోఁ జెప్పినదానికయి కినియక యిందలి దోషములను మన్నించి గుణములను గ్రహింతురను దృఢవిశ్వాసముఁగలిగి మీసమాజ మభివృద్ధినొందింపఁజేసి యింకను నుపయోగకరములగు ననేక కార్యములఁ జేయఁగలుగునట్లనుగ్రహించి మీ యుద్యమములను చక్కగా కొనసాగింపఁజేయుటకయి జగదీశ్వరుఁడగు భగవంతుని మిక్కిలి ప్రార్థించుచు నింతటితో విరమించుచున్నాఁడను.

రామా— ఎందుచేతననఁగా, ఈమెయొక్క సౌందర్యము ఆ కంటిలోని మచ్చను గోచరముకానీయక మరుగుపరచినది.

రాఘు— ఆహా? దైవము సర్వశ్రేష్ఠత్వము తనయందు తప్ప నితరులయందు గలుగనీయదుగదా ఎట్టివారికి నేదోయొక లోపము తెచ్చిపెట్టును. ఎంతపనిపుట్టినది! నేనీగ్రుడ్డిదాని ముఖ మెట్లుచూతును? ఈచిన్నది నాకక్కరలేదని యిప్పుడు చెప్పిన యెడల మా నాయనగారేమందురో? రాజుగారిమనసెట్లుండునో? బంధువులయందు చిన్నతనముకాదా? అక్కడ పద్మనాభరాజుగారు వివాహప్రయత్నములు చేసి యుందురు. ఇప్పుడు మఱియొకమాట చెప్పుట కెంతమాత్రము వీలులేదు మాటాడక యూరకుండుటయేమేలు (అని విచారింపఁజొచ్చెను)

రామామణి కపట నటనలయందు నేర్పరిగాన రాజుకంటె ముందు తానే విచారసాగరమున మునిగినట్లు నటించుచు ముఖమువంచి యేమాటయుంజెప్పక యూరకుండెను తనకిరువదియెనిమిది సంవత్సరములు వయస్సైయుండియు, నదివఱకిద్దఱికి ముష్టిముంతలు చేతికిచ్చియుండియు, స్వగ్రామమగు నెల్లూరును విడిచినప్పుడు తన వయస్సునందలి సగమేండ్లచ్చటనే దాచుకొని కాంచీపురమునం బ్రవేశించఁగనే పదు నాల్గేండ్లబాలయై, రాఘవరాజుతోఁ దన కిదే మొదటి కన్నెరికమని నమ్మికపుట్టఁజెప్పి మొదటినుండియు నా నమ్మకమునకు లేశమైన గొరతరానీయక, నేర్పుతోఁ బ్రవర్తించు చున్న యీ రామామణి యీ పాటికార్యము చేయుట యొక వింతకాదు అట్టి సమయమున సోమయాజులుగారి కుమారుఁడు వాసుదేవుఁడువచ్చి వాకిటనిలిచి తానువచ్చిన ట్లొకదానిచే రాఘవరాజుకు వర్తమానము పంపెను ఆదాని గదివద్దకుఁబోయి ‘అమ్మా! వాసుదేవుఁడుగారు వచ్చినారు’ అని చెప్పెను అదివినియు రాజు తన విచారముచే మాటలాడక యూరకుండుటఁజూచి రామామణి ‘వాసుదేవుఁడులేదు; గీసుదేవుఁడులేదు. అవతలికి పొమ్మను’ అని యొక్క కసురుగసిరెను అదివిని వాసుదేవుఁడు ‘ఇదియును నాయదృష్టమే’ అనుకొనుచుండఁగా దానిది వెనుకకుః ‘బాబూ! ఇప్పుడు సమయముకాదు’ అనిచెప్పెను పాపము! ఆబీదబ్రాహ్మణుఁడింటి- బోవుచు నిట్లని దుఃఖింపసాగెను ఈరాజు నెంతకాలమునకైననుఁ గలిసికొనఁ జాలకున్నాను తుదకు భోగముదాని నాశ్రయించినను కార్యము లేకపోయినది ఆదుర్మార్గుఁడైన తండ్రి యొక్క కాసైన నివ్వక నాభార్యయొక్క నగలన్నియు నప హరించి దాఁచిపెట్టెను తుదకన్నముసంపాదించుట కష్టమైనది నాలుగక్షరములు వ్రాయుటయైనను నేర్చుకొనియున్నయెడల నేకోమటికొట్టుమీఁదనైనను గూర్చుండి యొక డబ్బుసామ్పాదించుకొందును. అదియైనలేదు. ఏదీ నాలుగు స్మార్తపుముక్కలు చెప్ప

కానునప్పటికే భార్య యెదిగివచ్చినది. అంతటితో చదువడుగంటినది ఆ వివాహహోమ నయనములైనను నిరాటంకముగాఁ జేయింపఁజాలకున్నాను ' నేనేమూలముగాఁ గాలక్షేపము చేయగలను! ఇంటికిఁబోయినయెడల నాభార్యయు పిల్లడును ప్రత్యక్షరాక్షసులవలెఁ గనఁబడుదురు వివాహమే లేకపోయినయెడల నీకష్టము లేదుగదా కుమారుఁడు గలిగిన సంతోషమైనలేదు అదిగాక యిది మరల గర్భవతియైనది అన్నమే తేలేనివాఁడను పురిటిసెలవెట్లుపెట్టఁగలను? మరల నాతండ్రి కాళ్లచేతులుఁ బట్టుకొని యాయింటనే, ప్రవేశింతమన్నను మరల నెప్పటియట్ల నీ ముండలు ముగ్గురునుజేరి కంచరకుక్కలవలె కాట్లాడఁజొత్తురు ''క జగములువణకెడు నొకతెకు। నగణితముగ నిద్దరైన నంబుధులింకున్। ముగురాఁడువాండ్రు గూడిన। సుగుణాకర పట్టపగలె చుక్కలుపొడుచున్'' అని మాతండ్రి అప్పుడప్పుడు చదువుచుండును. దానికేమి? ఆయిద్దరి ప్రవర్తనయును మిక్కిలి మర్యాదహీనముగా నున్నది వారితో నాభార్యను జేర్చకయుండుటే మంచిది దరిద్రతా!— 'ఉపనయనము నాటిమాటయున్నది సుమతీ' అని చెప్పినట్లు రేపటినుండి చెంబు తెల్లగఁదోమి 'సీతారామాభ్యాంనమః' అనక తప్పనేతప్పదు.''

ఈశ్వరుఁడు స్త్రీలకును పురుషులకు నొక్కరీతి బుద్ధినేయిచ్చెననియు, 'జగములు వణకెడు నొకతెకు' అను పద్యమును ఈ సోమయాజివంటివారే యెవరో మహాత్ములు చేసిరనియు బుద్ధిమంతులకుఁ జెప్పనేల?

అట్లు రాఘవుఁడు విచారించి విచారించి యొక యుపాయముఁ గనిపెట్టి రామామణి కిట్లనియెను 'కానిమ్ము ఎట్లైనను దానినిఁ బెండ్లియాడకతప్పదు దానిముఖముఁ జూచుటకు మనసొప్పదు ఇందుకు నీవొకపనిచేయుము రెండుతులముల బంగారుతో రెండుకన్నులకును రెండుమూతలుచేయించి నీవద్దనుంచుము. దానిపని వచ్చినప్పుడు అడిగెదను.'

ఈమాటవిని యాసాని తాను పన్నిన పన్నాగ ముపయోగించెగదా యని వలనే యానందించి యా మరునాడే కంసాలిని రప్పించి యా యపూర్వనేత్రాభరముఁ జేయించి దానియందు మిక్కిలి శృంగారములగు లతలును పూలును జెక్కించెను చేతిద్రవ్యము వ్యయమగునని యూరకుండెనుగాని దానియందు గొప్పగొప్ప రత్నములు సైతము స్థాపింపఁజేయవలసినదే ఆహా! ఏమి! ఈ రాక్షసిదుర్నీతి! వెలయాండ్రెంతలేసి పనులకైనను సాహసింతురుగదా! నీటిలో నగ్నిహోత్రము పుట్టించుట యిట్టిదే!

ఆఱవ ప్రకరణము.

మాలతీరాఘవుల వివాహము.

మరికొన్నిరోజులు గడచినతరువాత నెరంగల్లునుండి యొక బ్రాహ్మణుఁడు శుభలేఖఁ బట్టుకొని రామరాజుగారియింటికి వచ్చెను ప్రధానియు మిక్కిలి సంతోషముతో నా శుభలేఖనందుకొని చదివిచూచుకొని యా బ్రాహ్మణునికిఁ దగిన బహుమానముచేసి పంపించి యీ వర్తమానమును శీఘ్రముగా మహారాజుగారి కెఱింగింపవలెనని సభకుఁబోయెను మహారాజులుంగారును సభకు విచ్చేసిరి అప్పుడు రామరాజు ఆ శుభలేఖను రాజుగారిచేతికిచ్చెను

మహారాజు— ఓహో! రేపటి వైశాఖశుద్ధనవమినాడే ముహూర్తమట మీరు వేగముగఁ బ్రయాణ సన్నాహముం జేయింపుడు

రామరాజు—నాదొక్క మనవియున్నది నా ప్రియస్నేహితులగు వీరనమంత్రిగారును వివాహమునకు రావలయునని నాకోరిక.

మహారా— అందుకభ్యంతరమేమి? ఆయనకును సమ్మతమే అయియుండును

వీరనమంత్రి— సమ్మతముకాకేమి? రాఘవుఁడు పరాయివాఁడా!

మహారా—రాఘవునికింకను దెలియలేదు గాఁబోలును. ఆయనను వేగముగాఁ బిలిపింపుడు (అట్లు వర్తమానము పంపఁబడెను.)

రాఘవరాజంతకుమునుపే యెరిగియున్నవాఁడుగావునఁ గొంచె మత్తరువును గన్నులయందుఁ జల్లుకొని యొక చిన్న పసపుగుడ్డఁ జేతఁబట్టి యెఱ్ఱగానున్న కన్నులద్దుచువచ్చి సభయందుఁ బ్రవేశించెను

రామరాజు— అదియేమి? అబ్బాయి! కన్ను లెఱ్ఱగానున్నవి

రాఘవరాజు— నాలుగురోజులైనది. వాతముచేతఁ గాఁబోలును, కన్నులు మిక్కిలిగా బాధించుచున్నవి

మహారాజు— ఏదేని యౌషధమును బ్రయోగింపకపోతివా? (యొకసేవకుని వంకఁజూచి) ఓరీ! వైద్యుని దీసికొనిరమ్ము (మరల రాఘవునితో) శుభలేఖవచ్చినది చూడుము (అని చేతికిచ్చి) ముహూర్తము సమీపించినది ప్రయాణసన్నద్ధుఁడవుగమ్ము.

రాఘవ— చిత్తము (అని ముఖముదించి యూరకుండెను)

వీరనమంత్రి— ఏమి యాలోగున్నావు. నిరుత్సాహివై

రాఘవ— మరియేమియుఁగాదు నాకుఁ గన్నులు కొంచెము తేరినతరువాత బయలుదేఱినయెడల బాగుండును.

మహారాజు—కన్నులకేమి? అదిగో వైద్యుఁడు వచ్చినాఁడు. ఈ యౌషధముఁ బ్రయోగింపుము రేపటికే కన్నులు తేరును

రాఘు— (వైద్యుఁ డిచ్చిన మందు నందుకొని) తరువాతఁ బ్రయోగించెదను (అని తనవద్ద నిలచియున్న తన భటునిచేతికిచ్చి) ఇది పదిలముగా నుంచుము

అంతట గణపతిభట్టును నారాయణ సోమయాజియు సభయందుఁ బ్రవేశించి, రాజుగారి నాశీర్వదించి, తమతావులందుఁ గూర్చుండియుండిరి

వీరనమంత్రి— సోమయాజులుగారు! రేపు మన రాఘవునివివాహమునకై తర్లి వెళ్ళవలెను. మీరు పురోహితులు గనుక కావలసిన సన్నాహముచేయించి పిలువవలసిన బ్రాహ్మణుల బిలిపింపుఁడు

సోమయాజి— అట్టే! అట్లే చేసెదను బ్రహ్మానందమైనది

రాఘవుఁడు— గణపతిభట్టుగారూ! మీరు సంబంధము మాటలాడివచ్చినారు కదా ఆ చిన్నదానినిఁ జూచియున్నారా?

గణపతి—చూడకున్న నేమి? వారుమాత్రము పటమునందు మరియొకరూపమును జూపుదురా?

అప్పుడు రాఘవరాజు తన మనమున నిట్లని యూహించెను. ‘కానిమ్ము ఆ చిన్నది గ్రుడ్డిదేయైనయెడల నక్కడికిఁ బోయినతరువాత నైనఁదెలియకయుండునా? అంతవరకును గన్నులకు మూతలు కట్టుకొందును.’ అని తాను ముందు నడువవలసిన కపటమార్గమును యోచించుచు నూరకుండెను. ఈయన మనోభావము నెవ్వరును గ్రహింపఁజాలరైరి

మరునాడు మహారాజుగారుమాత్రము తప్ప తక్కినవారెల్లఁ బ్రయాణమునకు సిద్ధపడిరి. కొన్ని పిరంగులు కాల్పఁబడెను ముందుభాగమునందు త్రోవజూపుచు నలుగురు గుఱ్ఱపురౌతులు నడుచుచుండిరి అవెనుక రమణీయముగా నలంకరింపఁ బడిన యేనుగులు వానిమీఁది డంకా మొదలగు వివిధములగు వాద్యములతో నడువ సాగెను ఆవెనుక సుందరములైన యలంకారములతోనున్నయుష్ట్రములమీద నానావిధ ములగు పతాకములను బలుదెరఁగుల బిరుదములునుబట్టి కొందఱు నడిచిరి. వారి పిరుందనే యనేకములగు బంగారు నగలతో, పట్టువస్త్రములతోడ నలంకరింపఁబడి యున్న యొక గొప్ప యేనుఁగుమీఁద వివిధ వస్త్రాభరణ భూషితుఁడై మితపరిజనా వృతుఁడైన పెండ్లికుమారుఁడు నడుచుచుండెను ఆవెనుక రామరాజు వీరనమంత్రియు గూర్చుండియున్నయరదము పోవుచుండెను వెనుక స్త్రీలయొక్కయు బంధువులయొక్కయు రథములు పల్లకులు మొదలగునవియు వానితరువాతఁ బురోహితుఁడు మొదలగు

బ్రాహ్మణులెక్కినబండ్లును, పెండ్లిసామగ్రితోఁగూడిన బండ్లును లెక్కకెక్కువవై
పోవుచుండెను ఆవెనుకమితసేనావృతుఁడై సేనానాయకుఁ డేగుచుండెను సంఘము
యొక్క ముందుభాగమునందు వివిధములగు మందుగుండు సామగ్రి కాల్పఁబడుచుండెను
ఇరుకెలంకులయందును అనేకవర్ణముల చంద్రదీపములును పూలచెట్లును కన్నులపండువఁ
జేయుచుండెను. ఇట్లు నడిచి వీరందఱును గొన్నిదినములకు సురంగల్లునకు వెలుపల
నున్న యొకతోటలోఁ బ్రవేశించిరి అంతట పద్మనాభరాజుగారు తగిన యుత్సవము
తోడను పరివారముతోడ నాతోటకువచ్చి, రామరాజు మొదలగువారికిఁ దగిన
మర్యాదలుచేసి, పురంబునకుం గొనిపోయి, చక్కగా నలంకరింపఁబడిన యొక శాల
యైనయింట విడియించిరి పెండ్లియిల్లు రమణీయముగ నలంకరింపఁబడియుండెను.
వివాహమంటపము రమ్యమైన మేలుకట్లతోడను, అందందు వ్రేలాడుచుఁబలువిధములైన
వన్నెల నీనుచున్న దీపములతోఁగూడిన గాజు సామగ్రితోడను, చూడ వేడుకపుట్టించు
చుండెను స్తంభములకు నెఱ్ఱని గుడ్డలును, ఆపైని మిక్కిలి ప్రకాశమానమగు సరిగె
పట్టియును, జుట్టఁబడియుండెను. ఆ మంటపమునఁ బ్రవేశించునప్పుడు మొదటిద్వార
మున కిరుగెలంకులనున్న కంబములకుఁ గొలలతోనున్న యరటిచెట్లును, మిక్కిలి పొడ
వులై చూడ నొప్పుచున్న జీలుగు వెన్నులును, పచ్చని కోమలములైన చూతపల్లవముల
తోరణంబులును, నవీనములైన పూలదండలును, పూలతోఁగూడిన లతలును గట్టఁబడి
యుండెను ప్రతియంగణమునందును అక్కడక్కడ పురవీధులందును శృంగారములగు
పందిళ్లు వేయఁబడెను పందిళ్లమీఁదను, సౌధములమీఁదను, బలు తెఱఁగుల పడగ
లెత్తఁబడెను ప్రతిపందిరియొక్క యలంకారము నించుమించుగఁ బెండ్లిమంటపము
యొక్క యలంకారమునే పోలియుండెను ఒక విశాలస్థలమున, పిరంగులు, తుపా
కులు, చంద్రదీపములు, గేదెకొమ్ములు, చక్రములు, చిచ్చుబుడ్లు, కాకరపూవువత్తులు,
ఆకాశబాణములు, జువ్వలు, నెమలిపురిపిట్టలు, కోడిపుంజులు, నీటిబాతులు, సూర్య
చంద్రగ్రహణములు, లంకాపురి, తోరణపు గొట్టములు మొదలగు మందుగుండు
సామగ్రి విచిత్రభంగులఁ గాల్పఁబడుచుండెను మరియొకతావున, భేరి, డంకా,
రండోలు, వీరణములు మొదలగు వాద్యవిశేషములును, నాగస్వరము, ముఖవీణ
మొదలుగాఁగల సంగీతోపకరణములును, శంఖకాహళాదులైన యూదెడి పనిముట్లును
గడియకొకవింతగననివార్యమై ధ్వని చేయుచుండెను అక్కడక్కడ సానిమేళములును
వివిధములగు నాటకములును తరుచయ్యెను మొదటినుండియు నార్జన యెట్టిదో
యెఱుఁగక పూర్వులుంచిన ద్రవ్యమును యథేష్టముగ వ్యయముచేయ మరిగిన పద్మనాభ
రాజు తనయొక్క కొమార్తెయగు మాలతికి వివాహము చేయుచున్నప్పుడు వ్యయము

విషయమందు మీఁదవచ్చు కీడు నెఱింగియుండునా? ముహూర్తము సమీపించఁగనే వధూవరులను మంగళస్నానములకుఁ బిలిచిరి. ఇక్కడ నొకవిశేషము చెప్పవలసియున్నది ఈ వివాహమునందు వధూవరు లిద్దఱును, కండ్లకు మూతలు గట్టుకొనుటయే యొక యాశ్చర్యము రాఘవుఁడు తనభార్య గ్రుడ్డిదియనియు నట్టిదానిముఖము చూడననియుఁ గన్నులకు మూతలు గట్టుకొనెనని యిదివరకే చెప్పఁబడియున్నదిగదా. ఇక మాలతియనిననో దైవగతి యెట్టిదో తెలియదు వివాహము రెండుదినము లున్నదనగా నామెకుఁ గండ్ల కలకయారంభించినది. సౌందర్యమునకుఁ దగినట్లు కన్నులందముగను నిర్దుష్టములుగ నుండియు నట్టి యుత్సాహసమయమునం దాకస్మికముగఁ దటస్థించిన కలకకుఁ దగిన చికిత్సచేసినను నిష్ఫలమయినందున విసిగి, అంత వివాహప్రయత్నమునుజేసి, బంధువులకు వర్తమానములుపంపి, సర్వసిద్ధమైనప్పుడు, సుముహూర్తము నిలుపుచేయుటకును వీలులేనందున పద్మనాభరాజు తనకూతు నేత్రములసహ్యాకరములుగఁ గనంబడకుండునట్లు, బంగారుమూతలు చేయించి కట్టించెను ఇద్దరకు నొక్కమారే కండ్లకలక వచ్చినందు కందరు నాశ్చర్యపడుచుండిరి రాఘవరాజుమాత్రము తనభార్య గ్రుడ్డిదేయనియు, నది తెలియకుండునట్లీ పన్నాగముచేసిరి గాని యది కండ్లకలకగాదనియు నిశ్చయించుకొని, తన తండ్రితోఁజెప్ప నుద్యుక్తుఁడై మరల 'ఇప్పుడు చెప్పియు నేమిప్రయోజనము? పటమును జక్కగఁ బరిశీలింపకపోవుట మనదే నేరము ఇప్పుడు చేయవలసినదిలేదు' అని యూహించి యూరకుండెను వధూవరులకు మంగళస్నానములుచేయించి వివిధవస్త్రమాల్యాభరణాదులచే దేహము లలంకరించి పెండ్లిపీటమీఁదఁ గూర్చుండఁబెట్టిరి. అన్నియలంకారములయందు నీయపూర్వనయనాభరణములు నొకవిధమగు భూషణములుగనే తోచుచుండెను తలఁబ్రాలు వోయుట, పాదములఁద్రొక్కుట, మంగళసూత్రధారణము మొదలగు సమయములందు వధూవరుల కిరుకెలంకుల నిలువఁబడియున్న స్త్రీలు వారిచేతులు పట్టుకొని యాయాకార్యములు నెరవేర్చుచుండిరి ఒక్క యరుంధతీ దర్శన మప్పుడుమాత్రము మాలతీరాఘవులు తమ కనుమూతలు కొంచెమెత్తి, యదివరకే చూచియున్నవారుగావున, చట్టున నరుంధతిని దర్శించి, మరల నెప్పటియట్ల ధరించిరి అప్పుడైనను మాలతి లజ్జాభరముచేతను రాఘవుఁ డసూయచేతను నొండొరుల ముఖంబులం జూడరైరి ఏవిధముననైనఁ దన ప్రాణనాథునిముఖ మొకమారు చూడవలెనని సంపూర్ణమనోరథమున్నను, మాలతి కట్టిసమయము తటస్థించినదికాదు వివాహము నెరవేరెను. రామరాజు, వీరనమంత్రి, పద్మనాభరాజు నొకటిగాఁగూడి యోచించి ప్రస్తుతము గృహప్రవేశము నిలుపుచేసిరి. తగినరీతిగా నందఱకును కట్నములియ్యఁబడెను. తరువాత

రామరాజుగారును దక్కిన మగపెండ్లివారును, దగిన మర్యాదలనొంది సురక్షితముగ బయలుదేరి కొన్నిదినములకుఁ గాంచీపురమునం బ్రవేశించిరి.

ఏడవ ప్రకరణము.

ముందుకాళ్లకు బంధము

ఇరట నడుగువెట్టఁగానే రాఘవుఁడు తన ప్రియురాలగు రామామణినిఁ జూచి చిరకాలమయ్యెనని చింతించుచుఁ దన తండ్రికిఁ దెలియకుండునట్లు బయలుదేరి రామామణియింటికిఁ జేరెను. కాని వాడుకప్రకారము తనకెదురుగా రావలసిన యావెలయాలు రాక తడవుచేసెను, దానికి మారుగా దానితల్లి నీలాచలమువచ్చి రాఘవునికి నడపవలసిన మర్యాదలునడిపి పడకయింటికిఁ గొనిపోయి 'మహాప్రభూ! అమ్మి నీళ్లపోసికొనుచున్నది ఇదిగో వచ్చును నేనుపోయి పిలుచుకొనివచ్చెదను. క్షమించి యామంచముమీఁదఁ గూర్చుండుఁడు' అనిచెప్పి వెనుకటింటి మరియొక గదితలుపు వద్దకుఁబోయి 'అమ్మాయీ! రాజుగారువచ్చి గదిలోనున్నారు వేగమురమ్మ' అని మెల్లగాఁబిలిచెను ఆగదిలో కోమటిరామసెట్టిని సంతోషపెట్టుచు, నరకశ్లోకమోక్షముఁ జూపించుచున్నరామామణి 'ఊరుకోముండా! రాజుగారు గీజుగారు అని యేదోయొకటి తెచ్చిపెట్టి యెప్పుడు నీలాగే ప్రాణాలు కొరుక్కొని తింటూవుంటావు' అని కసిరి కొట్టెను ఈమాటలువినియును పాపము!! ఆకోమటిబిడ్డఁడు చెదరిన గుండెగూట వేయఁజాలక 'రామామణీ! యేలాగైనను నన్నీయుపద్రవమునుండి తప్పింపుము. ప్రాణాలు దక్కినయెడల మరియొకనాఁడు నిన్ను జూడవచ్చెదను' అని వేఁడుకొనుట కారంభించెను తరువాత రామామణి తలుపుతీసి పెరటిత్రోవ నాతని నింటికంపి, యతఁడిచ్చిన చంద్రహారములు తల్లిచేతికిచ్చి, చప్పునఁ గట్టినబట్టవిడిచి మరియొక పావడ ధరించి, యతివేగమునఁ బరుగెత్తి, రాఘవుఁడున్న గదిలోనికిఁబోయి, యతిమైత్రిని జూపుచు, నాతనికి మ్రొక్కెను రాఘవుఁడును గారవించి కూర్చుండనియోగించెను. ఇద్దఱు నొకరి యోగక్షేమము లొకరడిగితెలిసికొనిన తరువాత రాఘవుఁడు తన వివాహమునందుఁ దాను నడిపిన కపట ప్రవర్తన మొదలగు సంగతులెల్లను జెప్పి మఱియు నిట్లనియె

రాఘవుఁడు— నా ప్రాణనాయకీ! నిన్నెడబాసి పెక్కుదినము లయ్యెను ఈ విరహవేదనచేత మాత్రమేకాక నీ వెట్టివేదనపడుచుందువో అను విచారముచే మరింత కృశించితిని

రామామణి— మరల దైవము సమకూర్చినాఁడుగాని లేనియెడల నేను నిజముగా ప్రాణములే నిలుపఁజాలకపోదును. దేవరవారు విజయముచేసినదిమొదలు నేటివఱకు అన్నమే, తినలేదు. బట్టయే కట్టలేదు స్నానమే మరచిపోయినాను నేటి సాయంకాలమందు తాము గ్రామమునందుఁ బ్రవేశించిరను వర్తమానము విని పుట్టెడు సంతోషమునొంది నేడు సుఖముగా నభ్యంగనముఁ జేసికొనవలెనని పెరటిలో నన్నియు సిద్ధముచేసికొని యుంటిని. ఇంతలో తామే దయచేసిరి

రాఘవుఁడు— నిజముగా నీ వింతకాలమునుండియు స్నానమే చేయలేదా?

రామా— ప్రభువారివలె నేను కపటవాక్యము లెఱుఁగను

రాఘ— ఏమి! మేమేమి కపటము చేసితిమి?

రామా— (నవ్వుచు) మీరు నిజముగా నాయందలి విరహవేదననేతనే కృశించినారా?

రాఘ— సరి ఇది బాగుగనున్నది నిందకు ప్రతినిందచేయుచున్నావు

రామా— ప్రతినిందకాదు నిజముగా చెప్పుచున్నాను నా పంచప్రాణములు మాత్రము తమచుట్టునే తిరుగుచుండును గాని దేవరవారికి నావంటి పరిచారికలెందరో

రాఘ— చాలు ఈపాటి చాలింపుము. నేనన్యస్త్రీలఁ గూడినగదా.

రామా— అమ్మగారిని గృహప్రవేశమునకుఁ దీసికొనివచ్చినారా? లేదా?

రాఘ— అన్నియు నెఱిఁగియుండి యిట్లడిగెదవు నన్ను వెటకారములాడుచున్నావా? లేక గ్రుడ్డిదగుట మరచినావా?

రామా— (మనమున) చాబాష్. నాపాచిక పారినది అయినను ఇట్లని ముందుకాళ్లకు బందము వేసెదను (ప్రకాశముగా) అమ్మయ్యా! మీపాదములతోడు వెటకారముకాదు ఇప్పుడుగాకపోయినను మరియొక్కప్పుడైన మహారాజులుంగారును బాబయ్యగారును గృహప్రవేశోత్సవము చేయించక విడుతురా? అప్పుడామె సౌందర్యమునకుమెచ్చి కంటిలోని మచ్చను లక్ష్యపెట్టక తమ్ము ననేకవిధముల బోధింతురు. అప్పుడైనను తాము పట్టినపట్టు విడువవలెను.

రాఘ—అట్లు దీసికొనివచ్చినయెడల మరల నా నేత్రాభరణమును ధరించెదను అసలు దానిముఖమే చూడనని పట్టుపట్టినతరువాత నన్నేమిచేయఁగలరు? రేపు మా నాయనగారికి నెఱిగించివేసెదను

క. దండింపఁదగనివారల । దండింపుచు నుండెనేని దండ్యుల నెల్లన్
దండింపఁడేని పతి నిం । ద్యుండై నగఁగుందుఁ బిదప దుర్గతిఁ బొందున్. ౭.

క. విహ్వలుఁడై బలవంతుం । డచ్చుగఁ గారించుటయును నబలుఁడు చాలన్
నొచ్చి మహీపతిసభకున్ । వచ్చి యెఱింగింపనదియె వ్యవహారమగున్. ౮.

క. అర్థిఁ బిలిచి నీకెవ్వఁడ । నర్థంబొనరించెఁ జెప్పుమని యాతనిచే
సార్థముగ నెఱిఁగి మఱి ప్ర । త్యర్థిం బిలిపింపవలయు నధిపతి సభకున్. ౯.

ఉ. జాతర పెండ్లి యుత్సవము జన్నముఁ జేయఁ దొడంగియున్నచో
బాతిగ రాజమంత్రులు తపస్వులు వశ్యులవశ్యకార్యముల్
ప్రీతినొనర్చుచోఁ దఱిమి పిల్వఁగ నప్పు తెల్లఁదీఱఁగా
భూతలనాథముద్ర గొనిపోయిన భృత్యులు వారిఁ జేఁదగున్. ౧౦.

గీ. బుద్ధిహీన బాల వృద్ధ కన్యాదుల । కర్థిఁ బూనిపాడి యాడవలయు
నన్నదమ్ముఁడొండె నాత్మసంభవుఁడొండె । జనకుఁడొండెఁ బ్రేష్యజనుఁడు నొండె.

క. జనకుండును తోడఁబుట్టుగు । తనయుఁడు శిష్యుండు దక్కఁ దక్కినవారల్
జనపతిసభలోఁ ధనయం । తనపాడిం బూనిరేని దండింపఁదగున్. ౧౨.

క. పీడంబొందక యాపదఁ । గూడకయున్నేని సరకుగొనకున్నేనిం
బాడికి రాఁడేనాతని । నోడక బలహీనుఁడాఁగు టుచితం బెందున్. ౧౩.

క. ఆఁగిన నిలువనియాతం । డాఁగఁదగనివానిబలిమి నాఁగినయతఁడున్
నాఁగఁబడియుండనాతఁడు । నాఁగిన యాతఁడును దండ్యుఁడవనీశులకున్. ౧౪.

క. అర్థియుఁ బత్రికసభఁ బ్ర । త్యర్థి యెదుట వ్రాయుటయును నందఱువినఁ బ్ర
త్యర్థి లిఖియింపవలయును । నర్థికి నుత్తరము సభ్యులగుఁ దగుననఁగన్. ౧౫.

క. ఒకఁబాటు బొంకుసేయుట । యొకఁబడఁ గారణము సెప్పి యుడుగుట మున్నే
క్కడఁ బాడిఁ దాను గెలుచుట । యుడుగక ప్రత్యర్థి చెప్ప నుత్తరమునకున్. ౧౬.

సీ. అప్పును నిక్షేపమస్వామి యమ్ముట కూడి బేహారమ్ములాడికొనుట
యిచ్చి క్రమ్మఱఁగొంట యిలఁగూలిపనిచేత తిరిగియొడంబాటు తిరుగఁబడుట
కొనియమ్మి చెనుచుట యనుచరస్వాముల వాదంబు పొలిమేర వలనిపోరు
చెట్టుదిట్టుట మేను మట్టినొనడుచుట చౌర్యంబు అంకాట సాహసంబు
నాలిమగనిపోరు సర్థవిభాగంబు । జూదమనెడు నట్టివానుపుట్టు
జనులుకోరివచ్చి సభఁజెప్పుదురుదీనిఁ । దెలియనడిగి విభుఁడు తీర్పవలయు. ౧౭.

క. నడవంజాలనివారలఁ । దడయక మోపించి తెచ్చి ధర్మిష్ఠుఁడు వాఁ
దడవోర్వని కార్యములకు । నెడసేయక పాడి నిర్ణయింపఁగవలయున్. ౧౮.

క. ఈయేటినేలను నీతిధి । నీయూరను నితనికెంత యిచ్చితిననుచున్
న్యాయంబు మట్టుఁజెప్పిన । వ్రాయింపఁగవలయుఁ దెలియ వసుధేశులకున్.

క. వ్యవహారాసక్తునకై । వ్యవహారంబునకుఁ జొచ్చి నతఁడు గెలిచినన్
వ్యవహారంబున నోడిన । వ్యవహారాసక్తునకె జయాపజయంబుల్. ౨౦.

క. పెనఁకువ నోడిన యతనికి । ధనమరువంబూఁటయొకఁడు డావలయునతం
డును దొరకకుండెనేనియు । జనపతి తనభృత్యునైనఁ జాలింపనగున్. ౨౧.

క. ఇతఁడింతగొనియెననవుడు । నతనికి నుత్తరము సెప్పి యదిమాన్పక మ
న్నితఁ డింతగొనియెనని తన । ప్రతిపత్తుం దొడరఁదగదు పార్థివసభలన్. ౨౨.

క. ఒకఁడొకనితోడిపాడికిఁ । బ్రకటంబుగఁ దొడరుచోటఁ జైపడి మఱివే
ఱొకయుండువానిఁ దొడరుట । యకృతం బన్యాయమంచు రాదిమునీంద్రుల్. ౨౩.

క. ఇది నాప్రతిజ్ఞయని మును । విదితంబుగఁ జెప్పి దాని విపరీతముగాఁ
బదఁపడిచెప్పుట దప్పగు । నదితగవున నోడెనను టె యన్యాయమగున్. ౨౪.

క. తిట్టెనితఁడడిచె నితఁడను । నిట్టి విచారములతోడ నైడసేయకనం
దిట్టెనితఁ డడిచె నితఁడని । నెట్టన చెప్పుటయె చాలు నేర్పునసభలన్. ౨౫.

క. ఓడినతఁ డింతయిచ్చును । జాడినయని పల్కరేనిఁ బలికినధనముం
జాడిధనంబును దామును । నోడినతం డరువవలయు నుచితస్థితితోన్. ౨౬.

క. మాటలు నేరక పలికిన । నోటమిగాఁగొనక కార్యమున్న నిజముఁ దాఁ
జాటించి నృపతి ధర్మం । బేటముగాఁ జాడి నిర్ణయింపఁగవలయున్. ౨౭.

క. కలయర్థమెల్ల సభలో । పల ముందఱఁజెప్పమఱచి పదఁపడికార్యం
బులు నిర్ణీతములగుచోఁ । దెలిపిన లాభంబు లేదు ధీమంతులకున్. ౨౮.

క. నానార్థములు లిఖించిన । నేనేమియు మట్టుననిన నేకంబైనం
వానిపయిఁ గలుగఁదెలిపిన । వానికివాఁ డరువవలయు వ్రాసినమేరన్. ౨౯.

క. ఆగమ పత్రము సాక్షియు । భోగంబు ప్రమాణమెదియుఁ బొసఁగనిచోను
ద్యోగించి దైవమగు క్రియ । వేగమె చేయింపవలయు విధివంతముగన్. ౩౦.

క. ఒక్కఁడు మానుషమూఁదఁగ । నొక్కఁడు దైవంబునూఁది యొడఁబడకున్నన్
నిక్కపు మానుషముంగొని । తక్కక పెనఁకువలు దీర్పఁదగు సభ్యులకున్. ౩౧.

క. కుసుపుం బత్రము సాక్షియుఁ । గడుమేల్ రెండైన నొకటియైనను మే
లొడఁబడనివి లేకున్నను । జెడవిడువక సత్యమర్థిఁ జేయింపఁదగున్. ౩౨.

క. ఒకపసఁబ్రతికెడువారికి । నొకకులమునవారి కొక్కయూథమునకుఁ బ
త్రికచాలు సాక్షి సత్యము । లొకనాఁడును వలదు వారి యొడఁబాటునకున్. ౩౩.

క. పెలుచనాకం డమచుటకును । జలమునొయిం దిట్టుటకును సాహసమునకుం
బలవత్కృతికిం బత్రము । వలవదు దైవంబు సాక్షి వర్గముఁజాలుఙ్. ౩౪.

క. ధనమప్పెగొనుట యెఱుఁగుదు । ధనసంఖ్యయు నిచ్చువడ్డి దలఁపంగా లే
దని సాక్షిచెప్పనేనియు । ధనవృద్ధులఁ దెలుపునపుడు దైవమువలయుఙ్. ౩౫.

క. వాకొను తెరువుల జలంబునఁ । బోక తెరువువినక నాదుపట్టినచోఁ దా
నాకును సాక్షియు నేలా । యేకంబనుభవమెచాలు నేర్పడఁదెలుపఙ్. ౩౬.

క. మొదలిటిపత్రములెల్లను । ముదమున విలుచుటకు దానమునపాడికి నిం
పొదవఁ బ్రమాణములైనను । బిదపటి పత్రంబెచెల్లుఁ జెనఁకవలఁదుఙ్. ౩౭.

క. అప్పిచ్చి నతనియాకును । నప్పు మగుడఁబెట్టు నతనియాకును గలచో
నప్పిచ్చి నాకుబొంకగు । నప్పుమగుడఁబెట్టి నతనియాకు నిజముగుఙ్. ౩౮.

గీ. అధికులమేర నిక్షేపమప్పులిచ్చి । యడుగఁదలఁపనివారల యర్థములను
దీర్పుకాలంబు గడచినదినము మొదలు। ధనముగాఁగొన్నతఁడు రెండుదండువచ్చు.

గీ. మొదలఁబాడిదీర్చి మోసపోయితిమని । దానిఁద్రిప్పిచెప్పఁ బూనిరేని
జయముగొన్నవాఁడు సభ్యులు వేర్వేర । దండువరువవలయుఁ దప్పుకొలఁది. ౪౦.

గీ. దండువన్యాయముగఁగొన్న ధరణివిభుఁడు । దానిఁ గోల్పడ్డ యతనికిఁ దగిలియిచ్చి
దాని ముప్పదియంతలు తనధనంబు । వరుణుఁగూర్చి యీవలె విప్రవరులకర్థి.

చ తలగొఱిగించి కుక్కడుగుతప్పక ఫాలమునందువ్రాసి ముం
గల ధనమెల్లఁబుచ్చుకొని గాడిదనెక్కఁగఁజేసి గ్రామముఙ్
వెలువడఁద్రోచిపుచ్చుటయ విప్రునిజంపుట శూద్రజంతులం
జొలవకచంపు తప్పుగలచోఁధగి చంపుటధర్మమెన్నయిఙ్. ౪౨.

క. ధనమింతగొనియె ననవుడుఁ । గొన లేదని త్రోఁచెనేని గొనటు నిజముగా
ధనకుఁడు దెలిపిన ఋణియా । ధనమును రాజునకు నంతదండువునచ్చుఙ్. ౪౩.

క. ఇంతగొనియె నీతండని । పంతముగాఁ దెలిపి వానిపై వెలువకతా
గ్రంతలుదూచెడి పెనపరి । యంతకు నినుమడిధనంబు నరువఁగవలయుఙ్. ౪౪.

సీ. నెలకొనియొకచోట నిలువక పెదవులు నాలుకయందంద నాకుచుండు
నుయిరుచెమర్పంగ వదనంబువెల్లనై పలుకులుతడఁబడఁ బలుకుచుండు
వా తెఱతడిలేక వణువట్లువట్టంగఁ బెదవులుపడుపుచు బెదరిచూచుఁ
బలుకులుఁ జెయ్యులుఁ దలఁపులుఁదగ నిజప్రకృతిఁ బొందక కడువికృతిఁబొందు
సాక్షిచెప్పచోట సభఁబాడియాడుచో। నెవ్వఁడతఁడుదుష్టుఁ డిరవుగాఁగ
నిట్టి లక్షణములనెఱిఁగి సభ్యులుపాడి । నిర్ణయించిచెప్ప నేరవలయు ౪౫

క. ఇరువదియేడులు దనపొల । మ్మొరుఁడుగుడుచు మనికి యెఱిఁగియున్నియుఁడా
దొరలకయున్నియుఁ ద । త్పరిభోగము కుడిచినతనిపాలై పోవున్. ౪౬.

క. పదియేఁడులు తనధనమొరుఁ । డెదురం గుడుపంగఁజూచి యెన్నండైనన్
ఇదినాధనమనఁడేనియుఁ । బదఁపడితాఁ దొడరునేని ఫలహానియగున్ ౪౭.

క. కుడిచినకంటెను క్షేత్రము । పడసిన తెరువధికమగ్రపు పాడికిఁజనుచోఁ
గుడుపాకనాఁడును లేదేఁ । బడయుటయును నిష్ఫలంబు పరికింపంగన్. ౪౮.

క ఎడవడకుండం గుడిచిన । కుడుపు ప్రమాణంబుగాదు కొన్న తెఱఁగున్
బడసిన తెఱఁగును దెలుపని । యడికుడుపునఁ బాడి గెలువదభినవడంశీ. ౪౯.

క. తాతల తండ్రుల తరమున । నేతెంచిన వృత్తినక్క నితరక్షేత్రం
బేతెంచినగతిదెలుపక । ప్రీతిఁగుడిచినతఁడు ప్రుచ్చుపెక్కేఁడ్లయినన్. ౫౦.

గీ. బంధుజనులు నొక్కపనివెంటవర్తించు । వారు నొక్కయూరివారు రాజ
పురుషులైనవారు వరుసఁబాడికిఁగర్త । లంతకంతకధికులాదిదొడఁగి. ౫౧.

గీ బలిమిభయముఁజూపి పగవాఁడుచుట్టంబు । వృద్ధబాలకునిని బుద్ధిహీను
నడవిరాత్రిఁగొట్టి యన్యాయమునఁదీర్చు । పాడి ధర్మహీన పాడిగాదు ౫౨.

గీ. తండ్రితోడఁగొడుకు ధరణీశుతోబంటు । పురుషుతోడభార్య గురునితోడ
శిష్యుఁడోటలేక చెనసిపైఁబడి సభఁ । బాడి యాడఁజనుట పాడిగాదు. ౫౩.

సీ. తలదండమునఁ బ్రేయఁ దగదని యెఱిఁగియు నన్యాయమున గురుఁడడిచెనేని
తనతాతవృత్తులు తనతండ్రి యన్యాయమున నాక్రమింపంగఁబూనెనేని
యాలియాభరణంబు లన్యాయమునఁగొని తులువయై యగఁడీక త్రోచెనేని
తన్నుఁగొల్చినదాసు దాస్య మెఱుఁగక యొడయండు కారించుచుండెనేని
పాడికరిగి గురునితోడశిష్యుఁడు తండ్రి । తోడఁగొడుకు మగనితోడనాలు
స్వామితోడబంటు సభఁజెప్పఁ జనునైన । నందు నిహపరముల నిందవచ్చు. ౫౪.

క. చేరినధనంబు భూపతి । యూరెఱుఁగక దాఁచియుంచి యొడయఁడురాఁగా
నారసియీయఁదగు నాకయేఁ । డారంగా గడచెనేని యదిగొనుటదగున్. ౫౫.

క. చెడినధనము చేరినఁ బతి । యొడయఁడు రాఁదడవయిచ్చుటుచితను వాఁడా
యొడమికలరూపు దెలుపక । యడిగినఁ బతికంత దండువరువఁగవలయున్. ౫౬.

క. జగతీశుఁడు పడిన ధనం । బగపడినను బ్రాహ్మణునకు సర్ధము పెట్టం
దగునట విప్రోత్తముచే । నగపడిన నతండకుడువ సర్వంబొందున్. ౫౭.

క. పడినధనముకనిన యతం । డడవకయున్నని దక్క నాఱవపాల్దా
నడఁచిననంతయుఁ జేకొని । పుడమి విభుఁడు తగినదండమును జెయఁదగున్. ౫౮.

క. ముచ్చిలిన ధనముచేరిన । నచ్చుగఁ గోల్పడ్డవాని కదియీయఁదగుఁ దాఁ
బుచ్చుకొనఁదలంచిన మఱి । వచ్చు నతనిపాపమెల్ల వసుధేశునకున్. ౫౯.

క. పెక్కుదెఱంగులఁ బాడికిఁ । జెక్కంద్రురతోడన కఁడు పెనఁగఁగఁ గార్యం
బొక్కటియగునేనియుఁ దాఁ । జెక్కంద్రురతోడనైనఁ జెనఁగఁగఁ జెల్లున్. ౬౦.

క. మగవారితోడి పాడికిఁ । దగదరుగఁగ నిల్లుఁడప దత్తులయిన య
మ్మగువలఁ గైనను జేరమి । మగఁడింతిని బనిచె పేని మఱిపోవఁదగున్. ౬౧.

క. అనుచరుఁడు పరాధీనుం । డనుచరుతోఁ బాడి పోసఁగదైనను వాఁడే
లినపతియనుమతితోడన్ । దనకార్యంబునకుఁ బాడి తగునాడికొనన్. ౬౨.

క. ధనముగనియిచ్చి నతనికి । జనపతి షష్ఠాంశమిచ్చిచన నాలవపా
ల్ధనముగొని యొడయనికిఁ ద । క్కిన ధనమిచ్చుటను ధర్మకీర్తులుగలుగున్. ౬౩.

క. రోయిగొనివడ్డికిచ్చినఁ । బాయక నెలనెలనశీతి భాగముగొనినన్
న్యాయమగు మిగులఁగొనుట । న్యాయంబాడఁబడనిచోట నభినవదండీ. ౬౪.

క. ఓలినివడ్డిం గొలములు । నాలుగిటను రెంపు మూడు నాలుగు నైనన్
మేలుగి నూటికిఁగొన్నఁ జనుఁ । బోలఁగ రోయిడక్క యప్పువుచ్చు నతనిచేన్. ౬౫.

గీ. నిచ్చనిచ్చవడ్డి నెలనెలవడ్డొడఁ । బాటువడ్డివడ్డి పైనివడ్డి
యనఁగ నాల్గుదెఱఁగులయ్యె నావడ్డిదాఁ । దగవుతోడనెక్కుఁ దరతగంబ ౬౬.

క. పదిపదనాకంటువడ్డి । న్వదలకయూనడిమివడ్డి వలయునిజముగన్
గుదిగొన బేహారులకును । బదిపంద్రెండుచిత మధికపథగాములకున్. ౬౭.

క. ధనధాన్యము లెక్కాలము । నినుమడి మున్మడికిమిగుల నెక్కుడుదోడ్తో
మునువడ్డి గొన్న యతనికి । ధనమిచ్చిన మొదలిధనము దఱువకనిలుచున్. ౬౮.

క. రోయిగొని పెట్టఁజాలక । ప్రాయిడదైయె యరుగునతఁడుఁ బరదేశము దాఁ
బోయినతఁడు మూడునెలల్ । పోయిన తుదివడ్డిసహితముగఁ బెట్టఁదగున్. ౬౯.

క. ఒడఁబడక రోయిగొని ధన । మడుగఁగ నీకున్న నతని కదిమొదలుగ నా
యొడమియు వడ్డియు నిమ్మని । తడయక యిప్పించుటొప్పు ధరణీశునకున్. ౭౦.

గీ. అఁకనుండి పాడియాడి సత్యముచేసి । పెద్దపెట్టి బలియు వెనుకఁజొచ్చి
యప్పవారిచేత నర్థంబుగొనఁజాలఁ । దగవకానదానఁ దప్పులేదు. ౭౧.

క. ద్యూతధనంబుసరకువెల । జీతంబిల్లూరు దండశేషమువీనిం
బ్రీతినాడఁబాటుపెలిగా । నేతెఱఁగునసైన వడ్డియెక్కుదుదీనన్. ౭౨.

క. అప్పుగొనిపెట్టనొల్లక । త్రిప్పియకారణము వసుమతీపతిసభకున్
జెప్పఁగవచ్చిన పెనపరి । నప్పుడదండించిధనము నరువఁగవలయున్ ౭౩.

క. అప్పిచ్చినవారలు తమ । యప్పిచ్చిన వరుసతోడ నర్థము ఋణిచేఁ
దప్పక కొనఁదగు ద్విజునకు । నప్పిచ్చిన మొదలుకొనుట యర్హము జగతిన్. ౨౪.
గీ. పాడినోడినయాతండు పదిఁటనొకటి । పాడిగెలిచినవాఁ డిరువదిఁటనొకటి
పాడిదీర్చినయట్టి భూపతికిదండు । వచ్చుటదిధర్మమనిచెప్పి రాదిమునులు. ౨౫.
క. ధనమరువలేని పేదలఁ । బనిగొనఁజను ఋణముదీఱ బ్రాహ్మణుచేతన్
ధనమేగొనఁదగు విప్రునిఁ । బనిగొనఁగాఁజనదు ధర్మపరులకు నెందున్. ౨౬.
క. తనచే నర్థము వడ్డికిఁ । గొనినతఁడీవచ్చినపుడు గొననొల్లక త్రో
చిన మధ్యస్థులచేతను । నునిచిన నటమీఁద వడ్డియుడుగుధరిత్రిన్. ౨౭.
క. పొత్తునఁ గుటుంబరక్షకుఁ । బొత్తులవారంద అప్పువుచ్చినచోటన్
బొత్తులవారందఱు ఋణ । విత్తంబరువంగవలయు విధివంతముగన్. ౨౮.
క. పానస్త్రీద్యూతాదుల । నైన ఋణము తల్లిదండ్రు లరువరు సుతుఁడుం
దానరువఁడువారిఋణము । మానుగ నాలరువ డెందు మగనిఋణంబున్. ౨౯.
క. గొల్లఁడువ్యాధుఁడు రజకుఁడు । కల్లమ్మెడువాఁడులోనుగాఁ గొందఱు దా
రిల్లాలప్పరువందగు । నిల్లువడపు చనవ్రదాని కిచ్చినకతనన్. ౩౦.
క. సతితనకొన్న ఋణంబును । బతియిన్మని నిశ్చితముగఁ బనిచినఋణమున్
బతియియ్యకొలుపు ఋణమును । వితతంబుగ నచ్చుఁగాని పెఱయరువదిలన్. ౩౧.
క. జనకుఁడుపరదేశమునకుఁ । జనినను జచ్చినను రోగజడుఁడైయున్నన్
దనయులు ఋణమరువందగుఁ। దనయులు లేరేని నరువఁదగు మనుమలకున్. ౩౨.
క. ఎనిమిదియేఁడులుశిశు వట । యెనిమిదియేఁడ్లకును బాలుఁడెడనొఱఁగిఁడు గా
వున బాలుఁ డెన్నిభంగుల । జనకుని ఋణమరువఁజనదు చనునటమీఁదన్. ౩౩.
క. జనకుఁడుగొన్నఋణము ద । త్తనయుఁడు వడ్డియును మొదలుఁ దానరువఁదగున్
మనుమఁడు మొదలరువందగు । మనుమలపుత్రులకు నరువమహిలేదెందున్. ౩౪.
గీ. అన్నదమ్ముఁడైన నాలుమగండైనఁ । గొడుకుతండ్రియైనఁ గూడియుండి
పొత్తుధనమునందుఁ బూఁటవాటును నప్పు । సాత్వమునువహింపఁ జనదుజగతి. ౩౫.
క. చూపుడు పూఁటయతఁడు ఋణిఁ । జూపవలయుఁ జూపఁడేని సొమ్మరువఁదగుం
జూపకముందఱచచ్చినఁ । జూపంబని లేదు వాని సుతసంతతికిన్. ౩౬.
క. అరువంగఁ బూఁటపడినతఁ । డరువక తాఁ జచ్చెనేని నాతనిపుత్రుం
డరువఁదగు మొదలు తప్పుతుఁ । డరువంబనిలేదు ధర్మమారసిచూడన్. ౩౭.
క. కుడిచినతఁ డరువకుండిన । నెడపడిన యతండయచ్చు టెఱిఁగి నృపతియా
కుడిచి నతనిఁగని నప్పుడ । యెడపడి నాతనికిరెట్టి యిప్పింపఁదగున్. ౩౮.

క. పెక్కండ్రు పూఁటవారలు । తక్కొని మెయిపాళ్ళనరువఁదగు నొకచాయం
బెక్కండ్రు పూఁటయగుచో । నొక్కనిచేనైన నర్థమొడయండు గొనున్. ౮౯.

సీ. ఒక్కచాయపూఁట యొకరుఁడు పరదేశ । మరుగఁ గొడుకుతండ్రియట్లయప్పుఁ
దండ్రిచచ్చెనేని దనయుఁడా యొకచాయ । పూఁటతండ్రిపాలు పూనియిచ్చు ౯౦.

క. పెట్టించినయర్థము ఋణి । పెట్టకయున్నని రోగియై పెట్టినధనమా
పట్టిన యతఁడమ్మికొనినఁ । బట్టినరోగ్యైన నెఱయఁ బాడింబడయున్. ౯౧.

క. ఇన్నాళ్ళకింత వెట్టక । యున్ననురోదక్కననుచు నాడఁబడు వేఁదా
నన్నాళ్ళదక్క నతనికి । నెన్నఁడు భోగ్యంబుదక్క దేధర్మములన్. ౯౨.

క. తనరొత్తెట్టిన ధనమును । వినియోగము పలుకలేక వేడుకతోడన్
గొనునేని వడ్డిమాఱా । వినియోగమె చాలునండ్రు విద్వజ్జనముల్ ౯౩.

క. తనరోఁ పెట్టిన యర్థము । తననేరమిఁ జెడియెనేనిఁ దానరువఁదగున్
మనుదైవరాజికంబులఁ । జనుఁ జెఱుఁగఁగఁ జెడియెనేని జనదరువాగన్. ౯౪.

క. తనరోయుడుధనమతనికి । ననుభవయోగ్యంబు కానియప్పుడుఋణియా
తనికొంచ్చరోయుడండగు । ధనమొండెను బెట్టి యప్పుఁడలఁగఁగవలయున్. ౯౫.

క. ఇరుమడిన్నైన ధనముతో । నినుమడిగా వడ్డి సహితమెక్కినఁ దానా
ధనమును వడ్డియునిమ్మని । జనపతి యొప్పింపవలయు సద్ధర్మగతిన్ ౯౬.

గీ. దైవమానుషములఁ దనసొమ్ముతోడ ని । క్షేపమంద జెఱుఁగఁ జెడియెనేని
నరువఁదగ దుపేక్ష నాలస్యమునఁ బోసఁ । జెడియెనేని యప్పు సిద్ధమండ్రు. ౯౭.

క. ఒడయుని యనుమతివెలిగా । వెడనైనిక్షేప మనుభవించి నతనిచే
నొడయఁడు వడ్డియు దండువు । తడయక నృపతియును గొనుట ధర్మంబెందున్. ౯౮.

క. ఒడయఁడు నిక్షేపపుధన । మడిగిన నీకున్నపిదప నదిచెడెనేనిం
జెడినధనం బొడయనికిని । బడిమివిభునకంత దండువునుఁ బెట్టఁదగున్. ౯౯.

సీ. అర్థిఁబోద్దెచ్చిన నాకలనేర్పడ లిఖియింపఁదగువాఁడు లిఖితసాక్షి
మఱవక యీ యర్థమెఱుఁగు మీవనియప్డు తలఁపింపఁబడువాఁడు తలఁపుసాక్షి
యొండేనిఁబోవచ్చి యెల్లకార్యములు నేర్పడ విన్నవాఁడు దబ్బాటుసాక్షి
యర్థితనంత రహస్యంబుసాక్షిగాఁ గొన్నాతఁడగు మఱిగూఢసాక్షి
యితఁడునీతఁడుసాక్షి యీయిద్దఱకును । సాక్షియననాతఁడు త్తరసాక్షియయ్యె
వీరలేవురు కృతసాక్షులైరమీఁద । నకృతసాక్షు లార్వురుగల రవనిమీఁద. ౧౦౦.

చ. తపమును దానమున్ గులము ధర్మము సత్యము నార్జవంబు ని
క్కపుధనముల్ సుసంతతియుఁ గల్గి శ్రుతిస్మృతిమార్గవర్తులై

చపలులుగానివారిఁ దగుసాక్షులుగాఁ గొన వారులేనిచో
నపగతదోషులైన జనులయ్యాయిజాతులవారలందఱున్. ౧౦౧.

క. శుభగుణములు నాచారముఁ । బ్రభుతనములు లేనివారు పలువురు వలద
య్యుభయానుమతముగల్గిన। సభను త్రయుఁడొక్కఁడైన సాక్షిగఁజాలున్. ౧౦౨.

క. కొట్లాట ఱంకు ముచ్చిమి । యిట్టి వివాదములచోట నెవ్వరైనన్
న్నెట్టనసాక్షిఁగఁగొనఁ జను । నట్టియెడన్ సాక్షిగుణములరయరు పెద్దల్. ౧౦౩.

గీ. బాలకుండును వృద్ధు పగవాఁడు చుట్టంబు । బూతు సూనగాఁడు పాతకుండు
బొంకులాఁడు ముచ్చు ముండరి కొండీఁడు । కల్లుద్రాగువాఁడు గాఁడుసాక్షి.

గీ. తానెసాక్షిఁ జెప్పఁ బూనివచ్చినవాఁడు । పాడిధనములోని పాలివాఁడు
కోపి మరులు పుణ్యపాపంబు లెఱుఁగని। వాఁడు జూదగాఁడు గాఁడుసాక్షి. ౧౦౪.

సీ. సత్యమంతయుఁ జెపుసాక్షి బొంకినని విప్రవంశజులకు వెలయఁజెప్పి
వాహనాయుధములు వ్యర్థంబులగు బొంకు పలికిననని క్షత్రియులకుఁ జెప్పి
గోధనధాన్యముల్ గూడక చెడునని సభను వైశ్యులకును జాటిచెప్పి
పాపంబులన్నియుఁ బ్రాపించు బొంకిన నని శూద్రజాతికందందఁ జెప్పి
యివ్విధంబున సాక్షులకెల్లఁ దెలిపి । ప్రాఙ్ముఖంబుగ నిల్పి యేర్పడఁగ నడిగి
మంచివారలు చెప్పినమాటయూని । పాడిచెప్పుట నీతి సభాసదులకు. ౧౦౫.

క. సాక్షులు దుష్టాత్మకులై । పక్షాపక్షములు దప్పఁ బలికిన వారిన్
శిక్షించి దండువులుగొని, యా క్షుద్రుల వేరువేర యడుగఁగవలయున్. ౧౦౬.

సీ. సభలోనఁ జయ్యన సాక్షులుచెప్పుచోఁ బొసఁగమి రెంటలై పోరిరేని
పెక్కండ్రపలుకుల నిక్కంబుగొనవని పొసఁగఁగ సరిసరిఁ బుట్టెనేని
గుణులైనవారిపల్కులు నమ్మికొననది యందఱు గుణవంతులగుదురేని
నధికగుణాఢ్యుల నారసివారలపల్కులు నిజముగాఁ బట్టునది సు
గుణసమగ్రులు కొందఱై గుణవిహీను। లరయఁ బెక్కండ్రు సాక్ష్యంబులాడుచోట
గుణసమగ్రుల పలుకులఁ గొనుటధర్మ । మనిరిధర్మజ్ఞులయిన మహాత్ములెల్ల. ౧౦౭.

సీ. సంవత్సరంబుమాసముఁ బక్షమునుదినివారంబు దేశంబువ్రాసిమఱియు
జనకపూర్వంబుగా ధనికనామమువ్రాసి పిమ్మట ఋణికునిపేరువ్రాసి
యీతనిచేనితఁడింతర్థ మీవడ్డి నప్పుగాఁగొనెనని యరసివ్రాసి
యీ యర్థమెఱుఁగుదు మిట్టివారలమని వరుసతో సాక్షులవ్రాయఁజెప్పి
కోరియిబ్బంగి నాడఁబడఁగొంటిననియుఁ । బ్రీతిఁగొన్నాతనిని వ్రాలుపెట్టఁబనిచి
వ్రాసినాతండు తుదిఁదన వ్రాలుపెట్టు । నప్పుఁగఁ బత్ర మిదియండ్రు నాగరికులు.

వ అప్పుడప్పురుషవాక్యంబులు సైరింపలేక యాకంబుకంఠి కాకుత్స్థ వదనారవింద సందర్శనంబుగలిగె నిప్పుడమజ్జీవితం బుజ్జగింతు మాయన్న పంక్తికంఠ నీయకుంఠ క్రూరఖడ్గధారనన్ను విదారించి పుణ్యంబుఁజేర్చుకొమ్మని పలుకుసమయంబున నొక్క దౌవారికుండు పాఱుతెంచి దేవ వేగకేఁగరవిచ్చి ప్రహస్తుం డొక్క వృత్తాంతం బేకాంతంబున విన్నవింతుననివాఁడె వాకిటవసించినాఁ డేగుదెండని వాక్రువ్వఁ దడవ దిగులువడి తుందుడుకుచెందు డెందంబున దనుజనాయకుండు నిర్గమించెనంత మాయాశిరశ్శరాసనంబు లదృశ్యంబులై చనియె నవ్విధంబుఁగని జనక నందనయు నెక్కొంచుక యాయిడిల్లినంతటం బరమపుణ్యసరమసరకు గొనక జనకజంగూడి భయనివారణంబుచేయుచు వినుము పుడమికన్నియ యిన్నియు నిన్నీచదైత్యుమాయాకృతంబు లింకఁదలంకకుము రాముసకు సేమంబయగు నమ్ము మిదే దశముఖుని యమపురాభిముఖునింజేసి రాక్షసక్షయం బొనర్చి నిన్నుం జేకొని యతం డయోధ్యానగర సింహాసనస్థుండై రాజ్యంబేలు వేలదనంబుదుగుమని యాద రింపుచుండ నంత నిక్కడ

క దుస్సహగతి రావణ ధూ। నిస్సాణ నిరర్గళోగ్ర నిస్స్వానము లు
ద్బ్రస్సరణిమ్రోసె లంకకుఁ। బొస్సంశయవృత్తి మేదినీసుతచెలఁగన్.

గీ అపుడుకార్యవిచారమయ్యసురనాథుఁ। డాప్తమంత్రులతోఁజేసె నందువృద్ధ
మంత్రి మాతామహుండైన మాల్యవంతు। నఖిలనయశాస్త్రకోవిదు ననియెనిట్లు.

క రా మాల్యవంతయిటు మా। తామహుఁడవె కాగపుద పితామహుఁడవు ప్ర
జ్ఞామహిమ బుద్ధియెయ్యది। యేమాడ్కి ఘటిల్లుఁదెలుపవే కార్యగతుల్

వ అనినవిని

క నయశాస్త్రములాదిగ న। న్నియు నెఱిఁగిన ప్రౌఢవీవు నేఁ జెప్పెడిదే
మి యభిజ్ఞులిలక పాల। స్త్య యతో ధర్మస్తతో జయ యనఁగ వినవే

గీ నీవఖిలవేదివాద్యైన నేనెఱింగి। నంత వినిపింతు నావాక్య మాదరింపు
మాదిమసుపర్వుఁడవు పులస్త్యాన్వవాయ। ధన్యమూర్తివి కీర్తి ప్రతాపనిధివి.

క కులశీలసత్యనిధి ని। శ్చలధర్ముఁడు దైవమానుషబలాఢ్యుఁడు కే
వలుఁడె రాముఁడు నీకుఁగ। బలవద్వైరంబు చనునె పంక్తిగ్రీవా.

క. మీఁదెఱుఁగవైతి రాగా। చ్ఛాదనమునఁ బ్రాణహరణశస్త్రి పరస్త్రీ
గాదె పరస్త్రీమాత్రమె। యాదేవి త్రిలోకమాత యసురాధీశా

క ఆదేవిఁజూచిపోవుచుఁ। గాదా నిన్నెదిరి యొక్క కపిమును వాన లం
కాదీప్రవప్రసుప్రా। సాదంబులు వాలవహ్నిఁ జళిగొనిపించెఁగ

క. అటువంటి వీరవానర । భటసింహు లపారబాహు బలసాహస వి
స్ఫుటతరరంహు లనంహులు । పటుకీర్తులు రామభద్ర పరిసరవర్తుల్.

క. తెగఁదగదు విచారింపక । పగరబలం బాత్మబలము బహుళమునల్పం
బగు నేని వైరముడుగఁగ । నగుఁగావున సీతనిచ్చు టర్హం బింకన్

గీ. బిట్టుగా వేల్పువెలయాలి తిట్టుగుడుచు । టొండు మునువెండిమల యెత్తి ఖండపరశు
నవిదనుడికించు పాతకంబొండుఁగాక । సీత నీపాలిమృత్యువుఁ జెనయఁదగునె

చ. ఇపుడు దలంపు విశ్వజనయిత్రిని జానకి నాది లక్ష్మిఁగా
నృపతివిలాసశార్ఙ్గియని నిక్కమెఱుంగుము రాఘవేశ్వరున్
గపిమిషభీషణాశనులఁగా వివరింపు తదీయ శౌర్యవ
ద్విపులచమూ సమూహముల వేఱొకభావము మాని రావణా.

వ. అనినవిని దశముఖుండు రోషారుణముఖుండై యతని కిట్లనియె

ఉ. కించుఁదనంబుతో నొక నృకీటముఁదెచ్చి ప్రతాపదీపితా
శాంచలుఁడంచు శాత్రవజయావహబాహు పరాక్రమోదయుం
డంచు రమాంగనారమణునట్టిఁడయంచుఁ బొరింబొరిం బ్రశ
స్తించెదు నన్నుఁ బ్రతిఘటింపఁగ నేర్తురె దేవదానవుల్.

క. దేవాసుర భీకరమగు । నావిక్రమ మెఱుఁగవీవు నను లీలావి
ర్భావవిధూతమదాంధై । రావణు రావణు నెఱుంగరా యెవ్వారున్

ఉ. ధర్మముధర్మమంచు రిపుధర్మమె పేర్కొనెదీవు రాముఁడే
ధర్మి వధూవధం బెపుడు ధర్మమె స్త్రీముఖరూపవిక్రియా
కర్మము ధర్మమే గరళకంధర జీర్ణ ధనుర్విభేదమే
ధర్మము వాలివంచన విధానవిహారము నొక్కధర్మమే.

శా. రంభాశాపము నాకు లక్ష్యమె కపివ్రాతంబు మచ్చండదో
స్తంభస్ఫూర్తికి నడ్డమే యకట సీతాశోకమే తన్మహా
శుంభద్రాజ్యసుఖంబు మాన్పనది యుచ్చైస్స్వర్గ పాతాళలో
కాంభోజాక్షులఁ బట్టనేబలిమి నాహా సేగి సంధిల్లనే

ఉ. సంశయమేల యిట్టి యెలజవ్వని చక్కఁదనంబులోనఁ గో
ట్యంశము లేదు ముజ్జగములందు లతాంగులకుం బరాక్రమ
భ్రంశము నొంది నేవిడువఁబాడియె సీత నిఁకన్ మదీయ ని
స్త్రింశముఖంబున న్నిలితురే నరవానరమాత్రు లక్కటా.

క. అనికనలి మాల్యవంతునిఁ । జనుజాణఁడవాఁడు నీతిశాస్త్రములకు నీ
ఘను నెంతదూరమనుచున్ । దనుజేంద్రుఁడు వీడుకొలిపె దర్పోద్ధతుఁడై.
గీ. దక్షిణద్వారమున మహోదరమహోగ్ర । తరమహాపార్శ్వులను దానుదగ్ధరిత్రిఁ
బశ్చిమప్రాక్కుద్వారపదవినింద్ర । జిత్ప్రహస్తులఁ గట్టడచేసి నిలిపి
వ అంత నంతఃపురంబునకుంజని రఘువీరోదార వీరవానరసేనా దిదృక్షాధీన మాన
సుండై యొక్క గోపురాగ్రభాగంబున నాప్తపరివార పరివృతుండైయుండునాలోన
క. శ్రీరాముఁడఖిలవానర । వీరానీకములతో సువేల గ్రావా
గ్రారూఢుండై ఘోరా । కారంబగు దనుజపురముఁగనె విస్మితుఁడై
చ భవదతుల ప్రతాపపటుభానునిచేతికి సన్నునిచ్చి వై
రవిహృతిమాని కూడుకొనరమ్మనుమీయని విన్నవింపఁ జే
రువకరుదెంచునట్టి రవిరూపున రత్నమయాతపత్ర మొ
ప్పవెనువ గోపురాగ్రమున భూరివిభూతిఁదనర్చు రావణున్
వ. మణిపీఠిన్ సమాసీనుండైయున్నవానింజూచి సుగ్రీవుండు
క వీఁడా లేవకయుండెడు । వాఁడిక్కడ రాముఁడున్నవాఁడనివినియున్
జేఁడీరక్కసుపోఁడిమి । మాటుతుననియాడుకటిచి మచ్చరమెచ్చన్
క. ఉడువీథికొండకిలపై । పిడుగెగసిన వడువుదోఁప బిట్టెగసివడిన్
బెడతలగుప్పునఁ దన్నినఁ । బడిఘుం డొడదొడలుగాఁగఁ ఖదిమకుటంబుల్
గీ. మఱియుఁదోడనె యమ్మేటిమానికములు । నట్టనడుమనె జాఱిపోబిట్టుదన్నె
బిగువుబానికపెట్టుతోఁ బెద్దయసుర । గోపురముమీఁదఁ జదికిలఁ గూలఁబడఁగ
క పడినంబదుమని యప్పుడ । గొడుగున్వేచించి యొరి కుటిలాత్మక యి
క్కడకు విభీషణుఁ డొడయఁడు । విడురా యమరవిఁక నీకు విభుచిహ్నంబుల్
చ అనిమరలంగఁ జూచుతఱి నద్దశకంఠుఁడు చండభాను నం
దనుకడకాలికై యొడియఁ దక్కపినాథుఁడు చాలదయ్యెనో
మునుపటితన్ను కొమ్మనుచు మోమలపై నొకతాపుతాచినన్
గినిసియతండుపైకుఱికెఁ గేసరికేసరిమీఁదికింబలెన్.
వ ఇత్తెఱంగున నుఱికి యదలించి.
క పిడికిళ్లొక కడఁబదియున్ । నడుఱొమ్మునఁబడఁగ విసరినం గదలక బి
ట్టొడిసియవియొక్క సందిట । నిడిమగుడం దివియఁబెనఁగె నిసజుఁడు బలిమిన్.
గీ. పెనఁగనవలివంక పిడికిళ్ల బిరుసుగానసుర తలకు విసర నవియునొడిసి
సరియకాఁగ రెండుసందిళ్లఁగొనిలాగి । విసరికేళ్లుదగుల ద్రేయుటయును.

ఉ. వ్రేసిన వేటునం బడక వేగమ దాఁటి పిఱింది కట్టె బా
హాసము దాయ మధ్యమున నర్కతనూభవునిం దగుల్పడం
జేసికొనంగఁ జేర్చి కడుఁ జక్కఁగఁ బట్టి సురారి నేలకున్
వ్రేసిన వెంటనే యొగసి వ్రేసెఁ దటాలునఁ జెంపలాతఁడున్
గీ. అడవిమీఁదఁ బడిన వడుపుఁ గాలవ్యాళ । జాలమాగికొనిన పోలికయును
దోఁచ నతని చండ దోర్దండవింశతి । పైఁబడంగఁ గలఁగఁ బడక పోరి
క. చేయంగలపనిఁ జేసితి । నీయాడల మట్టితోడి విదినా కేలా
మాయావు లసురలని కపి । నాయకుఁడు సువేలనగమునకు డిగియంతన్
క. ఏలికచరణంబులపై । వ్రాలిన నతఁడెత్తికొని వివస్వత్తనయా
యీలాగునఁ జనఁదగునే । నీలోకమె నాకు ననుచు నేనుంటిఁ జుమీ.
వ. అని యాదరించి రాఘవుండు రవితనయున కిట్లనియె.
క. పెట్టుము వాకిటవాకిటఁ । గట్టడఁగాఁ గోటికోటి కపులను వేగన్
ముట్టడిదాఁకన్ లంకా । పట్టణమునకనినఁ బెట్టె బలిమిగ నతఁడున్.
ఉ. అంతట భానువంశకరుఁ డంపఁగ నంగదుఁ డద్దశానన
ప్రాంతము చేరఁగా నరిగి పల్కెఁ బురందరశాత్రవా పరా
కింతయు లేక నావచన మించుక సేపిపు డాలకించుమి
న్నింతు ఖరాంతకుండటక నీకొకమాటిటు చెప్పిరమ్మనెన్.
వ. నీ వెవ్వఁడం టేని
చ. నినుఁ దనచంకవైచుకొని నీరనిధాన చతుష్టయంబునన్
జనిచని సాంధ్యకృత్యములు సల్పెడు సంతతముఁ ద్రిప్పి తెచ్చి పెం
పున నటవైచి కొంకరలు పోయిన నీమెయి చక్కనొక్కి పో
సనిచిన వాలినందనుఁడ నంగదుఁడన్ దశకంఠ వింటివే.
గీ. బ్రహ్మసంతతివాఁడవై పట్టణంబు । లంకగా నుండి కేలఁ గైలాసమెత్తి
ప్రబలితివి నీకులస్థాన పౌరుషముల । కొచ్చెముగ నేల చొచ్చితి పిచ్చిపనికి.
గీ. ఎదఁదగుల్పక కంఠంబు తుదఁదగిల్చి । తప్పఁదగిలించెఁగా తొల్లి ధర్మగుణము
కరసహస్రంబు గలిగియుఁ గార్తవీర్యుఁ । డేమి చేయును నీపుణ్యమిట్టులుండ.
క. కాళ్లం జేతులుఁ బిసపిస । నోళ్లం బెకెక్కల గలిగెనోయని నీకా
రళ్లగ బలిగృహవనితలు । సల్లించిరో వెళ్లఁబేసికి సత్వం జెల్లన్
గీ. ఇంకనైనను జానకి నిచ్చి శరణు । చొచ్చితేని యయోధ్య నీకిచ్చు విభుఁడు
నాఁడె లంక విభీషణునకు నొసంగి । వాఁడు నేఁడింక నీకది వేఁడరాదు.

గీ. అర్జునుండు గాఁడు అల్లెఁ గట్టి విడంగ । గాఁడు వాలి కేలఁ గట్టి విడువ
జానకీవిభుండు సత్యపరాక్రముం । డెఱిఁగి నడువు ప్రాణమిష్టమేని

వ. అని పలికిం బంక్తిముఖుండు కట్టలుకమిట్టిపడి పట్టుకొండనిన బలవంతులగు పలల
భుజులు నలువురు బలువిడిం బయింబడిన నడిచిపడక నగుచుం దేఱిచూచి

ఉ. అంగదుఁ డద్దురాత్ముల రయంబున నీడిచికొంచు నింగికిన్
జెంగున దాఁటి నల్వురను జిట్టలు చీఱి నభఃప్రపంచపా
రంగత సౌధశృంగము గరంబున నొక్కటి త్రుంచి తెచ్చి యు
త్తుంగ శిరఃకిరీటములతోడ దశాననుపై చెఁగూలఁగన్

గీ. ఇట్లు వైచి దాన నిలమీఁద దనుజుండు । దిమ్మదిరిగి పడుటఁ దేఱిచూచి
యనుభవింపుచేసి నంతయు ననిపాళె । మునకు మరలి విభునిఁ గని భజించె.

క. దేవా విను మనసొల్లఁడు । రావణుఁ డని పలుకుటయును రాముఁ డతిక్రో
ధావిలుఁడై కార్ముక మౌ । ర్వీవిస్ఫారముల దిశలు విఱుగం బెట్టెన్.

ఉ. అప్పుడు రావణాసురుఁడు నాప్తులఁ జేరఁగఁ బిల్చి వింటిరే
చప్పుడు వింటి నిప్పుడది చప్పటగాఁ జఱచెన్ గకుప్పలన్
విప్పెసలుం గులంగవని వెల్వడి నేఁ డనతోడ మార్కొనన్
జెప్పినవాఁడు గావలయు సీతమగండిది నిక్కమింతయున్

గీ. పగరుమెట్టి పట్టి పఱుగడనుండంగ । నెవ్వఁడుండు మూలనేను దక్క
నాయుధోపజీవి కర్హమే యీకూడు । గుడువ జగడమునకు వెడలువాఁడ.

చ. అనవిని దేవ నీవు చనునంతకు వచ్చెనె యేము చాలకుం
డినఁ గద యింత గావలయు నిల్వుము రాముఁ డనంగ నెంత వి
ల్లననది యెంత యేమహిమ నందెనతం డిపు డొక్క ప్రోఁతయున్
వినఁబడెనే యటంచుఁ బరివేష్టకు లింద్రజిదాది దానవుల్

క. అతని యనుజ్ఞను భేరీ । శతములు రణయాత్రఁ దెలుపఁ జఱపించిరి త
ద్వితతావితధారవ మ । ద్భుతకరమై మ్రోసె భూనభోవ్యాపకమై.

సీ. కల్పాంతవాతూల కర్మనిర్మర్యాద శరధినిర్ఘోషంబు శరణుచొచ్చె
సంవర్తశిఖిశిఖా చర్వ్యమాణోర్వీధ రాలఘుధ్వానంబు కేలుమొగిచెఁ
బ్రళయాంతకగభీర గళబిలావిర్భవ త్క్రూరినహాసరవంబు కసవుగఱచెఁ
గాలాభ్రగణగర్భ గోళనిర్యద్భీమ భిదురనాదము బిడ్డపేరుపెట్టె
నిమ్మహానిస్వనమునకు నిదియ తప్ప । దన్నియును దీని వెనుక నేయని సమస్త
లోకవాసులు నిశ్చేష్టులైకలంగఁ । బంక్తికంఠుని పురిమ్రోసెఁ బటహశతము అంత

సీ. అనికిమేడలుతోడు చనుదెంచునోవీరి కనఁబొల్చు నున్నతస్యందనములు
ఖురధూళిశరధి గూర్కొన నోపునోయనఁదగు సేతుబంధంబులగుగుఱ్ఱాలు
నవసరంబైనప్డు డంభోధినావఁజాఁ దనుపు కొండలనంగఁ దనరుకరులు
నాలంకలోనున్న కాళరాత్రికిఁగల కొడుకులై తోఁచు ఘోరభటులుఁ
గలిగి యరుగుదేరఁగాహాళరావంబు । భటులరవము శంఖపటహనినద
మొనసిబలియవెడలి యింద్రజిత్ప్రముఖులు । పోఁజుదీర్చి రొక్కబయలనపుడు.
గీ. ఉగ్రభానుసుతుఁడు నగ్రభాగంబున । బలిముఖాధిపతులు పన్నినడుమ
వెనుకఁదానుగదలె వెన్నుబలంబయి । నూఱుకోట్లకపుల నుగ్గులలమ.
క ఇవ్వీఁకను నిరువాఁగును । జివ్వకుఁ దలఁపడియె నడిమిచిదుగిదియే లం
చవ్వనధిభాగయుగళము । చివ్వన నా లంకయుంచఁ జేరెననంగన్. వ అంత.
క ఒకయెడఁదెలు పొకయెడనలు । పొకయెడనళదివగయొరపు నొకయెడ నెఱుపున్
బ్రకటింపుచు సకలాశా । నికురుంబంబునకు మేదినీరజమొగసెన్.
సీ. సమరవిక్రమనాట్య సంవిధానాగ్రనైపథ్యమై కనుపట్టె భటులమ్రోలఁ
దనబిడ్డఁజెఱసేడ్డ దనుజుబ్రమింగఁగ నుర్విలాఁచెనోయనఁదోఁచె లంకమీఁదఁ
బైముద్దవాటుగాఁ బడఁజొచ్చెమిన్నేట సిక్తమైయలశిలాసేతువీధి
దైత్యక్షయోద్యుక్త మృత్యుయాత్రాబహిః పటకుటీరంబయ్యె బలసిమింట
నవపతాకాలతాకాననస్ఫురత్వ । రాగము నిజాంగరాగంబు రథచమూస
ముద్రశైవాలమును రామభద్రనికట । ధూపధూమంబునైనట్టు దుమ్మురేఁగి
వ ఆసమయంబున.
క రక్షోబలమపుడార్చిన । వృక్షాయుధమైన ప్లవగవీరబలంబున్
దాక్షాయణీధవాలిక । వీక్షాక్షేపక్షమాక్షివీక్షల నిగిడెన్
క రథికులపైఁ దరులాహవ । పథికులు కపులెత్తఁ బుష్పఫలములురాలెన్
ప్రధనాధి దేవతకునవి । ప్రథమసపర్యలునయించెఁ బార్థివుఁడనఁగన్
గీ. దనుజవీరభటులు దాఁకిపైఁగురిసినఁ । దోమరాసిరాశి తోఁచెఁగలనఁ
గపులునపుడు దమ్ముఖంబులనేలతోఁ । దోమ రాశిరాశి దోఁగిపోయె.
క అందునఁ గనలిహయంబులఁ । గ్రందుగఁ దఱిమియును గరులఁగాలాడిచి మీఁ
దందేరులు వఱపియు శర । బృందార్చులఁబేర్చిరొక్క బిరుసునసురల్.
సీ అవిలెక్కగొనక దైత్యబలంబునటు గొంతయెగిరియాడఁగ నిచ్చి తెగువఁజొచ్చి
పెద్దగాభూదేవి పెంచియిచ్చిన యాయుధంబుల కలిమిదర్పంబుపెరిగి
పైఁబడినగుఱ్ఱాలఁ బాదపంబులమోఁది గండోపలములచేఁ గరులఁజదిపి

గిరులచే రథములఁ గెడపి తత్తద్వాహనములవారికిఁ గాలి నడలు దెచ్చి
కాలినడలు లంకపాలికిఁ దెచ్చిన । మేటిఁ గూడి యకు౯ మిగిలితగిలి
ముంచివంచిదంచి చించినొంచికలంచి । కఱచిచిఱిచిచఱిచి మఱిచిరటాలు

క. మునుమునొనరిత్తయైనన్ । వెనుకంబన్నినబలంబు విచ్చెన్వచ్చెన్
గనిరావణి చకితనరూ । ధిరికిన్విలుచూపి వెరవుదెలిపెన్నిలిపెన్.

వ. తోడనకూడుకొని యరదంబులుదోలుకొని బలసి ప్రజంఘప్రముఖరథికు లధిక
రభసంబుగాఁ ద్రోచిరా దవ్వుదవ్వులంజూచి

సీ. అంగదుండింద్రజిత్తుం గోరికొనియె సంపాతి ప్రఘాజనుఁ బంచికొనియె
మరుదాత్మజుఁడు జంబుమాలిఁ బంచికొనె గజుండు ప్రతాపునిఁ జూచుకొనియె
మైందుండు వజ్రముష్టిం దిగిచికొనియెఁ గుముదుఁడకంపనుఁ గుదురుకొనియెఁ
గేసరిధూమ్రాక్షు గెలుబాడుకొనె వానరేశ్వరుండు ప్రహస్తునేలికొనియె
ద్వివిధుఁడశనిప్రభునివగఁ దెచ్చుకొనెసు। షేణుఁడుమహోదరునివిభజించుకొనియెఁ
బనసుఁడునరాంతకునిగుఱిపఱచుకొనియె। జాంబవంతుఁడుమకరాక్షునరసికొనియె

గీ. యజ్ఞకోపుని సుప్తఘ్ను నగ్నికేతు । రశ్మికేతుని దాఁకె శ్రీరాఘవుండు
లక్ష్మణుండు విరూపాక్షునలఁచె నవ్వి । భీషణుండును మిత్రఘ్నుఁబిలిచెనగికి

మ. నరనాథాగ్రణి నారసింహపద చింతాలోలనిస్తంద్ర వీ
రరసాధీశ్వర నీతికోవిదనుత ప్రారంభ నూత్నాకృతి
స్మర నేత్రస్థిర పద్మ నైర్జర మహీజఖ్యాతదాతృత్వ నూ
నరుచి శ్రీధర నాగశారి నృప నందన్మిత్ర నర్మోక్తితా

క. సతతసపాదబరీదా । దితురుషా౯ధిపశరణ్య దివ్యాంఘ్రిసము
న్నతకర్ణాటస్థాపన । చతురాళియరామరాజజామాతృమణీ

ఉత్సాహ. అధ్వరావనవ్రతక్రియా ప్రచండదాన వి
ద్యాధ్వనీనధీనిధాన యష్టదిజ్నృపాల హృ
త్సాధ్వసప్రదప్రతాప చాప నైపుణీఖనీ
సాధ్వనీకహృద్యపద్య సత్యవాగ్విచక్షణా

గద్య. ఇది శ్రీమదొంటిమెట్ట రఘువీరశతక నిర్మాణకర్మఠ జగదేకఖ్యాతి ధుర్యా య్యల
రాజు తిప్పయమనీషి పర్వతాభిధాన పౌత్రాక౯యార్యపుత్ర పరిశీలితసమిద్ధ
రామానుజమతసిద్ధాంతమర్మ ముమ్మడి వరదాచార్యకటాక్ష వీక్షాపాత్రహృదయ
పద్మాధిష్ఠిత శ్రీరామభద్ర రామభద్రకవి ప్రణీతంబయిన రామాభ్యుదయంబను
మహా ప్రబంధంబునందు సప్తమాశ్వాసము.

అష్టమాశ్వాసము.

క. శిష్టనిజాగార చతు । ష్షష్టికళా నిపుణసూక్తి సందర్భజిత
స్రష్టా గుణ సంతుష్ట వి । శిష్టా గొబ్బూరి నారసింహనృపాలా.

వ. అవధరింపుము తదనంతర కథావిధం బెట్టిదనిన.

క. ఇక్కరణిఁ జోడు లేర్పడి । పెక్కెడలం బోరఁ బెనఁగు పెనుచివ్వలు మి
న్నెక్కి కలహాశికన్నులఁ । దెక్కొట్టినవిడక కఱవుదీఱ నెక్కెన్

మ. పటహధ్వానములన్ ధనుర్నికరవిస్ఫారంబులన్ శంఖని
స్స్ఫుటనాదంబుల నట్టహాసముల నేర్పుల్ దప్పి హీలంగ న
ట్టటువోసెత్తెదిశావితానములఁ బక్ష్యక్షేచరప్రాణ సం
కటకృత్యత్వరిత ప్రసారితశరౌఘంబుల్ నిరాఘాటముల్.

క. దానవఘోరాశుగములు । వానర వీరాననములు వడిదూఱిచనం
గా నెత్తురగుటఁ దెలియం । గానరవి మునుపును నెఱుపుగను కెవ్వారున్.

సీ. నృపులకపుల సమరనిష్ఠురత్వంబుల । నొచ్చి చరమదిశకు వచ్చి దనుజు
లెపుడు ప్రొద్దుగ్రుంకు నెపుడు మాకెచ్చిర్లఁ । గలుగు ననుచుఁ బోరుసలుపుచుండ

చ. తనకులముద్ధరించఁగల ధన్యుఁడు రాముఁడిఁకన్ వృథావ్యథన్
మునిఁగెడుఁ జూడలేనని యినుండపరాద్రిచఱింబడెంగదా
యన రవిగ్రుంకె సంజ యెఱుపందె సుపర్ణుఁడు వచ్చియందుఁ గా
లొక్కనిమేషమీఁద రాఘవులకున్ ఫణిబంధము లూడ్చెఁగాననన్.

వ. అంత.

గీ. పోలనొకమతితమోహోమశాలఁ జొచ్చి । రాకకాదని యింద్రజిద్రాక్షసుండు
నరిగియొకవేల్మి వేల్చి కుండాంతరుదిత । దివ్యసన్నద్ధరథమెక్కి తిరిగివచ్చి.

వ. తళుక్కనం బాడకట్టి రామసౌమిత్రి సుగ్రీవప్రముఖులు వెఱఁగంద నదృశ్యుండై గగనంబున మాయామేఘంబులు పన్నఁ జుక్కలవెలుంగు దోఁచదయ్యె నయ్యెడ రక్కసులుక్కుమిగిలి యక్కటికి చీఁకటింగనుచూపి యనుమడించి తూర్యనినదంబులు నట్టహాసంబులుఁ జెలంగం దఱిమి తాఁకిరి కపులును లోఁచేవ కలిమి నీడింబోవక కూడం దఱిమిరి రఘుపుంగవుండును దివ్యశరజ్వాలామాలికలచే రాకాసిమూఁకల తోడనకూడం జీఁకటితిట్టల నెరియంబెట్టఁ దొడంగినం గలంగంబడి తద్గానవానీకంబు సైరింపలేక చని గవనిచొచ్చిన మచ్చరంబు పెచ్చుపెరిగి శాంబరీకాదంబినీ తిరోహితుండయిన రావణసుతుండు.

బాటసారులలోనొకఁడు— మేము బాటసారులము. మాది పార్వతీపురము కాపురస్థలము. కాశీకి పోవుచున్నాము. త్రోవలో యిక్కడ దొంగలు చుట్టవేశారు. మాబళ్ళలోనున్న సామానునంతను తీసికొని మావద్దనున్న సొమ్మునిమ్మని మమ్ము నిర్బంధ పెట్టుచుండఁగా మీరువచ్చినారు. మిమ్మునచూచి వారు పోయినారు.

త్రి— వారెంతమందుంటారు?

బా— ముప్ఫయిమందిదాకా వున్నారు.

త్రి— మీరో?

బా— బండివాళ్ళతోకూడ ముప్ఫయిమంది.

త్రి— అయితే పోట్లాడలేదా?

బా— పోట్లాడాము. అరుగో ముగ్గురికాళ్లువిరిగాయి. అక్కడున్నారు. మీరు దైవాల్లారాబట్టిగాని లేకపోతే అందరం చచ్చేవాళ్ళం.

త్రి— భయంలేదులెండి వీళ్ళను పట్టుకొని జాగ్రత్తచేయండి. తరువాత చెపుతాను. (అని యాతని ముఖలక్షణముల నుపలక్షించుచుండెను.)

బా— పెట్టెలన్నీపోయినవి. పదివేలరూపాయల ఆస్తిదాకా పోయింది.

త్రి— అయితే మనమందరము నలభైమందిదాకా వున్నాము. వాళ్ళేత్రోవను వెళ్ళారో చూడండి.

బా— ఇదిగో (అని వ్రేలుచూపి) ఇలావెళ్ళారు.

త్రి—అయితే పదండి (అని వారందఱును స్త్రీలనెత్తికొని ఆత్రోవనుపోయిరి) వీరందరియొక్క సంఖ్య నలువదియొక్కటి వారాత్రోవను ఒక అరమైలుదూరము వరకుఁ బోయిన వెనుక, నక్కడకుఁ గొంతదూరమున మిణుకుమిణుకుమని యొక దీపము కానవచ్చెను. ఆదీపమును చూడఁగానే, అది దొంగలుండెడిస్థలముగా యతి తెలిసికొని వీరందఱును సమరసన్నద్ధులై, నడుములు బిగించి కఱ్ఱలను చేతఁ బట్టికొనిపోయిరి.

అచ్చట నొక పూరిపాకగలదు. ఆపాకయొద్ద పదునాలుగురు దొంగలు ఇక్కడనుండి దోచుకొనివచ్చిన సామానునకుఁ గాపుండిరి. వీరిని చూచినవెంటనే వారందఱును (దొంగలు) పారిపోవఁ బ్రయత్నించిరిగాని, యిదివఱకే త్రివిక్రమునిచేత బోధితులై యుండుటచేత నీ యాత్రికులందఱు నందొక్కనినైనఁ బోనీయక, కాలు చేతులుకట్టి జాగ్రత్తచేసిరి. ఇంతలో మఱికొందఱు గుడిసెలోనికేగి, తమతమ సామానులను దీసికొని వచ్చుచుండిరి. ఇక్కడ వీరు ఇంతపనిచేయుటకు ముఖ్య కారణము త్రివిక్రముని సాహసము. ఇంతకు పూర్వము దొంగలవిషయమై వెనుక

తనతో మాటాడిన యాత్రికులలోని బాటసారి, పూర్వము తన తల్లిదండ్రులకుఁ దన్ను కనునుపాయంబుచెప్పిన యా రక్తముఁ గ్రక్కినసన్యాసి. అతనిని త్రివిక్రముఁ డానవాలుపట్టెనుకాని, యా సన్యాసికిది తెలియదు. పూర్వమాతఁడు రక్తము గ్రక్కినవిధమిట వ్రాసెదను. ముందుగా విశేషము దాహముఁద్రాగి, యావెనుక లత్తుకదూదిని తెచ్చి చక్కగానమలి నోటనునిచికొని బలవంతముగాఁ గ్రక్కినయెడల నోటిలోనుండి, వెనుక త్రావిన నీళ్లువచ్చును. ఆ యుదకమీదూది మాహాత్మ్యముచే నెఱ్ఱఁబడి రక్తవర్ణముఁగలదై యితరులను భ్రమింపఁజేయును. ఇది కొన్నివేళల నపాయకరమైనను మోటవాఁడుగాన నా సన్యాసిచేసినాఁడు. ఆసన్యాసితో నిప్పుడు త్రివిక్రముఁడిట్లు మాటాడఁజొచ్చెను.

త్రి—అయ్యా తమరీకట్టఁబడిన దొంగలను పట్టించి బళ్లవద్దకుఁ జెప్పించుఁడు.

సన్యా— చిత్తము. ఇది అంతయు తమ యనుగ్రహమువలన—

త్రి— తమ యనుగ్రహమువలన నేను జన్మించినాను. తమరు నన్ను మఱచియుంటిరు. మాది రాజమహేంద్రవరము కాపురపుస్థలము. మాయింటిపేరువిస్సావారు. నా పేరు త్రివిక్రమరావు. మాతండ్రిగారు వెంకటేశశాస్త్రిలుగారు, తమరెఱుఁగరా?

సన్యా— ఆఁ! అలాగా నాయనా! (అని కౌఁగిలించికొని) ఇక సప్తజన్మాలు తపస్సుచేసినా నీఋణం నేను తీర్చుకోలేను. నీఋణం తీర్చుకున్నావు. మాకు మళ్ళీ రేపు యింత అన్నం కలుగచేశావు. లేకపోతే మేము మాడవలసినదే.

అని మాటాడికొనుచు నాపట్టినదొంగలను, నాపాకలోని సామానునంతను సంగ్రహించికొని వీరు బండ్లుచేరిరి. ఈ దొంగలుమాత్రము తమపాట్లు తమ మిత్రులకుఁదెలిసినవారు పారివత్తురనియు, వచ్చినఁబట్టువడి తమగతికేవత్తురనియు నూహించి క్రిక్కురుమనలేదు. వీరు బండివద్దకురాఁగానే మార్గమున 'బాబో' యని యొక కేకవినఁబడెను. అది వినఁగానే త్రివిక్రముఁడు తనబండ్లు దొంగలపాలయ్యెనని యూహించి వెంటనే యచ్చోటికిఁ బరుగువారెను. ఆతనితోఁగూడ నీకడమ నలువదిమందియు వచ్చిరి. వారు వచ్చుసరికక్కడ నొక ఘోరయుద్ధము జరుగుచుండెను. దొంగలందఱు పారిపోవ సిద్ధముగానుండిరి. ఇంక నప్పటికి త్రివిక్రముఁడు మొదలగువారా బండ్లవద్దికి రాలేదు.

అప్పుడు దూరమునుండి మరల 'గెలిచినాము. అడ్డదారినుండి దొంగలు పారిపోతున్నారు. ఆప్రక్కతోటలోకి పరుగెత్తి పట్టుకోండీ' అను శబ్దము వినవచ్చెను. వెంటనే త్రివిక్రముఁడును మఱొకయిద్దఱునుమాత్రము రాజబాటను బండ్లవద్దికేగిరి. అతని యాజ్ఞానువర్తులై తక్కినవారా తోటలోనికేగిరి. అప్పుడు త్రివిక్రముఁడు,

త్రి— ఏమోయి బండిఆసామీ! దొంగలు ఆ స్త్రిదోచుకోలేదుగద.

బం— నాప్రాణంవుండంగా బళ్ళదగ్గరకు రావడమేనాండి. అదుగో నాబండి దగ్గిరికి యిద్దరువస్తే ఒకడిచెయ్యి ఒకడితలకాయ కొట్టేశాన. దూరపుఓళ్లు మనవాళ్ళ ఒళ్ళలోకి యెల్లబోతే ఊచపుచ్చుకుని అరుగో ముగ్గురునలుగుర్నేశానే.

త్రి— నిజమైన బండీవాడవంటే బండివాడవునీవోయి.

బం—ఏంటోనండి. తమంటిమాప్రభులు కటాక్షించాలిగానినూకేంటుందండి.

త్రి— ఏమిచ్చినా నేను నీఋణము తీర్చుకోలేను. (అని యొక యిరువది రూపాయ లీయఁబోయెను)

బం— అయ్యా యిప్పుడు నాకెందుకండి అనుగ్రంవుండాలండి. ఆఁ, బాబు కాసెల్లానక యిప్పించండి—

వీరు ఈవిధమున మాటాడుచుండఁగా నింతలో నడ్డత్రోవను పోయిన వారందరును నార్గురుదొంగలనుపట్టి తీసికొనివచ్చిరి. ఇచ్చట బండివానిచే నైదుగురు హతులైరి. ఒకనిచేయి తెగె, పూర్వము ముగ్గురు గాయపడిరి. కాక వీరు పదియారు మందిని పట్టుకొనిరి. దొంగలందరునుగలసి ముప్పదియొక్కమందియుండిరి. అందయిదుగురుపోఁగాఁ దక్కిన యిరువదియాఱుమందిని తీసికొని యామరునాఁడుదయమున నొకగ్రామముచేరిరి. ఆయూరిలో వీరందరును దిగినవెనుక త్రివిక్రముఁడా గ్రామాధికారినిబిలిచి, తన్నెఱిఁగించికొని తాను దొంగలను గొనితెచ్చిన సంగతి వక్కాణించెను. ఆ గ్రామాధికారి వీరుంచుదిక్కారసి యెఱింగి అదివఱకు ఈదొంగలచేఁ గొట్టఁబడిన తద్గ్రామ నివాసుల నొకకొందరిని రప్పించి, వీరి పోలికలనుచూచి, చెప్పమనవారు తమ్ముఁగొట్టినదొంగలు వీరేయని చెప్పటయుఁ ద్రివిక్రమునకుఁ గొన్నివేల రూపాయల బహుమతి నిచ్చియంపెను. చూచితిరా విద్యాధికుండై యాపత్కాలమున ధైర్యమూనుటచేఁద్రివిక్రమున కెంతలాభమబ్బినదో. ఆ దొంగలసంగతిఁ జూడుఁడు. కొందఱు చంపఁబడిరి. కొందఱు జీవితకాలమంతయు కారాగృహ నివాసులుగా నుండునట్లు శిక్షింపఁబడిరి. వారివారిపైఁ దేఁఒడిన నేరములనుబట్టివారివారికిఁ దగిన శిక్షలువిధింపఁబడెను. గ్రంథవిస్తరభీతిచేతను నింకఁ గొన్నికారణములచేతను నీశిక్షవిధమును వేఁజెప్పనొల్ల. మొత్తముమీఁద నేరము ఋజువుకానిదే యొక్కఁడును శిక్షింపఁబడలేదు. చూచితిరా చెడుకార్యములు చేయువారికందరికిని గలుగుముప్పులు.

అక్కడనుండి యీపదిబండ్లతోను నారాత్రి త్రివిక్రముఁడు మరల బయలుదేరి పోవుచుండెను. కాని యీ ప్రయాణములలోఁ బండివాండ్ర దురభ్యాసమేమోగాని బండినిబండినిగలిపి నడుపనీయరు. ఆమడ నాకటి యంగటనొకటి యున్నయెడల

నేల ప్రమాదములు పాటిల్లవు. ఆదినమున త్రివిక్రముని బండివాఁడు నిద్రాదేవతచే నాకర్షింపఁబడి, యీ మహాకాననమునందలి వివిధకుసుమ నికరసౌరభభరితంబగు చలివాయువులచేఁ బరవశుండై, గడ్డితో నేర్పఁబడిన తన శయ్యంజేరి ప్రయాణాయాసంబునం బరవశుండయ్యె. అంతట నీతని బండియెద్దులును కనుమోడ్చి మెల్లగా నడచుచు న మార్గమధ్యంబున నాగుచు, నిట్లు నడువఁజొచ్చెను. తత్కారణంబున నీబండి వెనుకఁబడియె. కడమబండ్లన్నియు నీబండిఁ దాటి నాలుగైదు మైళ్ళదూరము వఱకుఁ బోయినవి. అయ్యో! ఇది యేమి పాపము! త్రివిక్రముని కష్టము లింకను గట్టెక్కవయ్యె. దరిద్రుఁడు తలఁగడిగిన వడగండ్లవాన యారంభమాయెనన్నట్లయ్యె వెనుకఁ దిగఁబడిపోయిన యీ త్రివిక్రముని బండియెద్దులు మహారాజభోగ మనుభవించుచున్న తమ యొడయనింగాంచి, తామును మహారాజులుగా నూహించి, స్వేచ్ఛానువర్తనాసక్త చిత్తములై యొకశృంగాటక ప్రదేశంబున మార్గమధ్యంబునఁ దప్పత్రోవను పోయెను. ఆమార్గమునం గొంతవడి చనఁ జన తుదకడకు బలసిపులులయఱపులును, ఎలుగులకూతలును, చిఱుతపులుల ఘీంకారములును, సింగముల గర్జనములును గలిగి యతిభీకరంబైనయొక మహారణ్యంబు కానవయ్యెను. ఎక్కడఁ జూచినఁ గొండలును, మిన్నునుముట్టినట్లుండెడి వృక్షములును, నేలయీనినపోల్కిం గనుపట్టు నక్కలు మొదలగు జంతువులును, పడగలువిప్పియాడు కాలసర్పంబులును గానవయ్యెను ముందువెనుకల కరుగనేరక యీ బండియెద్దులు అచ్చోట నాగిపోయెను. అంతట నా భయంకరములగు వన్యమృగంబుల ధ్వనులవలనఁ ద్రివిక్రముఁడును నా బండిలోని తదితరులును మేల్కాంచి యిటునటు దిలకించి, యీ సమీపమునం దెక్కడను బండ్లను గానక యిది యేమియని యా నిద్రాదేవతా ప్రియశిష్యు నా బండినాయకు నడుగఁగా, వాఁడు అప్పుడే మేల్కాంచినవాఁడగుటచే 'బండ్లు వెనుకఁబడినవి. అవి వచ్చువరకు మనబండి నిట నాపితి' నని వాక్రుచ్చెను. ఏపాటిదూరమున నున్నవని త్రివిక్రముఁడు మరల నడుగఁగా నిదె యొకమైలుదూరమున నున్నవనెను. అది నిజముగా భావించి యా త్రివిక్రముఁడు బండివానిని 'నీవిట్లు ఆబండ్లతో నుంచక ముందుగా దీసికొనివచ్చుట ధర్మముగాద' ని నుడివి మరల నిద్రింపఁబోయెను కాని యా యడవియందలి యీకూతలు అతనికి నిద్రరానీయలేదు. అంతట నిదియేదియో చూతమని త్రివిక్రముఁడు బండిదిగఁగానే యాతనిమనస్సునకు అద్భుతవిషాదములుకలుగ నటునిటు దిలకించి, ఇంతలోఁ దనకొక బారెడుదూరమున నాడుచున్న యొక కృష్ణసర్పము బుస్సుమనఁగా భయముతో వెంటనే బండినెక్కి బండివానిని బండిద్రిప్పుమని ప్రార్థించెను. ఆమూర్ఖశిఖామణియగు నా బండివాఁడు ఆమాట వినిపించుకొనక 'ఏంటిపిఱికి బాపనయ్యా' యని నగుచు

సంగతి నడుగుచుండెను. ఇంతలో నాతని యెద్దులు ముందుకు గబగబ పరుగెత్తసాగెను. బండివాఁ డెంత ప్రయత్నించినను నవి యాఁగలేదు.

ముందుకుఁ బోయినకొలఁదిని త్రివిక్రమునికి ముందు రాఁబోవు కష్టములబలిమి సూచింపనోయన నడవిబలమయ్యె. అప్పుడాతనిమనస్సు ఈ విధమునఁ జీకాకుఁజెందియుండుననని తెలుపనోయన నరణ్యంబున తరులతాగుల్మాదులు చీకాకుపడియుండెను. అతనికి రాఁబోవు కష్టము లిట్టివని తెలుపనా నెనుట సింహశరభవ్యాఘ్ర భల్లూకములు కనుపించుచుండెను. ఆ కష్టసమయంబున నీవిట్లే యేడ్చెదవని చెప్పుటకో యనునట్లానవిని నక్క లొక్కుమొగి మిక్కుటమునుగాఁ గూయఁజొచ్చె. అచ్చోఁ గనుపట్టు పర్వతంబు లాకారంబుగా అనన్యసాధారణ దీర్ఘశాఖా పరిశోభితంబులగు వటాదివృక్షంబుల శాఖలు కరంబులుగా, కటికచీఁకట్లు శరీరవర్ణముగా, నెఱ్ఱనిపూల గుత్తులుకన్నులుగాఁ, బొదలంబొదలు కంటకసంతానంబులు నిక్కఁబొడిచినకురులుగా, పాములబుస లుచ్ఛ్వాస నిశ్వాసములుగా, చెట్లమధ్యలనుండెడిసందులు తెఱచిన తలవాకిలిగా, ఘోరమృగములచేఁ దినఁబడిన మేకములయెముకల ప్రోవులుకరాళ దంష్ట్రములుగా, మిన్నుమన్నేకమగునట్లు గర్జించు క్రూరమృగంబులధ్వనులు ఝాంకారంబులుగా నటవీ మహారాక్షసుం డొక్కసారి యీబండి మ్రింగివేసెడునోయనునట్లొప్పెను. ఎన్నికష్టములువచ్చినను నవి త్రివిక్రముని బాధింపలేక సన్నమగునని చెప్పుటకుఁ గాఁబోలు నిదివఱకుఁ బండినచ్చుచున్న యీమార్గము సన్నమయ్యెను. తుదకాతనికష్టములు నిశ్శేషముగాఁబోవుటను సూచింప నాదరి నిశ్శేషంబుగా నగోచరంబయ్యె. అంతట నీబండిలోని నలువురును నిదియేమి యనుకొనుచుండఁగా దూరమున నొక భయంకరమైన ధ్వని వినవయ్యెను. అదియేమియని వీరు చక్కఁగాఁ బరికింపనచ్చో నొకపులియొక యెద్దుంబట్టి బరిమార్చుచున్నట్లు కూతలవలనఁ దెలిసినది. ఎద్దునకు పులివాతఁబడుటచేఁ బ్రాణముపోవుటను చూచిన వీరలు ఈకాంతారవ్యాఘ్రము పాలైన మనకు నదేగతియని పలవింపుచుండిరి. ఇంతలో నొకభల్లూకము వడివడిచనుదెంచి తన స్వార్జితంబగు నాస్తియని భావించి కాఁబోలు నీబండియెద్దులలో నొకయెద్దునెత్తికొని పోఁజూచెను. ఆసడి యెఱింగి బండివాఁడార్వఁగాఁ గత్తివలె వాడియైన తన నఖములతో వానిగుండెలనుజీల్చి వాఁడార్చి కష్టపడకుండ పాపము! తన భూతదయార్ద్రబుద్ధిని చూపెను. 'అయ్యో! ఇదియేలసంభవించెను? తుదకెట్టి దురవస్థపాలుపడవచ్చెను? ఓ నిద్రామహాదేవతా! ఏమి నీక్రూరస్వభావము! స్వభావము పోనిచ్చికొనుట కిచ్చయించువారెవరు? నిన్ననపనిలేదు. మాకు జాగరూకత లేమిచేతనే యిట్టిస్థితి వచ్చినది? ఓవనమా చిన్నప్పటినుండియు పెఱిగి నీపొట్టంబడుట

కేనా, కాని దేశములలో దిక్కుమాలిన పక్షియాట? ఘోరమై చెప్పినంతనె యెంత రాతిగుండెనైన గరఁగించునట్టి మరణము వొందుటకేనా యీబండివానిని భగవంతుఁడు సృజించినది? కాలమా! ఏమి నీప్రభావము? ఒకనిమిషముక్రిందట మాతో మాటాడుచున్నవాఁడింతలో మాయమయ్యెను! ఓ భగవంతుఁడా! నీవు దయావంతుఁడ వందురు! ఇదియేనా నీదయాగుణము? కాదు. అది మాలోపమువలన జరిగినది కాని నీలోపము కాదు అకటా! ఎంతదశవచ్చెను.' ఈవిధముగా నాబండిలో మిగిలిన మువ్వురును వేడువసాగిరి. చూచినంతనే భయపెట్టు నాయడవియందిట్టి ఘోరము జరిగినప్పుడిక వారిమనంబులెట్లుండునో నేను చెప్పనేల? మొదట నీయడవిని చూడఁగానే వీరల కందఱికును సగము ప్రాణము పోయెను. ఇప్పుడాతక్కిన సగమునుఁ బోవునట్లు తోచెను. ఎక్కడఁజూచినను గొండలే. ఎక్కడచూచినను వృక్షములే. పైయాకసమైన నీచెట్లదట్టముచే గనఁబడకున్నది. చింతనిప్పులవలె మెఱయు కన్నులుగల క్రూరమృగములు వారికి సహచారులయ్యెను. కాలుపెట్టనెడములేక పొదలతోను తీగెలతోను నొప్పారెడు నాఘోరతమఃప్రకీర్ణంబగు నాయటవి వీరికి నివసించు నిల్లాయెను. ఓ భగవంతుఁడా ఏమి సేయ.

ఈవిధమున నాబండివాఁడు చావఁగా నది కనులారఁ గాంచిన యాలోని మువ్వురును నివ్వెఱఁగంది దేహంబు మఱచి భయోత్కంపిత హృదయులై చేష్టలు దక్కియుండిరి. కాని కొంతసేపటికిఁ ద్రివిక్రముఁడు ధైర్యము దెచ్చుకొని లేచిచూడఁగా బండియెద్దులుగాని తనవద్దికడను యిర్వురు మిత్రులుగాని దృష్టిగోచరముకాలేదు. అప్పుడు త్రివిక్రముఁడు పెద్దలమాటలకుఁ గోపించి పారిపోయినది మొదలు నేటివఱకుఁ దనకువచ్చిన కీడు మెల్లనుదలపోయుచు నాయడవిమారు మ్రోయునట్లు మిట్టిపడి యేడ్చుచు చెక్కిన చేయిడి కంటినుండి యురులు నశ్రుకణంబులనుండియుండి తుడిచికొనుచు, మధ్యమధ్య నరణ్యముం గాంచి 'అయ్యో' యని గుండెలు బాదికొని మాటలాడనేరక నేలకొరగుచు, మరల లేచి తనదుస్థితిం దలపోయుచు ఓ మహారణ్యమా! మామిత్రుల నందర నీపొట్టం బెట్టుకొంటివిగదే! నన్నీ కాని ప్రదేశమున దిక్కుమాలినపక్షినై యల్లాడఁజేసితివిగదే! తల్లీ! హా! అమ్మా! నీవు బ్రతికియుండిన నాకిన్ని తిప్పలు రావుగా! అని నోరు తెఱచి గుండెలు బాదికొనుచు మరల 'ఓ గోదావరీ! ఓ నదీమతల్లీ—' యనుచు లేచుచు, గూర్చుండుచు, బండిదిగనెంచి మరల దూరంబున నీమృగముల యెలుఁగులవిని భయమునొంది లోలోగ్రుక్కిగ్రుక్కి యేడ్చుచు, పండుకొనుచు, వెంటనే లేచుచు మొగమెత్తిగఁ గందగడ్డవలెఁగంద నొక్కిపెట్టిన భోరున హాహా రావంబులొనర్చుచుండెను. అంతలో నాతనికి భగవంతుని దివ్యనామంబు స్మరణకు

వచ్చుటయు నాతనిం దన యసమాన్యపాండిత్యముంకల భాషతో ‘ ఓ భగవంతుఁడా! దయాళుఁడా! దీనుని నన్ను ఈకష్టసాగరమునుండి దరిజేర్పుము. నీవు కాకున్న నన్ను రక్షింపనీకెవ్వరు? నాకు దిక్కు నీవుకాక వేరొక్కరె? నేను చేసిన యకృత్యములకు నన్ను క్షమించి నాయందలి పుత్రవాత్సల్యముతో నన్ను గాపాడుము’ అని చేతులుజోడించి భూమిపై సాగిలఁబడి నిశ్చలభక్తితోఁ బ్రార్థింపఁజొచ్చెను.

ఇంతలో నాతనిపాలిటి భాగ్యదేవతయో యనునట్లు ప్రభాతంబాసన్నంబయ్యె. భాస్కరుండిదేవచ్చినిఁకనీకష్టంబులుగట్టెక్కెనని ధైర్యంబుచెప్ప నా సురపతిదిశయందు భాస్కరదివ్యధ్వజ ఖచిత మాణిక్యాంబోయన వేగుచుక్క వొలిచెను. ఈ త్రివిక్రముని రాత్రికష్టంబులనెల్లఁ దిలకించి జాలిచేఁ గుందికందెనో యన చంద్రుండంతకంతకుఁ గాంతిరహితుండు గాఁ జొచ్చెను. నిష్కారణముగా నొకబాలుని మిత్రులఁ దనపొట్టం బెట్టికొనినందులకుఁ గోపించి, యా యటవీమహారాక్షసుఁ జంపనెంచి ప్రాగ్దిశాశక్తి మొగమెఱ్ఱచేసికొనెనా యనునట్లు పూర్వదిగ్భాగంబున సంధ్యారాగంబుదోఁచె. తమ మగనికంటె నితఁడు డింకొకఁడు గగనపథవర్తియై పవలెల్ల లోకంబులఁ బాలింప నరుదెంచెడిని, వానికన్నులంబడుట పతివ్రతాధర్మంబుగాదని కాఁబోలు తార లంతకంతకగోచరంబులయ్యె త్రివిక్రమునికి రాఁబోవు నున్నతదశను సూచించు జయజయధ్వనులు నానాయటవియందలి శుకపికాది పక్షిసంతానంబులు కలస్వనంబులఁ జేయఁదొడంగె. కువలయమిత్రుండగు నీ చంద్రుఁ డరుగుటకుఁ జింతించి, కువలయంబు పోవలదని యాతనివేఁడ నీశశాంకుఁడు ఏనింకఁగళంకిని రాబోవువాఁడు లోకబాంధవుండని పల్కి నది యంగీకరించి తల యెగరవైచెనాఁజెప్పనొప్పి ముఖ్యప్రాణమాహాత్మ్యంబున గువలయంబట్టిటు నల్లాడఁబోయెను. సహస్రవిధములనే భూమికుపకారంబు గావించెదనను టకు దృష్టాంతముగా సహస్రకరుండై యా సహస్రకరుం డగుదెంచె. దిక్కులు తెలివిగాంచె. వన్యమృగంబులు పొదలంబొంచె. కలువలు ముకుళించె. అబ్జములు వికసించి తమ సహస్రకరంబుల నా సహస్రకరు సహస్రకరంబులఁబట్టి నవ్వుచు నాడంజొచ్చె. త్రివిక్రమునికిఁ గొంతభయంబువాసె. అటవియందలి భయావహములగు వస్తువులన్నియు నిప్పుడు త్రివిక్రమునికంత భయంకరముగా లేవు.

ఇట్లు ప్రభాతంబైన వెంటనే యా మహావిపినమధ్యంబునఁ ద్రివిక్రముండటునిటు నలుదెసలఁ బెక్కుసారు లుపలక్షించి తానొక మహారణ్యమధ్యంబున నాలుగు కొండలమధ్య నొకదట్టమైన యడవిలో మిక్కిలి భయంకరమగుచోట నుంటినని యెఱిఁగికొని యింతవఱకును వెనుక దిగఁబడిన తనవారిబంధువచ్చి తన్ను రక్షించునను నాశ నిరాశచేసికొని, ఎందులకైన నక్కఱకువచ్చుననియు బ్రతికియుండిన నది

మిగుల నావశ్యకమనియుఁ దన పెట్టెలలోనున్న ధనమునంతయు దీసి జాగ్రత్తగా దన మొలత్రాడునకు సంచులఁగట్టి యందు భద్రముచేసి దంతధావనము చేసికొనుటకై యెక్కడనైనఁ గొంచె ముదకము దొరకునేమో యను నాశచే నాల్గుమూలలఁ జూడఁగా నక్కడకొక కొంచెముదూరములో నొకసెలయేరు కానవచ్చెను. దానిని చూచి వెంటనే యొక చేతికఱ్ఱతో నొక పలుదోముపుల్లను తీసికొని యావంకకేగుటకు నిశ్చయించి బండి డిగ్గి బయలుదేరెను త్రోవలో నేమూలనుండి యే క్రూరమృగము వచ్చి యేమి చేసిపోవునో యను భయముచే నాతఁడు మెల్లగా నుండంతటను బరీక్షించుచు మఱి నడచుటచే నాతని గమనము మిగుల మందముగానుండెను కాని యింత మాత్రమునుచే నాతఁడు ఇప్పుడు హంసనడకలవాఁ డనరాదు. ఆ మాంద్యమునకు తోడు నెమ్మదియొక్కటి యుండినయెడల అతఁడు నిజముగా నిప్పుడు హంసను నడలలో గెలువనేగెలుచును. కాని యాతని స్థితిగతులనుబట్టి యిప్పుడున్న తొట్రుపాటు ఆతనికీబుద్ధి తోపించదయ్యె. నడచుచుండఁగాఁ ద్రోవలోఁ గాలిలో ముల్లు గ్రుచ్చుకొని నప్పుడు 'అబ్బా' యని యాతఁ డఱచుకేకయు, నిట్టూర్పును, రోదనమును వినువారికి సహజముగా విచారము కలిగించుచుండఁగా, శ్రావ్యమైన సుఖవాక్కులుగల యాతని కంఠమునకుగూడఁ గళతగ్గి రాత్రి రోదనముచే బొంగువోయి స్వరము హెచ్చి గార్దభకంఠమాయె వేయని యొక కఠినతమమైన సంతాపముగూడఁ గలుగకపోదు. ఏప్రక్కనుండి యే పాముకఱచునో, యేమూలనుండి యేపులివచ్చునో యను భయముచే ముఖము వెల్లబారియుండఁగాఁ గన్నులనుండి బాష్పములు సంతతధారగాఁ గారఁగా నడుగుదీసి యడుగునుంచునప్పుడు పాదము తడబడి వడవడ వణఁకఁగా మాటిమాటికి ముక్కునుండి నీళ్లు కారఁగాఁ దన్ను రక్షించువారెవ్వరును లేమికి వగచుచు, నాకొకపరివచ్చు దుఃఖము నాపుకొనుచు నది మరల ముంచుకొనివచ్చినప్పుడు 'హా!' యని నోరుతెఱచి గ్రుక్కత్రిప్పనేరక కళవళపడుచు, నరణ్యరోదనమని మనవారలనునది యిదియొకదాయని యనుకొనుచు, నాసెలయేరుదిక్కు మొగంబై పోవంబోవ నక్కడ నొక సన్నని యిసుకఁగల మార్గము కానవచ్చెను. కాని యామార్గమునందు పాముపుట్టలు మెండుగానుండెను. అందుల కెంతమాత్రమును జంకక, "విఘ్నైర్ముహుర్ముహురపి ప్రతిహన్యమానాః। ప్రారబ్ధ ముత్తమగుణా నపరిత్యజంతి." * అను నీతివాక్యమునుబట్టి పనిచేయ యత్నించి తిన్నగా నాత్రోవను బోయెను.

* దీనికి తెలుఁగు—ధైర్యవంతులు ఏపనినైన నారంభించినప్పు డెన్నివిఘ్నములు వచ్చినను పట్టుడలనదలక, వానికిలొంగక కార్యసాఫల్యమునే ఃచారి తురు.

ఇది సూర్యునిచుట్టి తిరిగెడి యనంతములైన యుల్కారాసులలో నొకటి, మఱి వానిలో మొదటితరగతిదిగానైనను గాక మూడవతరగతిలోఁ జేరినదిగానున్నది. మూడవ తరగతిదే యింత యాశ్చర్యకరముగా నున్నప్పు డిఁక మొదటితరగతి యెంత యద్భుతజనకములుగా నుండునో! ఆహా! సృష్టిమహిమల నేమనవచ్చును! ఎంత బలముగల దూరదర్శకయంత్రములతోఁ జూచినను దాపునకుఁ బోవువఱకును ఉల్కాలరాసులు కనఁబడవు



ఇట్లు ముప్పదిమూడుసంవత్సరముల కొకొక్కపర్యాయము మాత్రమే కాక యితరసమయములయందు సహిత మప్పుడప్పు డుల్కాలవానలు కురియుచుండును ౧౭౯౯, ౧౮౩౩, ౧౮౬౬ సంవత్సరములలో గొప్ప యుల్కాలవానలు కురిసినవి ఈ యుల్కాలవానలన్నియు నేకరాసినుండియే కార్తికమాసమునఁ బడుచువచ్చినవి ఇందలి కడపటి యుల్కావర్షము ౧౮౬౬వ సంవత్సరము నవంబరు ౧౩వ తేదిని సంభవించినది ఉల్కాకక్ష్యలో ౫౦౦౦౦౦౦౦౦ మైళ్ల పొడుగునను ఉల్కలు వ్యాపించియుండినవి ౧౮౩౩వ సంవత్సరములో భూమి యీ యుల్కారాసి వద్ద భాగమునందున్న ఘనమేఘమునుండి ౧౦౦౦౦౦౦౦౦ మైళ్ల దూరములో విస్తృత

రాచుకొనిపోయినది; ౧౮౭౨వ సంవత్సరములో వెనుకవైపున ౨౦౦౦౦౦౦౦౦ మైళ్ళదూరమునుండి పోయినది

ఉల్కలు కొంచెముగానో గొప్పగానో ప్రతిరాత్రియు కానవచ్చుచున్నను, సంవత్సరమునకు రెండుసారులు శ్రావణమాసములో నొకనాఁడును (ఆగస్టు ౧౦వ తేదిని), కార్తికమాసములో నొకనాఁడును (నవంబరు ౧౧వ తేదిని) భూమి యుల్కారాసులమధ్యనుండిపోవుట తటస్థించుచుండుటచేత నా రెండుదినములలోను భూమిమీఁద నుల్కలమితముగా పడును శ్రావణమాసములో పడునవి యయాతి నక్షత్రరాశివైపునుండియు, కార్తికమాసములో పడునవి సింహరాశివైపునుండియు, వచ్చును. అనేకములయిన యుల్కారాసులలోఁ గలిసి నడుమ నొక తోఁకచుక్క కానఁబడుచున్నది కార్తికమాసములో తారసించెడి యుల్కారాశిలోని తోఁకచుక్క మిక్కిలి చిన్నదయి దూరదర్శకయంత్రముతోమాత్రమే చూడఁదగినదయి యున్నది ఇందలి యుల్కలు మిక్కిలిచిన్నవి మనభూమి సరిగా వీనిమధ్యమునుండియే పోవును శ్రావణమాసములో తారసించెడి యుల్కారాశిలోని తోఁకచుక్క పెద్దదయి ప్రకాశమానమైనదిగానున్నది. ఈరాశియొక్క నడిమికిపోక యొకయోరనుండిమాత్రమే మనభూమి పోవును మనకుఁ గనఁబడెడి ప్రతి ధూమకేతువుచుట్టును దాని నాశ్రయించి యసంఖ్యములయిన యుల్కలుండియుండవచ్చును పైనిజెప్పినట్లు దూరదర్శకయంత్రముతోఁ జూచినను మనదృష్టికి తోఁకచుక్కలుమాత్రమే కానఁబడునుగాని, యుల్కలు కానఁబడవు తోఁకచుక్కలతోఁగూడి యనంతములయిన యుల్కలరాసు లెల్లప్పుడును చుట్టును దిరుగుచు, సదా జ్వలించుచుండెడు సూర్యునికి కట్టెలవలె నుపయోగపడుచున్నవని కొందఱూహించుచున్నారు క్రిందపడిన యుల్కాశిలలనుమాత్రమే కాక పొడుమయి పర్వతాగ్రములు మొదలయిన యున్నతప్రదేశములయందుఁ బడిన యుల్కాచూర్ణమునుగూడ శోధించి శాస్త్రజ్ఞులు రెంటియందు నేకరీతిపదార్థములే యున్నట్టు కనిపెట్టియున్నారు ఇందు లోహములలో నినుమధికముగానున్నది; కొన్నిజాతుల శిలావిశేషములును, భాస్వరమును, జలవాయువును, కూడనున్నవి. వీనిచూర్ణము సదా భూమిమీఁద పడుచుండుటచేత భూమిబరువంతకంతకు హెచ్చుగుచున్నదని శాస్త్రవేత్తలు గణించి చెప్పుచున్నారు

ధూమకేతువులవలెనే యుల్కాపాతములను దేశారిష్టసూచకములనిభావించి మనదేశమునందు జనులు మౌఢ్యముచేత సమస్తాపదలను వాని కారోపించుచున్నారు. శాస్త్రజ్ఞానము జనులలో వ్యాపించి యిట్టి మూఢవిశ్వాసమును శీఘ్రకాలములోనే మనదేశమునుండి పాఱఁదోలును గాక!

తొమ్మిదవ ప్రకరణము.

నక్షత్రములు.

ఇంతవఱకును మనము మన సూర్యునిగూర్చియు సూర్యుని చుట్టును దిరుగుచుండు గ్రహములు ధూమకేతువులు మొదలయినవానినిగూర్చియుఁ గొంతవఱకుఁ దెలిసికొనియున్నాము ఇఁక మనము చేరువనున్న యీ చిన్న సూర్యగ్రహమండలిని విడిచి దూరముననున్న నక్షత్రమండలములకుఁబోయి వానినిగూర్చికూడఁ గొంచెము తెలిసికోవలెను ప్రత్యేకముగాఁ జూచునప్పుడు బ్రహ్మాండపటల మనఁబడెడు మన సూర్యగ్రహమండలి యపారమయినదిగా తోఁచినను, అనంతములయిన నక్షత్రకోటులతోఁ గలిపి చూచునప్పుడది బ్రహ్మాండకోటులలో నొక్కటియయి చిన్నదిగా తోఁచకపోదు ఒకదానికొకటి యెంతోదూరమున నున్నట్లు కనఁబడెడు గ్రహములు, ఉపగ్రహములు, ధూమకేతువులు, ఉల్కారాసులు మొదలయినవానిచేత నిరంతర ప్రదక్షిణములు చేయించుకొను తేజస్సముద్రమయిన సూర్యమండలము, నక్షత్రముల కొకదానినుండి యొకదానికిఁగల దూరముతోఁ బోల్చిచూచునప్పుడు మన కత్యంతసమీపముననున్న యొక్కచుక్కయగును సృష్టిని సమష్టిమీఁద విచారింపఁగా మన సూర్యుఁడాకాశమున మిణుకుమిణుకుమను లెక్కలేని చుక్కలలో నొక్కటియేకాని యంతకంటె నెక్కువదికాదు సూర్యబింబ మన్నినక్షత్రములలోను పెద్దదయినను కాదు ఆకాశమునందలి నక్షత్రములలో మనసూర్యునికంటె పెద్దవియు ననేకములున్నవి మేఘావరణములేనప్పుడు చీఁకటిరాత్రులలో నాకాశమువంకఁ జూచినప్పుడు మన నెత్తిపయి నన్నిప్రక్కలను నక్షత్రములు గణనాతీతములుగా నున్నట్లు కనఁబడును కంటికగపడు నక్షత్రములన్నియు లెక్కింపఁబడుటయేకాక వివరముగా పటములలోఁ జూపఁబడియున్నవి నిర్మలమయిన యాకాశమువంక నెంతటి చీఁకటిరాత్రిలోఁ జూచినను నేత్రమున కొక్కసారిగా గోచరములగు నక్షత్రములు రెండుమూడువేలకంటె నెక్కువగా నుండవు. ఈ లెక్కనుబట్టిచూడఁగా నాకాశమున నొక్కప్రక్కను రెండుమూడువేలు కనఁబడినప్పుడు రెండుప్రక్కలనుగలసి యయిదాఱువేల నక్షత్రములకంటె నెక్కువ యుండనట్టు స్పష్టమగుచున్నది అయినను గగనభాగమునందు నిజముగానున్న నక్షత్రములసంఖ్య మాత్రమింతేకాదు దూరదర్శకయంత్రమును గొని పరీక్షించినచో నంతకుముందు దృగ్గోచరములుకాని నక్షత్రపంక్తులవెనుక నక్షత్రపంక్తు లనంతమయినదూరమువఱకు క్రొత్తక్రొత్త వనంతముగాఁ గానవచ్చుచు నక్షత్ర

ముల సంఖ్యకు పరిమితియే లేనట్టుతోఁపఁజేయును నక్షత్రములులేని స్థల మెంతదూరమునకైన నుండు నేమో యూహాకందదు. ఇదివఱకుఁ దెలిసియున్న నక్షత్రములలో నతిసూక్ష్మములగుటచే విడువఁబడినవిపోఁగా మిగిలిన వొక్క యుత్తరార్ధగోళమునందుఁ గనఁబడు నక్షత్రములు మూఁడులక్షలకంటె నధికముగా పటములలో వేయఁబడియున్నవి ఒక్క జ్యోతిశ్శాస్త్రజ్ఞుఁడు తన దూరదర్శక యంత్రమునకుఁ గనఁబడిన నక్షత్రములిన్నూఱులక్ష లున్నవని వ్రాసియున్నాఁడు నక్షత్రమనఁగా మన సూర్యునివలెనే వేఁడిని వెలుతురును గలిగించెడు తేజోమండల మగుటచేత, ఇన్నూఱులక్షల నక్షత్రములనుటకిన్నూఱులక్షల సూర్యులనియే యర్థమగును ఈ కోట్లకొలఁది సూర్యులలోఁ గొన్ని మన సూర్యునికంటెను బహుగుణములు పెద్దవిగానున్నవి, కొన్ని చిన్నవిగానున్నవి, కొన్ని మనసూర్యునంతలేసియున్నవి అనంతములయిన యీ సూర్యులన్నిటిచుట్టును మన సూర్యునికివలెనే ప్రాశికోట్లతోనిండిన యెన్నోగ్రహములు ధూమకేతువులు మొదలయినవి మనకు దృగ్గోచరములుగాక తిరుగుచుండి యుండుననుటకు సందేహముండదు

ఆకాశమువంకఁ జూచినప్పుడు మనకు నక్షత్రములన్నియు సమానకాంతితోఁ గనఁబడక, కొన్ని యల్పకాంతి కలవిగాను కొన్ని యధికకాంతి కలవిగాను వివిధములుగాఁ గానఁబడును ఇట్లు కనఁబడుటకుఁ గారణము కొన్ని పెద్దవిగాను గొన్ని చిన్నవిగాను నుండుటయైనను, కొన్నిదూరమునను గొన్నిసమీపమునను నుండుటయైనను, కావచ్చును కొంతవఱకీరెండును గారణములుగానున్నవి కొన్ని నక్షత్రము లల్పకాంతిగలవానికంటె నధికకాంతిగలవే మనకు చేరువగానున్నను, మఱికొన్ని నక్షత్రము లల్పకాంతిగల వానికంటె నధికకాంతిగలవే మనకు దూరస్థములుగానున్నవి కాంతి తారతమ్యమునుబట్టి కంటికిఁ గనఁబడు నక్షత్రము లాఱుతరగతులుగా భాగింపఁబడియున్నవి. అందధిక తేజోవంతములయినవి మొదటితరగతివి, వానికంటెఁ గొంచెము తక్కువ తేజస్సుగలవి రెండవతరగతివి ఈప్రకారముగా తేజోమాంద్యమునుబట్టి పరిగణింపఁబడుచురాఁగా నన్నిటికంటెను తక్కువ తేజస్సుగలవి యాఱవతరగతివగును. ఈ కడపటి తరగతికన్న చిన్నవి యంత్రసాహాయ్యములేక నేత్రగోచరములు కావు ఇట్లు నేత్రగోచరములగువానిలో మొదటితరగతి నక్షత్రము లిరువదివఱకున్నవి, రెండవతరగతి యఱువదియైదువఱకున్నవి; మూఁడవతరగతి విన్నూఱువఱకున్నవి. ఈవిధముగా నంతకంతకు సంఖ్య హెచ్చుచురాఁగా, ఆఱవతరగతివద్దికి వచ్చునప్పటికవి మూఁడువేలకంటె నెక్కువగాఁ గనఁబడును ఇట్లు కేవలనేత్రమునకు గోచరములగునవి యన్నియు నయిదాఱువేలే యయినను, దూరదర్శక యంత్రములలోఁ జూచు

నప్పుడు యంత్రబలముకొలఁదిని నక్షత్రములు లక్షలకును కోట్లకును పెరుగుచువచ్చునని యిదివఱకే తెలిసికొనియున్నాముగదా? యంత్రసాహాయ్యముచేతనే కనఁబడెడి యీ చిన్ననక్షత్రములు కాంతిభేదమునుబట్టి మఱి పదితరగతులుగా విభజింపఁబడియున్నవి ఇందు కడపటిదైన పదునాఱవతరగతి నక్షత్రము మిక్కిలి బలిష్ఠమయిన యంత్రముతోఁ జూచినప్పుడుగాని కానరాదు. ఇట్లు యంత్రబలముచేతనే చూడఁదగిన నక్షత్రము లిన్నూఱులక్షలకంటె నధికముగానున్నవి. యంత్రములతోను గోచరములుకానివి మఱి యెన్నియున్నవో!

చిరకాలముక్రిందటనే యీ నక్షత్రములన్నియు రాసులుగా నేర్పఱుపఁబడి, పూర్వులు భావించుకొన్నరూపములనుబట్టి వానివానికాయాపేరులు పెట్టఁబడియున్నవి సాంవత్సరికగతియందు సూర్యుఁడాయామాసములలోఁ బ్రవేశించి నడుచునట్లు కనఁబడెడు మేషాది ద్వాదశరాసులనుగూర్చి వెనుకటిప్రకరణములలోనే చెప్పఁబడినది ఆకాశమునందీ ద్వాదశరాసులచేతనయిన వలయము రాశిచక్రమనఁబడును. ఈ ద్వాదశరాసులును భూమిమీఁద నుత్తరార్ధగోళమునందుండువారికిని దక్షిణార్ధగోళమునందుండువారికినిగూడఁ గానఁబడును. రాశిచక్రమునకుఁ బయిని ఉత్తరార్ధగోళము నందు కనఁబడు నక్షత్రము లుత్తరరాసులనియు దక్షిణార్ధగోళమునందు కపఁబడు నక్షత్రములు దక్షిణరాసులనియు చెప్పఁబడును.

రాశిచక్రమున కుత్తరముననున్న నక్షత్రముల గుంపు లిరువదియైదు రాసులుగా విభజింపఁబడియున్నవి—

౧ బృహదృక్షము
౨ లఘుఋక్షము.
౩. కాలీయము
౪ వృషపర్వుఁడు.
౫. భూతపము
౬ ఉత్తరముకుటము
౭ శౌరి
౮ స్వరమండలము.
౯ రాజహంస
౧౦ శర్మిష్ఠ
౧౧ యయాతి
౧౨ సారథి
౧౩. భుజగధారి.
౧౪ సర్పము.
౧౫ శరము
౧౬ గరుడుఁడు
౧౭ శార్ఙ్గపాణి
౧౮ అశ్వముఖము
౧౯ ఉచ్చైశ్రవము.
౨౦ దేవయాని.
౨౧ త్రిభుజము.
౨౨ కరభము
౨౩. విశ్వకద్రుపు
౨౪ జంబుకము.
౨౫. హృదయము

రాశిచక్రమునకు దక్షిణముననున్న నక్షత్రములగుంపులు పదునెనిమిది భాగములుగా విభజింపఁబడియున్నవి—

౧ తిమింగిలము	౭ నౌక	౧౩ పీఠము
౨ మృగశీర్షము.	౮ వాసుకి	౧౪ దక్షిణముకుటము
౩. యమున	౯ చషకము	౧౫ దక్షిణమత్స్యము
౪ శశము	౧౦ ధ్వాంక్షము	౧౬ శృంగాశ్వము.
౫. బృహల్లుబ్ధకము	౧౧ నరాశ్వము	౧౭ పారావతము
౬ లఘులుబ్ధకము.	౧౨ వృకము	౧౮ స్వస్తికము

చంద్రగతినిబట్టి మనవారేర్పఱచిన యిరువదియేడు నక్షత్రములలోను, అశ్వని, భరణి, కృత్తిక, రోహిణి, మృగశిర, ఆర్ద్ర, పునర్వసు, పుష్యమి, ఆశ్లేష, మఖ, పుబ్బ, ఉత్తర, హస్త, అను పదుమూడును విషువవృత్తమునకుత్తరమునను, చిత్త, స్వాతి, విశాఖ, అనూరాధ, జ్యేష్ఠ, మూల, పూర్వాషాఢ. ఉత్తరాషాఢ, (అభిజిత్తు), శ్రవణము, ధనిష్ఠ, శతభిషము, పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర, రేవతి, అను పదునాలుగును విషువవృత్తమునకు దక్షిణమునను, ఉన్నవి అభిజిత్తును జేర్చినయెడల నిరువదియెనిమిది నక్షత్రములగును.

కొంతకాలము క్రిందటివఱకును నక్షత్రముల దూరమును కనుఁగొనుటయే యసాధ్యమని తలంపఁబడినను, లక్షలకొలఁది నక్షత్రములలో పదిపండ్రెంటిదూర మిప్పుడించుమించుగా తెలిసికోఁబడినది నక్షత్రములకును మనకునుగల దూరమును విచారించునప్పుడాదూరములో సూర్యునికిని మనకునుగల దూరము సహస్రతమాంశముగానైన నుండదు నక్షత్రములదూరమును కనుఁగొనుటకయి మొట్టమొదట పాదరేఖ యేర్పఱచుకొనుటయే దుర్ఘటమయినది మనము గోదావరివంటి పెద్దనదియొక్క వెడల్పును సరిగా దిగికొలుచుటకు శక్యముకానప్పుడు దానివెడల్పెంతో కనుఁగొనవలెనన్నపక్షమున, మనమీవలియొడ్డున నిలుచుండి యావలియొడ్డుననున్న యొకవృక్షమును గుఱుతిడుకొని దానినుండి మనము నిలిచిచూచినతావున కొక సరళరేఖను భావించుకొని తరువాత మొదటితావునుండి యొడ్డు పొడుగునను మఱి నూఱడుగుల దూరము నడిచి యక్కడ నొకతావున నిలువఁబడి యక్కడనుండి యావలియొడ్డుననున్న తొంటివృక్షమునే మరలఁ జూచినపక్షమున దానిస్థానము మాఱి యక్కడనుండి మనమిప్పుడున్నతావునకు భావించుకొన్న సరళరేఖకును మొదట భావించుకొన్న సరళరేఖకును నడుమను కోణమేర్పడును ఈవలియొడ్డున మనము నిలుచుండి వృక్షమునుండి సరళరేఖలను భావించుకొన్న రెండుతావులకును నడుమఁగలదూరమును సరళ

రేఖగా సరిగా కొలిచినపక్షమున నిప్పుడు త్రిభుజాకారముగా నేర్పడిన యీమూడు రేఖలలో నీవలియొడ్డున సరిగాఁ గొలిచిన యీరేఖయే పాదరేఖయగును అప్పుడీపాదరేఖ యొక్క కొనలనుండి యావలియొడ్డుననున్న వృక్షమువద్దికి భావించుకొన్న రెండు బుజురేఖలవలనను పాదరేఖమీఁద నేర్పడిన రెండుకోణములను సరిగా కొలిచి వాని పరిమాణమును దెలిసికోవచ్చును ఇట్లొక త్రిభుజముయొక్క యొకభుజము యొక్కయు రెండుకోణములయొక్కయు పరిమాణమును దెలిసికొన్నతరువాత గణిత శాస్త్రమునుబట్టి తక్కిన భుజములయొక్కయు కోణములయొక్కయు కొలతను సులభముగాఁ దెలిసికోవచ్చును. కాఁబట్టి యీలెక్కనుబట్టి దిగి కొలువనక్కఱలేకయే నదియొక్క వెడల్పును మనము సరిగాఁ దెలిసికోఁగలుగుదుము ఈప్రకారముగానే మొట్టమొదట పాదరేఖయు దానికొనలనుండి దూరవస్తువువద్ధికి భావించుకొను బుజురేఖలచే రెండుకోణములును నేర్పడినపక్షమున, ఎంతదూరవస్తువుయొక్క దూరము నయినను నిర్ణయించి తెలిసికోవచ్చును. పాదరేఖ తగినంత దీర్ఘముగా నుండనిపక్షమున, కనుఁగొనవలసినవస్తువు దూరముననున్నప్పుడు పాదమున కోణము లేర్పడవు

ఈ మార్గముచేతనే చంద్రునికిని భూమికిని నడుమఁగల దూరము సులభముగా కనుఁగొనఁబడినది చంద్రునిదూరమును తెలిసికొనుటకు తగిన పాదరేఖ భూమిమీఁదనే యేర్పడినది ఒకఁడు భూమియొక్క యొకకొనను మఱియొకఁడచ్చటి కెనిమిదివేల మైళ్ళదూరములోనున్న భూమియొక్క రెండవకొనను నిలుచుండి చూచువఱకును సూర్యునియొక్క స్థానముమాఱి పాదరేఖ యేర్పడనందున సూర్యునిదూరమును కనుఁగొనుట యధిక కష్టసాధ్యమయ్యెను.

ఇఁక నక్షత్రముల విషయమై యన్ననో, ఒక కొననుండి యొకకొనకు భూమిమీఁదఁగల యెనిమిదివేలమైళ్లదూరము సహితము పాదరేఖ యేర్పడుటకు చాలక యది యంతయు నొక బిందుప్రాయమగుచువచ్చెను అందుచేత నేమియు నాలోచనపాలుపోక నక్షత్రములదూరమును కనుఁగొనుట కుపాయాంతరముతోఁచక కొంతకాలము జ్యోతిష్కులు చిక్కులుపడుచుండిరి. ఇట్లుండఁగాఁ గొందఱు బుద్ధిమంతు లొక యుపాయము నాలోచించి మనభూమి తన విశాలమయిన కక్ష్యలో సూర్యునిచుట్టును తిరుగుచుండుటనుబట్టి, భూమి తనకక్ష్యలో వేసవికాలముయొక్క నడిమిభాగమునందొక కొన నున్నప్పు డక్కడనుండి నక్షత్రముయొక్క స్థానమును గుఱుతుపెట్టుకొని తరువాత నాఱుమాసములకు శీతకాలములో భూమి తనకక్ష్యలో పదునెనిమిదికోట్ల మైళ్లదూరము రెండవకొనకుఁ బోయియున్నప్పు డక్కడనుండి యానక్షత్రముయొక్క స్థానమును మరల గుఱుతుపెట్టుకొని రేఖలను భావించుకొనుచు వచ్చినను దాని స్థాన

ములో పూర్వేమియుఁ గలుగక యింతదూరమును బహునక్షత్రముల విషయములో బిందుప్రాయమయి చేసిన కృషియంతయు విఫలమగుచువచ్చెను అయినను వారంత టితోఁ దమకృషినివిడువక యొకటివిడిచి యొకటిగా నితరనక్షత్రములవిషయమున నిట్లు ప్రయత్నించుచురాఁగా కడపటవారికృషి కొంతవఱకు సఫలమయి భూమికత్యంతసమీప మునన్న నక్షత్రములుకొన్నిటికిమాత్ర మల్పపాదరేఖ యేర్పడినందున వారు వాని దూరము నించుమించుగా గణనచేయఁగలిగిరి ఇట్లు గణనచేయఁబడిన నక్షత్రములలో నెల్లను మనభూమికి మిక్కిలి సమీపముననున్నది నరాశ్వమనునక్షత్రము తెలిసినంత వఱకు నక్షత్రములలోనెల్లను మన కత్యంతసమీపముననున్న యీ నక్షత్రము మన భూమికి సూర్యుఁడున్నదానికంటె నిన్నూట యిరువదియైదువేల రెట్లధికదూరములో నున్నది రాజహంసమను మఱియొకనక్షత్రము మనకు సూర్యునికంటె నైదులక్షలరెట్లె క్కువదూరములోనున్నది మృగవ్యాధనక్షత్రము సూర్యునికంటె మనభూమికి దాదాపుగా పదిలక్షలరెట్లధికదూరములోనున్నది సూర్యునికంటె పదిలక్షలరెట్లనఁగా సూర్యుని కిని మనకునుగల దూరమగు తొమ్మిదికోట్ల పదిలక్షలమైళ్లను పదిలక్షలచేత గుణింపఁగా వచ్చెడు ౯౧౦౦౦,౦౦౦,౦౦౦,౦౦౦ మైళ్లదూరముగదా! ఇంతదూర మిట్లుండునని యూహించుటయే మనకు దుస్తరమగును. భూమికి మిక్కిలి చేరువనున్న నక్షత్రములే యింతదూరములోనున్నప్పుడు, పాదరేఖ యేర్పఱుచుకొని కొలుచుటయే యసాధ్యమయి వీనికంటెను శతగుణములును సహస్రగుణములును అధికదూరములోనున్న నక్షత్రముల దూరము నెవ్వరూహింపఁగలుగుదురు?


సెకనునకు (విలిప్తకు) ౧౮౬౦౦౦ మైళ్లచొప్పున యాత్రచేయుచు సూర్యకాంతి యెనిమిది ౧/౩ నిమిషములకాలములో మనభూమిని జేరఁగలుగును. ఇట్లింతవేగముతోనే నడుచుచు దక్షిణార్ధగోళములోని ప్రకాశమానమగు నరాశ్వనక్షత్రముయొక్క కాంతి మన భూమిని జేరుటకు మూడుసంవత్సరముల యాఱుమాసములకాలము పట్టును. రాజహంస నక్షత్రముయొక్క కాంతి భూమినిజేరుట కేడుసంవత్సరముల మూడు మాసములుపట్టును. మృగవ్యాధనక్షత్రముయొక్క కాంతి నక్షత్రమునుండి వెలువడిన తరువాత నిరువదిసంవత్సరములకుఁగాని మనభూమిని జేరలేదు ఇంతకంటెను దూర ములోనున్న నక్షత్రము లింతదవ్వుననున్నవని గణనచేసి నిర్ధారణముచేసి సృష్టిమహిమ లను పూర్ణముగా గ్రహింప నెవ్వరితరము? ఆఱవతరగతి నక్షత్రములకాంతి భూమిని జేరుటకు నూటయిరువదిసంవత్సరములును, బలమైన దూరదర్శక యంత్రములకు మంద ముగా కనఁబడెడి యల్పనక్షత్రముల కాంతి మనభూమినిజేరుటకు మూడువేలయే నూఱుసంవత్సరములును, కావలెనని జ్యోతిశ్శాస్త్ర విశారదు లూహచేయుచున్నారు.

కృతివిమర్శనము.

కేసరీవిలాసము.—మదరాసు హైకోర్టు లాయరుగారగు మహారాజశ్రీ-రెంటాల వెంకటసుబ్బరావు పంతులుగారిచే రచియింపఁబడిన కేసరీవిలాసమను నూతన వచన ప్రబంధము మా కార్యస్థానముచేరినది. ఇందలి కథ మిగుల చిత్రమై మనోహరమై యున్నది. శైలి మృదువై నాతికఠినమై సర్వజనసామాన్య గ్రాహ్యమైయున్నది. గ్రంథకర్త గారిట్టి గ్రంథముల నింకఁ గొన్నిటిని వ్రాయనుద్దేశించినట్లు లిందలి ప్రథమపత్రమును బట్టియే తేటపడుచున్నది. వీరి యుద్యమములను సర్వేశ్వరుఁడు కొనసాగించుఁగాత! గ్రంథమునందు గ్రామ్యపదములు మొదలగునవి పెక్కులు గాన్పించుచున్నవి. గ్రంథాదియందు 'శిరోమణి' కి పండ్రెండు వత్సరంబులును 'కేసరి' కి నేడు వత్సరములునుగల కాలముండే వారికొండొరులయందుఁ 'జెప్పఁదరముగాని ప్రేమానుబంధ' మేర్పడినట్లు వ్రాయఁబడియున్నది. వీరి కప్పటికిఁక నైదు వత్సరములు హెచ్చుగ నున్నట్టు కల్పించియుండిన బాగుండునని మా యభిప్రాయము. ఈకథకు నాయకుఁడు 'శిరోమణి'; నాయకి 'కేసరి' ఈమె సింహళద్వీపపు వర్తకుఁడగు ధనకోటిరాజు కొమార్తె. ఈమె కేడువత్సరముల ప్రాయమప్పుడు ఆదేశపు రాజుగారితో 'శిరోమణి' వీరింటికొకదినమువచ్చెను. అప్పుడు వీరిద్దరొండొరులఁగని మోహముఁగనిరి. వారి ప్రేమానుబంధము నానాటికి వృద్ధిఁజెందెను. శిరోమణికిఁ దనకొమార్తెను వివాహముఁ జేయుట ధనకోటికెంతమాత్ర మిష్టములేదు. కాని కేసరిమాత్రము శిరోమణినే వివాహమాడుటకు నిశ్చయించియుండెను. శిరోమణికి నాగరాజను పినతండ్రికలఁడు. ఇతఁడు మిక్కిలి దుర్మార్గుఁడు. కాని రాజుగారి యాస్థానమునందు మిగులఁ బ్రబలియుండెను. అతఁడు తన మాయోపాయములచే శిరోమణికిని, అతని పెత్తండ్రికుమారుఁడు మహీః కేని, పలువిధములయిన బాధలఁ గలుగఁజేసి రాజద్రోహులని ప్రభువునకు నమ్మకవ పుట్టించి వారిని రాజాగ్రహమునకుఁ బాత్రులుగఁజేసెను. తుదకు వారు నిర్దోషులు గాంచఁబడి మన్నింపఁబడిరి. నాగరాజు తాను త్రవ్వినగోతిలోఁ దానే పడెను. బడచోరను దొంగయొక్క మాయోపాయములుకూడ చక్కఁగ వర్ణింపఁబడినవి. తుదకు వాఁడుకూడ విఫలప్రయత్నుఁడై దూరదేశములకుఁ బాఱిపోయెను. కేసరికిని శిరోమణికిని జరిగిన వివాహమహోత్సవములతో గ్రంథముకూడ ముగిసెను. వలయువారలు చెన్నపురి గ్రంథకర్తగారికి వ్రాసి పుస్తకములను బడయవచ్చును. వెల ఎనిమిదణాలు.

మాంసభక్షక వృక్షములు.

సామాన్యముగా వృక్షములన్నియు వ్రేళ్ళమూలమున భూమిలోనుండి సారము గ్రహించి బ్రతుకును. నాచుమొక్కలు మొదలగునవి కొన్ని భూమిలోనికి వేళ్లు పోనీక నీటిపైని తేలుచు జలములోని సారమునుపీల్చి బ్రతుకును. ఇవిగాక మాంసము తిని జీవించెడు వింతలైన మొక్కలును లోకములోఁ గొన్నికలవు. ఇవి తమమీఁద వాలిన పురుగులు మొదలయిన చిన్నజంతువులను భక్షించును. ఈ చిన్నచెట్లలో ననేక జాతులుగలవు. అందొకజాతిచెట్టుయొక్క పత్రముమీఁద పురుగువాలఁగానే వాలిన పురుగు తప్పించుకొని మరల నెగిరిపోవుట కవకాశము కలుగకుండునంత వేగముగా ఆయాకు ముడుచుకొనిపోయి యాపురుగును తనలోపల బంధించివేయును. అట్లు పట్టుపడిన పురుగుయొక్క మాంసమంతయు కరఁగి వృక్షములోనికి పోవువఱకును ఆకు పట్టువిడువకయుండి తరువాత యథాప్రకారముగా విడిపోవును. ఇంకొకజాతి చెట్టుయొక్క యాకులపయిని కొన్నికాడలు పైకిలేచియుండును. ఆయాకుమీఁద నేదైనపురుగువాలఁగానే యాకాడవంగి యాపురుగును తన కొనలయందూరెడు జిగురుతో పట్టుకొనును. ఆపురుగు దానిని విడిపించుకొనిపోవుటకు శక్తముగాక యందు తగులుకొనియుండి యావృక్షముచే భక్షింపఁబడును. కొన్నిదినములతరువాతఁజూచిన పక్షమున, అట్లు పట్టుపడిన పురుగుయొక్క మెత్తనిభాగ మేదియు నిలిచియుండక లోపలికిపోయి చెక్కలు మొదలయిన పనికిరాని భాగములుమాత్రమే పైని మిగిలియుండును. ఇట్లు పురుగులను పట్టుకొనెడి యాకులమీఁది కాడయొక్క రూప క్రిందిపటమునఁ జూపఁబడియున్నది. వంగిన కాడయొక్క కొన నంటిపట్టుకొన్న



పురుగు మీకిందుఁ గనఁబడుచున్నదిగదా. ఇట్లు పురుగును పట్టుకొనెడి కాడకొనయందలి జిగురు తెగిపోక తీగెలుసాగుచుండును. ఆ జిగురునకు సూదిమొననంటించి సూదిని తీసినపక్షమున సూది పొడుగునను పట్టుదారమువలె జిగురుతీగెలు సాగుచు బహుదూరమువచ్చును. ఈచెట్లుచిత్తడి నేలలయందుండును. వీనికి వేళ్లు భూమిలోనికి లోతుగానుండక పైపైని నాటుకొనియుండును. అందుచేత భూమిలోనిసారమేమియు చెట్టులోనికి పోదు. ఈచెట్లుగాలిలోని సారమును తమమీఁద వాలిన పురుగులనుమాత్ర మాహారముగాఁ గొని బ్రతుకును. పరిశోధించినకొలఁదినిసృష్టిమహిమలు త్రవిచిత్రములుగా నుండును.